
RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com



# భారత శక్తి®
తెలుగు దినపత్రిక
VOICE OF INDIAN
Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal



సంపుటి: 19 సంచిక:211 హైదరాబాద్, ఆదివారం, 23 ఫిబ్రవరి 2025 పేజీలు: 12 వెల: 1.00

## గత 10 ఏళ్ల పరిపాలన పై చర్చిద్దాం రండి: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్

ఈ చర్చలో నేను ఓడితే ముక్కు నేలకు రాస్తా సీఎం రేవంత్ రెడ్డి, ఘాటు వ్యాఖ్యలు నారాయణపేట, ప్రజా పాలన ప్రగతి బాట బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. పేదవాడి ఆత్మ గౌరవం ఇందిరమ్మ ఇండ్లు అని అందుకే రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నా మన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. అలాగే పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు.

పాలమూరు ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదు? 2004 నుంచి 2014 వరకు 25 లక్షల ఇందిరమ్మ ఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తరువాత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు ఏ గ్రామంలో పేదలకు ప్రభుత్వ ఇళ్లు దక్కలేదని,ఇప్పుడు ప్రజా ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను కేటాయించిందని గుర్తు చేశారు. పది సంవత్సరాలు సీఎంగా ఉన్న కేసీఆర్ పాలమూరు ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. అంతకు ముందు ఎంపీగా గెలిపిస్తే ఏనాడూ పాలమూరు గురించి పార్లమెంట్‌లో ప్రస్తావించలేదని అన్నారు.

తెలంగాణ సాధించుకున్న తరువాత కూడా ఈ జిల్లా కు న్యాయం జరగలేదని విమర్శించారు.కృష్ణా నీళ్లు రాయలసీమకు తరలించు కుపోతుంటే కేసీఆర్ నోరె త్తలేదు, గతంలో కొందరు సీఎం లు పాలమూరు పేరు చెప్పి రాజకీయం చేశారు కానీ, జిల్లాకు చేసిందేమీ లేదని రేవంత్ ఆరోపించారు.

నెట్టెంపాడు, భీమ, సంగం బండం, కోయిల్‌సాగర్, కల్వకుర్తి ప్రాజెక్టుల పదేళ్లలో ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. పది సంవత్సరాల్లో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేసి ఉంటే ఇవాళ ఏపీ సీఎం చంద్రబాబుతో పంచాయితీ ఉండేది కాదని తెలిపారు.వైఎస్సార్, జగన్ పోతిరెడ్డి పాడు ద్వారా కృష్ణా నీళ్లు రాయలసీమకు తరలించుకు పోతుంటే కేసీఆర్ నోరెత్తలేదని విమర్శించారు. ఓడితే ముక్కు నేలకు రాస్తా? తన మీద పగతో



మక్తల్ నారాయణపేట-కొడంగల్ ప్రాజెక్టును పక్కన పడేశా రని సీఎం ఆరోపించారు.

ప్రజా పాలన సరిగా లేదని విమర్శలు చేస్తున్నారని అన్నారు. పదేళ్లు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నారని, 12 ఏళ్ల నుంచి మోదీ ప్రధానిగా ఉన్నారని, 12 నెలలుగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలో ఉందని అన్నారు. ప్రతిపక్ష నేతగా కేసీఆర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి చర్చకు వస్తే ముఖ్యమంత్రి గా నేను సిద్ధమని, గత పదేళ్ల పాలన పై చర్చిద్దామని, ఈ చర్చలో ఓడితే ముక్కు నేలకు రాస్తానని సవాల్ విసిరారు.పది సంవత్సరాల్లో ఏమీ చేయని వాళ్లు ఏడాది లోనే కాంగ్రెస్ ఏమీ చేయలేదని అంటున్నారని, పాలమూరు జిల్లాలో ప్రాజెక్టులు, పరిశ్రమలను అడ్డుకోవాలని కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. మోసగాళ్ల మాటలు విని భూసేకర ణను అడ్డుకోవద్దని సూచించారు.భూమి కోల్పోయిన వారికి మంచి పరిహారం ఇచ్చి న్యాయం చేసే బాధ్యత తనదని హామీ ఇచ్చారు.

ప్రజా పాలన సరిగా లేదని విమర్శలు చేస్తున్నారు. పదేళ్లు కేసీఆర్ ముఖ్య మంత్రిగా ఉన్నారు. 12 ఏళ్ల నుంచి మోదీ ప్రధానిగా ఉన్నారు.

12 నెలలుగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలో ఉ ంది. ప్రతిపక్ష నేతగా కేసీఆర్, బీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి చర్చకు వస్తే సీఎంగా నేను సిద్ధం. గత పదేళ్ల పాలన పై చర్చిద్దాం. రండి, ప్రాజెక్టులు పూర్తి చేసినందుకు మేము ప్రయత్నిస్తుంటే, చేతకాని వాళ్లు మమ్మల్ని అడ్డు కుంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఘాటుగా వాక్యానించారు.

==============================

## కులగణన( రీ )సర్వేలో పాల్గొని-సమాజ భవిష్యత్తు నిర్మాణం చేద్దాం

### కులగణన భవిష్యత్ తరాలకు దిక్సూచి: మంత్రి పొన్నం

హైదరాబాద్, ఫిబ్రవరి 22,

జాతీయ బీసీ దళ్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్ లోని మినిస్టర్ కోటర్స్ లో కులగణనపై అవగాహనకు సంబంధించిన టీ షర్ట్ లను లాంచ్ చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. ఈ గొప్ప పనికి శ్రీకారం చుట్టిన జాతీయ బీసీ దళ్, దుండ్ర కుమారస్వామిపై ప్రశంసలు కురిపించారు మంత్రి పొన్నం ప్రభాకర్.

కులగణనకు సంబంధించి ఇంటింటి (రి)సర్వే లో పాల్గొనాలని ప్రజలను చైతన్య పరుస్తోంది జాతీయ బీసీ దళ్. ఇంతకు ముందు ఇంటింటి సర్వేలో పాల్గొనని వారి కోసం ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా రీ సర్వే ను ప్రారంభించింది. ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు వివరాల నమోదుకు అవకాశం కల్పించింది. ఇంతకు ముందు నిర్వహించిన సర్వేలో రాష్ట్రవ్యాప్తంగా 3.1 శాతం మంది వివరాలు నమోదు చేసుకోలేదు. వారికోసం ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించింది. టోల్ ఫ్రీ నెంబర్ 04021111111 కూడా ఏర్పాటు చేసింది. ఆన్లైన్ ద్వారా లేదా మండల కార్యాలయంలో కూడా వివరాలు నమోదు చేసుకునే అవకాశాన్ని ఇచ్చింది.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. టీ షర్ట్స్ ద్వారా అవగాహన కల్పించాలని జాతీయ బీసీ దళ్ చేసిన ప్రయత్నం చాలా గొప్పది. ప్రజలలో మరింత అవగాహన కోసం లాభాపేక్ష లేకుండా జాతీయ బీసీ దళ్ చేస్తున్న ప్రయత్నాలు సంతోషాన్ని ఇస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రానికి చెందిన మేధావులు బీసీ వర్గాల నాయకులు అందరి విజ్ఞప్తి మేరకు కుల గణనలో నమోదు చేసుకొని వారికి మరో అవకాశం ఇవ్వడం జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఇప్పటి వరకు కుల సర్వే లో పాల్గొనకుండా సమాచారం ఇవ్వని వారు ఎన్రోల్ చేసుకోవాలని.. మూడు పద్ధతుల్లో



కుల సర్వే లో సమాచారం ఇవ్వడానికి అవకాశం ఇవ్వడం జరిగిందని, దయచేసి తెలంగాణ సమాజంలో కుల గణన సర్వేలో నమోదు చేసుకోని వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

జాతీయ బీసీ దళ్ అధ్యక్షులు దుండ్ర కుమారస్వామి మాట్లాడుతూ.. కులగణన భవిష్యత్ తరాలకు దిక్సూచిగా మారుతుందని అన్నారు. తెలంగాణలో కులగణన ఓ చారిత్రాత్మక నిర్ణయం. రాహుల్ గాంధీ కులగణన అంశానికి దేశవ్యాప్తంగా బ్రాండ్ అంబాసిడర్. తెలంగాణ కుల గణనను విజయవంతంగా పూర్తి చేసి వెనుకబడిన తరగతులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు న్యాయం చేశారు. కుల గణనలో బీసీ జనాభా లెక్కలు తీసుకుని వస్తామని కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్గాంధీ హామీని రేవంత్రెడ్డి నెరవేర్చారని, అసెంబ్లీలో నివేదికను ప్రవేశపెట్టి చరిత్ర సృష్టించారన్నారు.

## మళ్లీ దడ పుట్టిస్తున్న చైనా

బీజింగ్, ఫిబ్రవరి 22,

చైనా రూపొందించిన రోబో డాగ్, డ్రోన్ మధ్య పోరాట వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇప్పుడు చైనా సైన్యం చేసిన విన్యాసాలు దానికి మరింత ఊతం ఇచ్చాయి. గురువారం(ఫిబ్రవరి20) చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (ఖఒం) న్యూక్లియర్, బయోలాజికల్ అండ్ కెమికల్ డిఫెన్స్ డ్రిల్‌లో లు, రోబోటిక్ డాగ్‌లను ప్రదర్శించారు. చైనా ఇప్పుడు ఇలాంటి రోబోటిక్ కుక్కలపై దృష్టి సారించింది. రక్షణ రంగంలో ముందుకు సాగడంతో పాటు సైన్యాన్ని బలోపేతం చేసే దిశగా దీనిని ఒక పెద్ద అడుగుగా అభివర్ణిస్తున్నారు.రోబోటిక్ డాగ్‌లు శత్రువులను ఎదుర్కోవడానికి వ్యూహాన్ని మెరుగుపరుస్తాయి. సైనికుల బలిదాన ప్రమాదాన్ని తగ్గిస్తాయి. గత సంవత్సరం కూడా, చైనా తన సైన్యంలో భాగమైన రోబోటిక్ కుక్క లక్షణాలను పరిచయం చేసింది. అవి ఎలా పనిచేస్తాయో తెలుసా, చైనీయులకు ఎన్ని రకాల రోబోటిక్ కుక్కలు ఉన్నాయి, చైనా, కంబోడియా మధ్య ఉమ్మడి సైనిక విన్యాసాల వీడియో విడుదలైంది. రోబో డాగ్ సామర్థ్యాలను వీడియోలో చూపించారు. సరళంగా చెప్పాలంటే, శత్రువుల ఇళ్లలోకి ప్రవేశించి వారిపై దాడి చేయగల సైనికులకు ప్రత్యామ్నాయంగా రోబోట్ కుక్కలను తయారు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. నష్టం జరిగితే తక్కువగా ఉంటుంది. చైనా ఇప్పుడు టెక్నాలజీ సహాయంతో తన సైన్యాన్ని బలోపేతం చేసుకుంటోంది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన మానవరహిత వైమానిక వాహనాలు, రోబోట్ కుక్కలు దీనికి ఉదాహరణలు.చైనా రోబో కుక్కలు నడవగలవు. పరుగెత్తవచ్చు. దూకవచ్చు, అడుగడుగునా అడుగులు వేయవచ్చు. అవసరమైనప్పుడు దూకవచ్చు కూడా. అవి అస్సాల్ట్ రైఫిళ్లను కూడా సమర్థవంతంగా నిర్వహిస్తారు. చైనా సైన్యంలో రెండు రకాల రోబో కుక్కలు ఉన్నాయి. మొదటి కుక్క మరింత శక్తివంతమైనది. దీనికి అస్సాల్ట్ రైఫిల్ అమర్చారు. 50 కిలోల బరువున్న ఈ కుక్క తన లక్ష్యాన్ని ట్రాక్ చేస్తున్నప్పుడు తన దిశను కూడా మార్చుకుంటుంది. దాని లక్ష్యం దాని స్థానాన్ని మారుస్తుందని అనుకుందాం. అప్పుడు అది తన స్థానాన్ని మార్చుకుంటూనే తన లక్ష్యాన్ని గురి చూస్తుంది. రెండవ రోబో కుక్క బరువు 15 కిలోలు. దీనిని శత్రువుపై నిఘా పెట్టడానికి, కొన్ని నిర్దిష్ట విషయాలను గుర్తించడానికి ఉపయోగించవచ్చు.ఈ రోబోటిక్ కుక్కలను చైనీస్ స్టార్టప్ కంపెనీ యూనిట్రీ రోబోటిక్స్ అభివృద్ధి చేసిందని అనేక మీడియా నివేదికలలో పేర్కొన్నారు. అయితే, ఆ కంపెనీ దానిని చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీకి సరఫరా చేయడానికి నిరాకరించింది. ఈ రోబోటిక్ కుక్కలను ఎక్కడి నుండి తీసుకువస్తున్నారో చైనా సైన్యం కూడా స్పష్టం చేయలేదు.గత సంవత్సరం గోల్డెన్ డ్రాగన్ 2024 వ్యాయామంలో కూడా వీటిని ప్రదర్శించారు. ఈ సైనిక విన్యాసాలను చైనా, కంబోడియా సంయుక్తంగా 2024 మే 16 నుండి 30 వరకు నిర్వహించాయి. ఈ శిక్షణలో, చైనా సైన్యం తన బలాన్ని ప్రదర్శించింది. భూమిపై, ఆకాశంలో తన ఆధునిక ఆయుధాలను మోహరించింది. ఇప్పుడు మరోసారి చైనా రోబోటిక్ కుక్క వార్తల్లో నిలిచింది. గత నెలలో వైరల్ అయిన ఒక వీడియోలో, కుక్క డ్రోన్‌ను లక్ష్యంగా చేసుకుని దాడి చేస్తున్నట్లు కనిపించింది. ఈ వీడియోపై నెటిజన్లు రకరకాలుగా కామెంట్స్ చేస్తున్నారు.

## ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం.. సీఎం రేవంత్‌రెడ్డికి ప్రధాని మోదీ ఫోన్

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీఫోన్ చేశారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాద ఘటనపై ప్రధాని ఆరా తీశారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలను రేవంత్‌రెడ్డి.. ప్రధానికి వివరించారు. సొరంగంలో ఎనిమిది మంది చిక్కుకున్నారని, వారిని



కాపాడేందుకు సహాయక చర్యలు చేపట్టినట్టు తెలిపారు.

మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారని వెల్లడించారు. ఘటనా స్థలికి ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపిస్తున్నట్టు ప్రధాని మోదీ.. సీఎంకు చెప్పారు. పూర్తి స్థాయిలో సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే 3 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు టన్నెల్ వద్దకు చేరుకున్నాయి. విజయవాడ నుంచి రెండు, హైదరాబాద్ నుంచి ఒక బృందం ఘటనా స్థలికి చేరుకున్నాయి. సింగరేణి నిపుణుల బృందం కూడా అక్కడికి వెళ్లనుంది. నాగర్‌కర్నూల్ కలెక్టర్, ఎస్పీ ఘటనా స్థలిలోనే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

నాగర్‌కర్నూల్ జిల్లాలోని దోమలపెంట సమీపంలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద శనివారం ఉదయం ప్రమాదం చోటుచేసుకుంది. ఎడమవైపు సొరంగం 14వ కిలోమీటర్ వద్ద మూడు మీటర్ల మేర పైకప్పు పడిపోయింది. ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలనే లక్ష్యంతో ఇటీవల ప్రభుత్వం పనులను తిరిగి ప్రారంభించింది. ఇందులో భాగంగా నాలుగు రోజుల క్రితం పనులు ప్రారంభమయ్యాయి. ఈ ఉదయం మొదటి షిఫ్ట్‌లో సుమారు 50 మంది కార్మికులు సొరంగంలోకి వెళ్లారు. ఉ దయం 8.30 గంటల సమయంలో కార్మికులు పని చేస్తుండగా.. అకస్మాతుగా పైకప్పు కూలింది. దీంతో కార్మికులు భయాందోళనకు గురయ్యారు. వారిలో 42 మంది బయటకి రాగా.. 8 మంది కార్మికులు లోపల చిక్కుకున్నారు.

## ఇద్దరు ఐపీఎస్ అధికారులను రిలీవ్ చేసిన తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్: ఐపీఎస్ అధికారులు అంజనీ కుమార్, అభిలాష్ బిస్త్‌ను తెలంగాణ ప్రభుత్వం రిలీవ్ చేసింది. ఏపీలో చేరేందుకు వీలుగా వెంటనే రిలీవ్ చేస్తున్నట్లు సీఎస్ శాంతికుమారి జీవోలో పేర్కొన్నారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి రిలీవ్‌పై ఎన్నికల కమిషన్‌కు ప్రభుత్వం లేఖ రాసింది. కరీంనగర్‌లో ఈనెల 27న ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నందున అభిషేక్ మహంతి విషయంలో నిర్ణయం తీసుకోవాలని ఈసీని కోరుతూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి లేఖ రాశారు.

రహదారి భద్రత అథారిటీ ఛైర్మన్ అంజనీకుమార్(1990), తెలంగాణ పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్(1994), కరీంనగర్ పోలీసు కమిషనర్ అభిషేక్ మహంతి(2011)లు ఏపీకి వెళ్లాలని కేంద్ర హోంశాఖ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చింది. 2014లో ఉమ్మడి రాష్ట్ర విభజన అనంతరం డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్(డీవోపీటీ)... రెండు రాష్ట్రాలకు అఖిల భారత సర్వీసు అధికారులను కేటాయించింది. దీనిపై కొందరు అధికారులు



క్యాట్‌ను ఆశ్రయించడం.. తర్వాత డీవోపీటీ హైకోర్టులో పిటిషన్ వేయడం వంటి పరిణామాలు జరిగాయి. చివరకు 2024లో నియమించిన ఖండేకర్ కమిటీ సిఫార్సుల మేరకు ఇప్పుడు ముగ్గురు ఐపీఎస్‌లను ఏపీలో రిపోర్ట్ చేయాలని హోంశాఖ ఆదేశించింది.

## విరిగిన సీటులోనే గంటన్నర ప్రయాణం: ఎయిర్ ఇండియాపై కేంద్రమంత్రి ఫైర్

ప్రముఖ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా )పై కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మండిపడ్డారు. ఇటీవల భోపాల్ నుంచి దిల్లీకి ప్రయాణించిన సందర్భంలో తనకు విరిగిపోయిన సీటు కేటాయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలు ప్రయాణికులను మోసం చేయడమే అవుతుందని వ్యాఖ్యానించారు. ఎయిర్ ఇండియా నిర్వహణను టాటా గ్రూప్ తీసుకున్న తర్వాత ఎయిర్‌లైన్స్ సేవలు మెరుగుపడతాయని అనుకున్నానని.. కానీ అది తన అపోహేనని అర్థమయ్యిందని మంత్రి అసహనం వ్యక్తంచేశారు.“విమానం ఎక్కిన వెంటనే నేను బుక్ చేసుకున్న సీటు విరిగి ఉండడంతో ఆశ్చర్యపోయాను. దీనిపై ఎయిర్‌లైన్స్ సిబ్బందిని ప్రశ్నించగా.. ఈ సమస్యను యాజమాన్యం ఆలస్యంగా గుర్తించిందని..ఈ సీటు టికెట్‌ను ప్రయాణికులకు విక్రయించకూడదని ఆదేశించిందని తెలిపారు. విమానంలో అదొక్కటే కాకుండా మరిన్ని సీట్లు కూడా సరిగా లేవని సిబ్బంది చెప్పారు” అని కేంద్రమంత్రి సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. తోటి ప్రయాణికులు తమ సీట్లలో కూర్చోమని ఆఫర్ చేశారని అన్నారు. కానీ వారికి ఇబ్బంది కలిగించడం ఇష్టం లేక తాను అదే విరిగిపోయిన సీట్‌లోనే గంటన్నర పాటు కూర్చొని ప్రయాణించానని తెలిపారు.ప్రయాణికుల నుంచి పూర్తి ఛార్జీలు వసూలు చేసి, అసౌకర్యమైన సీట్లు కేటాయించడం ప్రయాణికులను మోసం చేసినట్లు కాదా అని మండిపడ్డారు. భవిష్యత్తులో అయినా ఎయిర్ ఇండియా యాజమాన్యం తమ ప్రయాణికులను ఇటువంటి అసౌకర్యానికి గురికాకుండా చర్యలు తీసుకుంటుందా లేదంటే వారి అవసరాన్ని సొమ్ము చేసుకోవడానికి వాడుకుంటుందా అని ప్రశ్నించారు. కేంద్రమంత్రి ట్వీట్‌పై ఎయిర్‌లైన్స్ స్పందిస్తూ.. ఆయనకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు చెప్పింది. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొంది.

భారత శక్తి
VOICE OF INDIAN

## ఇండియానే ఊపేస్తున్న చావా...

ఒక్క సినిమా.. ఇప్పుడు ఇండియాని కదిలిస్తోంది. ఒక్కడి చరిత్ర.. మరాఠాలందరినీ భావోద్వేగానికి గురిచేస్తోంది. మరాఠా రాజు ఛత్రపతి శంభాజీ మహారాజ్ జీవితకథతో తెరకెక్కిన ఛావా.. సినీ ప్రియుల్నే కాదు భారతీయులందరినీ కదిలిస్తోంది. తెరపై శంభాజీని చూసి.. ప్రతి ఒక్కరూ ఏడ్చేస్తున్నారు. శంభాజీ వీరత్వాన్ని తలచుకొని.. భావోద్వేగానికి గురవుతున్నారు. కానీ.. బొమ్మ పడ్డాక లెక్క మారిపోయిందఛావా.. ఇండియాలో లేటెస్ట్ సెన్సేషన్! అంతకుమించి.. సినీ లవర్స్‌కి, ముఖ్యంగా మరాఠాలందరికీ గట్టిగా కనెక్ట్ అయిన ఎమోషన్. కొన్ని కొన్ని సార్లు.. కొన్ని సినిమాలు ఎలాంటి అంచనాల్లేకుండానే రిలీజ్ అయిపోతుంటాయ్. థియేటర్లో బొమ్మ పడ్డాకే.. దాని వెయిట్ ఏంటో తెలుస్తుంది. ఇప్పుడు టాకీస్‌లో నడుస్తున్న ఛావా కూడా అలాంటిదే! మూవీ టాక్.. ముందు టాకీస్ దాటింది. తర్వాత స్టేట్ బోర్డర్స్ దాటింది. సోషల్ మీడియాలో అయితే.. ఇంటర్నెట్ బారియర్స్‌ని బద్దలుకొట్టి.. ఛత్రపతి శంభాజీ మహారాజ్ చరిత్రని అందరికీ తెలిసేలా చేస్తోంది.ఛావా సినిమాని.. ఎవరూ ఓ సినిమాలా చూడట్లేదు. చూసిన ప్రతి ఒక్కరూ.. సినిమాతో ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతున్నారు. ఛత్రపతి శివాజీ వీరత్వాన్ని, ఆయన వారసుడి పరాక్రమాన్ని తెరపై చూస్తూ.. మళ్లీ చరిత్రను గుర్తు చేసుకుంటున్నారు. భావోద్వేగానికి గురవుతున్నారు. ఛత్రపతి శంభాజీ మహారాజ్‌ని.. మరాఠాలు తమ ఆత్మగౌరవానికి ప్రతీకగా చూస్తున్నారు. ఆ రోజుల్లో.. మొఘలులతో జరిగిన పోరాటం, మరాఠాల వీరత్వం, శంభాజీ పరాక్రమం, ఆయన అనుభవించిన నరకం, చేసిన త్యాగం.. ఇలా ప్రతి ఎలిమెంట్‌తో ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతున్నారు. థియేటర్‌లో కూర్చున్నచోటే నిలబడి.. నివాళులర్పిస్తున్నారు. భావోద్వేగానికి గురవుతున్నారు. చిన్నా, పెద్దా అనే తేడా లేదు. మరాఠా గడ్డపై పుట్టినోళ్లంతా.. ఇప్పుడు ఛావా సినిమాని ఓ పండగలా సెలబ్రేట్ చేసుకుంటున్నారు.నిజానికి.. దేవుడి సినిమాలు, దేశభక్తికి సంబంధించిన సినిమాలు రిలీజైనప్పుడు.. ఇలాంటి సీన్లు థియేటర్లలో కనిపిస్తూ ఉంటాయ్. తెలుగులో అన్నమయ్య, శ్రీరామదాసులాంటి సినిమాలు వచ్చినప్పుడు.. అంతా థియేటర్లకు క్యూ కట్టారు. దేవుళ్లకు, సినిమా పోస్టర్లకు పూజలు చేశారు. ఆ మధ్య వచ్చిన.. ఉరి సినిమాకు కూడా ఇలాంటి రెస్పాన్సే కనిపించింది. హౌ ఈజ్ ద జోష్ అనే స్లోగన్.. ఇండియా మొత్తం రీసౌండ్‌లో వినిపించింది. కానీ.. ఓ పీరియాడికల్ డ్రామాకు.. జనం నుంచి ఇంత స్పందన, ఈ రకమైన ఎమోషనల్ రియాక్షన్ వస్తుందని ఎవరూ ఊహించలేదు. కానీ.. ఇప్పుడదే జరుగుతోంది. చరిత్ర సృష్టించి.. చరిత్రలో గొప్పగా నిలిచిపోయిన ఛత్రపతి శంభాజీ మహారాజ్ గురించి.. ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చ నడుస్తోంది.సినిమా.. చాలా మందికి ఎమోషనల్‌గా కనెక్ట్ అయింది. మూవీ టాక్ విన్నాక.. థియేటర్లలో ఆడియెన్స్ ఎమోషనల్ రియాక్షన్స్ చూశాక.. అంతా తీరిక చేసుకొని మరీ.. సినిమాకు వెళ్తున్నారు. కనెక్ట్ అవుతున్నారు. అక్కడే ఏడ్చేస్తున్నారు. ఛత్రపతి శంభాజీ మహారాజ్ చరిత్రని తెరపై చూస్తూ.. పండగ చేసుకుంటున్నారు.ఛత్రపతి శంభాజీ మహారాజ్ పాత్రలో విక్కీ కౌశల్ నటన చూశాక.. ప్రతి ఒక్కరూ ఆ పాత్రతో కనెక్ట్ అవుతున్నారు. థియేటర్‌కు వచ్చిన ప్రేక్షకులు.. క్లైమాక్స్‌లో భావోద్వేగానికి గురవుతున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. శంభాజీ పాత్రలో విక్కీ కౌశల్ యాక్టింగ్ చూసివాళ్లంతా.. శభాష్ అంటున్నారు. ఊహించని విధంగా బ్లాక్ బస్టర్ అయిన ఈ సినిమాని.. అభిమానులు, మరాఠా ప్రజలు సెలబ్రేట్ చేసుకుంటున్న తీరు అందరినీ ఆకర్షిస్తోంది. సినిమా పూర్తవగానే.. ఏకంగా గుర్రంపై శంభాజీ వేషధారణలో సినిమా హాల్లోకి వచ్చేశాడు ఓ అభిమాని. ఇది చూసిన వారంతా.. జై శంభాజీ మహారాజ్ అంటూ నినాదాలు చేయడం వైరల్‌గా మారింది.చిన్నా, పెద్దా అనే తేడా లేదు. ఛావాను ప్రతి ఒక్కరూ ఎంజాయ్ చేస్తున్నారు. సినిమా చూసి చిన్నారులు చేస్తున్న నినాదాలు అందరినీ భావోద్వేగానికి గురిచేస్తున్నాయి. శంభాజీ మహారాజ్‌కు జై, జై భవానీ.. నినాదాలతో థియేటర్లు దద్దరిల్లిపోతున్నాయి. ఇలాంటి వీడియోలు షేర్ చేస్తూ.. ఇది తాము సొంతం చేసుకున్న నిజమైన గౌరవం అంటూ ఛావా మూవీ టీమ్ చెబుతోంది. సినిమా చూసిన చాలా మంది.. థియేటర్ల నుంచి కన్నీళ్లతో బయటకొస్తున్నారు. ఛత్రపతి శివాజీ వారసుడి పరాక్రమాన్ని, వీరత్వాన్ని గుర్తుచేసుకుంటున్నారు.దక్కన్ కా శివ! మరాఠాల ఛత్రపతి.. శివాజీ మహారాజ్! కాలగమనంలో.. సింహం పడిపోయి ఉండొచ్చు. కానీ.. అప్పటికి సింహం పిల్ల బతికే ఉంది. అతడే.. ఛత్రపతి శంభాజీ మహారాజ్. మరాఠాల.. ఛావా! ఛత్రపతి శివాజీ పెద్దకొడుకుగా.. ఆయన మరణానంతరం ఆయన వారసుడిగా మరాఠా రాజ్యాన్ని పాలించాడు శంభాజీ. తండ్రికి ఏమాత్రం తగ్గకుండా.. తాను ఉన్నంత వరకు మొఘులుల గుండెల్లో భయం అనే టైమ్ బాంబుని పెట్టిన మొనగాడు ఛావా! అతను.. మరాఠాల ఆత్మగౌరవమే కాదు.. హిందుత్వ అస్థిత్వం కూడా! అందుకే.. ఛావా ఇంతలా జనానికి కనెక్ట్ అయింది.లక్షల మంది సైన్యంతో మొఘులులు చేసిన దండయాత్రల్ని.. వీరోచితంగా తిప్పికొట్టాడు శంభాజీ. శంభాజీ ధాటికి తట్టుకోలేక.. ఔరంగజేబు.. 27 ఏళ్ల పాటు ఉత్తర భారతంలోకి అడుగుపెట్టలేకపోయాడు. కొద్దికాలంలోనే.. శంభాజీ మెరుపు వీరుడిలా విజృంభించాడు. కొంకణ్ తీరంలో బలవంతపు మత మార్పిళ్లతో హిందువుల్ని హింసిస్తున్న వాళ్లని.. తరిమికొట్టాడు. శంభాజీ పోరాటం వల్లే.. హిందూ ధర్మ రాజ్యం వేళ్లూనుకొని పటిష్టంగా నిలిచింది. అఖండ భారతమంతటికీ విస్తరించింది.శివాజీ అస్తమయం తర్వాత.. ఔరంగజేబు హిందూ ధర్మ రాజ్యాన్ని నాశనం చేసేందుకు కక్షకట్టాడు. తన సమస్త బలగాలని, యుద్ధాలను మరాఠాల మీదే కేంద్రీకరించాడు.

# తిరుపతి మేయర్ పై అవిశ్వాసం


తిరుపతి, ఫిబ్రవరి 22( కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో మార్పులు జరుగుతున్నాయి. తిరుపతిలో సైతం మార్పులు చోటు చేసుకుంటున్నాయి. త్వరలో మేయర్‌పై అవిశ్వాసానికి సిద్ధమవుతున్నట్లు కార్పొరేటర్లు చర్చించుకుంటున్నారు. తిరుపతి ఆధ్యాత్మిక నగరంలో 3 లక్షలపైగా ఓటర్లు ఉన్నారు. ఇక్కడ 50 డివిజన్లు ఉన్నాయి. 2020లో కొవిడ్ ప్రారంభ సమయంలో కార్పొరేషన్ ఎన్నికలు జరగ్గా అప్పట్లో అధికారంలో ఉన్న వైసీపీ ధన, ఆర్థిక, అంగ బలంతో 50 డివిజన్లలో 25శాతం మాత్రమే ఎన్నికలు జరిగేలా చేసింది. అప్పట్లో కనీసం నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చిన వారి డాక్యుమెంట్లు సైతం లాకెళ్లిన ఘటనలు చూశాం. ఆ సన్నివేశాలను పోలీసులు చూస్తు ఉన్నారు తప్ప ఏమి చేయలేని పరిస్థితి. నామినేషన్లు దాఖలు చేసిన వారివి సైతం పత్రాలు చింపేసి అధికారులను అడ్డం పెట్టుకుని మరీ ఏకగ్రీవాలు చేశారు. ఆ సమయంలో కొవిడ్ కారణంగా లాక్ డౌన్ రావడంతో ఆ ఎన్నికలు వాయిదా పడ్డాయి. కొవిడ్ పరిస్థితుల తరువాత జరిగిన ఎన్నికల్లో వైసీపీ కార్పొరేటర్లు 50గాను 48 సొంత చేసుకున్నారు. 1 మాత్రమే టీడీపీ కైవసం చేసుకోగ.. 1 డివిజన్ కార్పొరేటర్ కోర్టును ఆశ్రయించగా ఎన్నికలు లేకుండా పోయింది.50 మంది కార్పొరేటర్లు మేయర్‌గా బీసీ (యాదవ) వర్గానికి చెందిన డాక్టర్ శిరీష ఎన్నికయ్యారు. డిప్యూటీ మేయర్‌గా కాపు సామాజిక వర్గానికి చెందిన ముద్ర నారాయణను నిలబెట్టారు. అప్పటి వైసీపీ ప్రభుత్వం రెండో డిప్యూటీ మేయర్ కోసం జీవో విడుదల చేయగా రెండో డిప్యూటీ మేయర్‌గా అప్పటి తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి కుమారుడు భూమన అభినయ్ రెడ్డిని ఎన్నుకున్నారు. గడిచిన నాలుగేళ్ల కాలంలో వైసీపీ తరపున కార్పొరేటర్లు నోరు సైతం మెదపకుండా వారికి కావాల్సింది చేసుకుంటూ కౌన్సిల్ సమావేశం మీడియా సైతం అనుమతి లేకుండా పాలన సాగించారు. 2024లో సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం తరపున తిరుపతిలో జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు 60వేల పైగా మెజారిటీతో గెలుపొందారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన 4 కార్పొరేటర్లు ఈ విజయంలో కీలక పాత్ర పోషించారు. ఎన్నికల తరువాత కొంత మంది కార్పొరేటర్లు సైతం వైసీపీ వీడి కూటమి వైపు మొగ్గు చూపినా తీసుకోవడానికి ఆసక్తి చూపలేదు. అప్పటి వరకు బాగానే ఉన్నా మేయర్ తన పదవితో ఎమ్మెల్యే సహా ఎవర్నీ మాట్లాడనీయకుండా చేశారు. కూటమి ప్రభుత్వానికి మద్దతు ఇచ్చే కార్పొరేటర్లను టార్గెట్ చేసినట్టు చెప్పుకుంటున్నారు. ఎన్నికల్లో ఓటమి కారణంగా రెండో డిప్యూటీ మేయర్ అభినయ్ రెడ్డి రాజీనామా చేశారు. డిప్యూటీ మేయర్ పోస్టు ఖాళీ కావడంతో ఇటీవల డిప్యూటీ మేయర్ పోస్టుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ఎన్నికల్లో నాటకీయ పరిణామాలు జరిగాయి. ఈ డ్రామా మధ్యే 35వ డివిజన్ కార్పొరేటర్ ఆర్సీ ముని కృష్ణ డిప్యూటీ మేయర్ ఎన్నికయ్యారు. డిప్యూటీ మేయర్ ఎన్నిక తరువాత తొలి తిరుపతి కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ క్రమంలో డిప్యూటీ మేయర్‌గా ఆర్సీ ముని కృష్ణ ప్రమాణ స్వీకారం జరిగింది. ఆ తరువాత బడ్జెట్ సమావేశం నిర్వహించారు. అనంతరం అజెండా అంశాలు చర్చకు వచ్చాయి. తన ముందే డిప్యూటీ మేయర్ ఎన్నిక సందర్భంగా అధికారులు దౌర్జన్యానికి దిగారని వారిపై చర్యలు తీసుకోవాలని మేయర్ డాక్టర్ శిరీష డిమాండ్ చేశారు. దీనిపై రియాక్ట్ అయిన కమిషనర్ మౌర్య క్షమాపణ చెప్పి ఏమి జరిగిందో విచారణ చేస్తామని చెప్పారు. అయితే దానికి సంతృప్తి చెందని మేయర్ కౌన్సిల్ నుంచి బాయ్ కాట్ చేశారు. దీంతో ఏమి చేయాలో తెలియక... కోరం నిర్ణయం మేరకు జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు మేరకు డిప్యూటీ మేయర్ గా ఉన్న ముద్ర నారాయణను మేయర్ గా పెట్టి కౌన్సిల్ పూర్తి చేశారు.తిరుపతి మేయర్ ఉన్న అక్రమంగా భవనాలకు ఎలా అనుమతి ఇచ్చారు. ఇంత కాలం ఏమి చేశారు. అధికారుల పై చర్యలు గతంలో ఎందుకు తీసుకోలేదని కార్పొరేటర్లు చర్చకు దిగారు. మేయర్ హోదాలో సభ నుంచి బాయ్ కాట్ చేయడం ఏంటని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలంటే అవిశ్వాసం పెట్టి ఆమెను పదవి నుంచి తొలగించాలని పావులు కదుపుతున్నారు. బీసీ (యాదవ్) సామాజికవర్గానికి చెందిన అన్నా అనిత, అన్నిత సంధ్య మేయర్ పదవి కోసం ఎదురుచూస్తుండగా ఇదే అదునుగా భావించి మరింత వేగంగా కార్పొరేటర్లతో చర్చలు జరుపుతున్నారు. మార్చి నెలలో జరిగే కౌన్సిల్ సమావేశంలో మేయర్‌పై అవిశ్వాసానికి సిద్ధమవుతున్నారు. మిగిలిన 8 నెలల కాలంలో మేయర్ పదవి సొంతం చేసుకోవడం వల్ల ఏమి లాభం ఉంటుందనేది కూడా చర్చకు వచ్చినట్లు సమాచారం. ఏమి జరుగుతుందో మార్చి వరకు వేచి చూడాల్సిందే.

================

## లగడపాటి దారిలో కేశినేని నాని, కాకపోతే చిన్న ట్విస్ట్

విజయవాడ, ఫిబ్రవరి 22

బెజవాడలో రాజకీయ నేతలు ఓడిపోతే రాజకీయాలకు దూరమైనట్టేనా? కాంగ్రెస్ మాజీ ఎంపీ లగడపాటి దారిలోనే కేశినేని నాని నడుస్తున్నారా? కేశినేని నాని కామెంట్స్ వెనుక అసలేం జరుగుతోంది? నాని చూపంతా కమలంపై పడిందా? పదవి లేకపోయినా.. ప్రజలకు అందుబాటులో ఉంటానని ఎందుకన్నారు? ఇదే చర్చ ఏపీ రాజకీయాల్లో సాగుతోంది.విజయవాడ మాజీ ఎంపీ కేశినేని నాని తిరిగి రాజకీయాల్లో యాక్టివ్ అవుతున్నట్లు కనిపిస్తోంది. విజయవాడ పార్లమెంట్ సెగ్మెంట్‌లో తిరువూరు, నందిగామ, మైలవరం ప్రాంతాల్లో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉన్నట్లు తెలుస్తోంది. వచ్చే ఎన్నికల కోసం ఇప్పటి నుంచే గ్రౌండ్ ప్రిపేర్ చేసుకున్నట్లు ఓ టాక్ నడుస్తోంది. తాను బరిలోకి దిగుతానని సన్నిహితుల వద్ద ఆయన చెప్పినట్టు ఓ ఫీలర్ బెడవాడ పొలిటికల్ సర్కిల్స్ లో హంగామా చేస్తోంది. ఆయన ఏ పార్టీ వైపు వెళ్తారు అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.చిరంజీవి పెట్టిన ప్రజారాజ్యం పార్టీతో రాజకీయాల్లోకి వచ్చారు కేశినేని నాని. కొద్దిరోజుల తర్వాత ఆ పార్టీకి గుడ్ బై చెప్పేశారు. కొత్త పార్టీ కంటే పాత పార్టీలే బెటరని భావించారు. ఆ తర్వాత టీడీపీలోకి ఎంట్రీ ఇచ్చారు. 2014, 19 ఎన్నికల్లో టీడీపీ నుంచి ఎంపీగా గెలిచారు. తన జిల్లాకు చెయాల్సిన పనులు చేపట్టారు. కాకపోతే రెండుసార్లు ఎంపీగా గెలవడంతో తనకు తిరుగులేదని భావించారు. ఆ తర్వాత పార్టీకి వ్యతిరేకంగా గళం వినిపించారు. గత ఎన్నికల ముందు వైసీపీ తీర్థం పుచ్చుకున్న ఆయన, తన తమ్ముడు శివనాథ్ చేతిలో ఓటమి పాలయ్యారు. ఆనాటి నుంచి రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు.లేటెస్ట్‌గా నందిగామలో జరిగిన ఓ కార్యక్రమంలో మాజీ ఎంపీ కేశినేని నాని పాల్గొన్నారు. తాను రాజకీయాల నుంచి తప్పుకున్నానని, కాకపోతే ప్రజా సేవ మాత్రం వీడలేదన్నది ఆయన మాట. పదవిలో లేకపోయినా ప్రజలకు నిత్యం అందుబాటులోనే ఉంటానని తన మనసులోని మాట బయటపెట్టారు. గడిచిన పదేళ్లు ఎవరి దగ్గర కప్పు టీ కూడా తాగకుండా పని చేశానని తన గురించి కాసింత మంచి మాటలు చెప్పుకొచ్చారు.ప్రస్తుతం కేశినేని నాని చూపు బీజేపీపై పడింది. ఎంపీగా ఉన్న పదేళ్ల కాలంలో బీజేపీ నేతలతో ఆయనకు మంచి సంబంధాలు ఉన్నాయి. ఈ సంబంధాలను ఉపయోగించుకుని



కాషాయం పార్టీలో చేరాలని భావిస్తున్నట్లు నాని అనుచరుల మాట. మరోవైపు ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరితో ఆయన ఇప్పటికే మంతనాలు చేసినట్టు తెలుస్తోంది. ఈ విషయమై పార్టీ హైకమాండ్ తో ఆయన చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.కూతురు శ్వేతకు రాజకీయ భవిష్యత్తు ఇవ్వడం కోసం ఆయన బీజేపీని ఎంచుకున్నట్లు వార్తలు లేకపోలేదు. కేశినేని నాని చేరికను టీడీపీ అంగీకరిస్తుందా? అనేది ఇక్కడ ఆసక్తికరమైన విషయం. ఒకవేళ కేశినేని నాని బీజేపీ తీర్థం పుచ్చుకుంటే విజయవాడ రాజకీయాలు మరింత ఆసక్తికరంగా మారే అవకాశాలున్నాయి.ఒక్కసారి విజయవాడ ఎంపీ నియోజకవర్గం విషయానికొస్తే.. విజయవాడలో కంటిన్యూగా రెండుసార్లు ఎంపీగా గెలిచినవారు ఆ తర్వాత రాజకీయాలకు దూరమైన సందర్భాలు ఉన్నాయి. గతంలో ఉపేంద్ర రెండుసార్లు (1996, 1998) కాంగ్రెస్ ఎంపీగా గెలిచారు. ఆ తర్వాత రాజకీయాలకు దూరమయ్యారు. మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ కూడా అంతే. 2004, 2009 ఎన్నికల్లో ఎంపీగా గెలిచారు. ఆ తర్వాత ఆయన గుడ్ బై చెప్పేశారు. ఇప్పుడు మాజీ ఎంపీ కేశినేని నాని వంతైంది. ఆయన కూడా 2014, 2019 ఎన్నికల్లో ఎంపీగా గెలిచి పార్లమెంటులో అడుగుపెట్టారు. ఈ క్రమంలో కేశినేని కూడా రాజకీయాలకు దూరమయ్యారు.

## తినోళ్లకు తిన్నంత చికెన్

గుంటూరు, ఫిబ్రవరి 22

తెలుగు రాష్ట్రాలను బర్డ్ ఫ్లూ భయాలు వెంటాడుతున్నాయి. చికెన్ తింటే బర్డ్ ఫ్లూ వస్తుందనే భయంతో చాలా మంది చికెన్, కోడి గుడ్లకు దూరంగా ఉంటున్నారు. మాంసం, కోడి గుడ్లు బాగా ఉడికిస్తే ప్రమాదం ఉండదని అధికారులు చెప్తున్నప్పటికీ.. జనాల్లో ఆందోళన తగ్గడం లేదు. దీంతో చికెన్ రేట్లు పడిపోయాయి. కోడి గుడ్డు ధర సైతం భారీగా పతనమైంది. చికెన్, కోడిగుడ్ల రేట్లు పడిపోవటంతో కోళ్లఫారం యజమానులు, పౌల్ట్రీ రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ఫౌల్ట్రీ ఫెడరేషన్ నివారణ చర్యలకు దిగింది. ఫౌల్ట్రీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బర్డ్ ఫ్లూపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. అందులో భాగంగానే గుంటూరులో చికెన్ ఫుడ్ మేళా నిర్వహించారు.ఫౌల్ట్రీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహించిన చికెన్ ఫుడ్ మేళాకు విశేషమైన స్పందన వచ్చింది. చికెన్ ఫుడ్ మేళాలో నిర్వాహకులు చికెన్ వంటకాలను ఉచితంగా అందజేశారు. ఉడికించిన చికెన్, కోడి గుడ్లు తినడం వల్ల ఇబ్బంది ఉండదని వచ్చిన జనాలకు నిర్వాకులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, నసీర్ అహ్మద్ సైతం పాల్గొన్నారు. మరోవైపు ఉచితంగా చికెన్ వంటకాలు పంపిణీ చేస్తూ ఉండటంతో ఆహార ప్రియులు చికెన్ ఫుడ్ మేళాకు భారీగా తరలివచ్చారు. దీంతో ప్రాంగణం మొత్తం నిండిపోయింది. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా నిర్వాహకులు గేట్లకు తాళం వేయాల్సి వచ్చింది. అటు హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో కూడా ఇలాగే ఫ్రీగా చికెన్ పంపిణీ చేశారు. ఉచితంగా చికెన్, కోడిగుడ్ల వంటకాలు పంపిణీ చేశారు. దీంతో ఈ చికెన్ మేళాకు భారీగా జనం క్యూ కట్టారు. సుమారుగా అర కిలోమీటర్ మేర బారులు తీరారు.మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో బర్డ్ ఫ్లూ వైరస్ వ్యాప్తి అదుపులో ఉందని ఏపీ పశుసంవర్ధక శాఖ తెలిపింది. బర్డ్ ఫ్లూ వైరస్ గురించి పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ ఇటీవల ప్రకటన విడుదల చేశారు. తూర్పుగోదావరి జిల్లా కానూరు అగ్రహారం, పశ్చిమ గోదావరి జిల్లాలోని వేల్పూరు, కృష్ణా జిల్లాలోని బాదంపూడి, కర్నూలు జిల్లాలోని ఎన్.ఆర్.పేట, ఎన్టీఆర్ జిల్లాలోని గంపలగూడెంలో బర్డ్ ఫ్లూ వైరస్ కేసులు నమోదయ్యాయి. దీంతో ఆయా ప్రాంతాలలో పశు సంవర్ధక శాఖ అధికారులు ఆంక్షలు అమలు చేస్తున్నారు. బర్డ్ ఫ్లూ వైరస్ కారణంగా కోళ్లు చనిపోయిన ప్రాంతాలను కంటైన్‌మెంట్ జోన్లుగా ప్రకటించి.. అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు వైరస్ విస్తరించకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఆ ప్రాంతం నుంచి కోళ్లు, కోడిగుడ్ల రవాణాపై ఆంక్షలు విధించారు.

# ఒక్క రోజే ప్లీనరీ

కాకినాడ ఫిబ్రవరి 22(

జాతీయ పార్టీ అయినా ప్రాంతీయ పార్టీ అయినా ప్లీనరీ అంటే ఆ పార్టీ కార్యకర్తలకు అభిమాన శ్రేణులకి పండగనే చెప్పాలి. సాధారణంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్లీనరీలు ఏర్పాటు చేస్తుంటారు పార్టీల అధినేతలు. పార్టీ శ్రేణులకు భవిష్యత్తు దిశా నిర్దేశం చేయడానికి ప్లీనరీలను ఏర్పాటు చేస్తాయి రాజకీయ పార్టీలు. పవన్ కల్యాణ్ లాంటి విపరీతమైన జనాకర్షణ ఉన్న నాయకుడు తన పార్టీకి ప్లీనరీ ఏర్పాటు చేస్తే ఆయన అభిమానులకు కార్యకర్తలకు ఎంతటి ఉత్సాహం ఉంటుందో చెప్పనక్కర్లేదు. ఇప్పుడు జనసేన నేతలు, ఆయన అభిమానులు దాని కోసమే ఎదురు చూస్తున్నారు. పార్టీ స్థాపించిన పదేళ్లకు అధికారంలోకి వచ్చాం ప్లీనరీ ధూంధాంగా చేస్తారని రెండు రాష్ట్రాల్లోని జనసైనికులు ఎంతగానో ఎదురు చూస్తూ ఉన్నారు. ఇదిగో అదిగో అంటూ చాలా కాలం నుంచి వారిని ఊరిస్తూ వచ్చిన పార్టీ చివరకు విషయాన్ని చాలా కూల్‌గా చెప్పేసింది. ఈసారి పవన్ కల్యాణ్ సొంత నియోజకవర్గంలో గ్రాండ్‌గా సెలబ్రేట్ చేయబోతున్నారని పేర్కొంది. అయితే అందులో కూడా భారీ ట్విస్ట్ ఇచ్చింది జనసేన అధినాయకత్వం. కొద్ది కాలంగా ప్రచరాంలో ఉన్నట్టు మూడు రోజులు కాకుండా కేవలం ఒక్కరోజుకే ప్లీనరీని పరిమితం చేసింది. నిన్న మొన్నటి వరకు పితాపురంలో ఈ ప్లీనరీ మూడు రోజులు పాటు జరుగుతుంది జోరుగా ప్రచారం జరిగింది. దీనిపై జనసేన హైకమాండ్ నీళు చల్లి ఒక్క రోజుకే పరిమితం కావడంతో జన సైనికుల్లో నిరాశ కనిపిస్తోంది.అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి జరుగుతున్న పార్టీ ప్లీనరీ అందులోనూ అధినాయకుడు పవన్ కల్యాణ్ రికార్డు మెజారిటీతో గెలిచిన పితాపురంలో తొలి ప్లీనరీ. జన సైనికులు ఆనందంతో ఉప్పొంగిపోవడానికి ఈ ప్రకటన చాలు. మొదట్లో దానికి అనుగుణంగానే మూడు రోజులపాటు అంటే మార్చి 12 నుంచి 14 వరకు ప్లీనరీ జరుగుతుందని భావించారు. అందుకు తగ్గట్టుగానే పార్టీ ప్రతినిధులతో సమావేశం, శ్రేణులకు దిశా నిర్దేశం జరిగిపోయింది. జన సైనికులను ప్రజలను ఉద్దేశించి బహిరంగ సభ అందులో పవన్ ప్రసంగం ఇలా పక్కా ప్లాన్‌తో మూడు రోజుల పాటు ప్లీనరీ సంబరం జరుగుతుందని అంతా భావించారు. ఈవిషయాన్ని జనసేన ముఖ్య నేతలు నాదెండ్ల మనోహర్ సహా ఇతర కీలక నేతలు జనవరిలోనే ప్రకటించారు. కాని సడన్‌గా ప్లీనరీ ఒక్కరోజే జరుగుతుందని జనసేన నుంచి ప్రకటన వెలువడింది. పార్టీ ఆవిర్భవించిన మార్చి 14 బహిరంగ సభ ఉంటుందని ప్రస్తుతానికి స్పష్టత వచ్చింది. పార్టీ ప్రతినిధుల సమావేశం అదే రోజు ఉదయం పూట జరుగుతుందా లేక అది రద్దు అవుతుందా అని దానిపై ప్రస్తుతానికి స్పష్టత రాలేదు.ఇటీవల పవన్ కల్యాణ్ అస్వస్థతకు లోనైనట్లు జనసేన వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల జరిగిన క్యాబినెట్ మీటింగ్‌కి ఆయన అటెండ్ కాలేదు. అలాగే "జనంలోకి జనసేన" కార్యక్రమంలోనూ ఆయన పాల్గొన లేదు. ప్రస్తుతానికి ఆయన ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో బిజిగా ఉంటున్నారు. ఎక్కువగా స్ట్రెస్ తీసుకోవడం లేదని సమాచారం. ఒకవేళ ఇదే కారణమా లేక మరేదైనా ఆలోచనో తెలియదు. కానీ మూడు రోజులు జరుగుతుందని చెప్పిన ప్లీనరీ ఒక్క రోజుకే పరిమితం కావడం మాత్రం తమ అధినాయకుడు మూడు రోజులు పాటు తమతోనే ఉంటాడు అని భావించిన జన సైనికులకు కాస్త నిరాశ కలిగించే అంశమే.

## హోమో సెక్స్ వద్దన్నాడని హత్య

సిద్దిపేట

సిద్ధిపేటలో ఈ నెల 19న జరిగిన హత్యకేసుని పోలీసులు ఛేదించారు. హోమో సెక్స్ కి సహకరించలేదని స్నేహితుడిని నిందితుడు కొట్టి చంపినట్లు గుర్తించారు. శ్రీనివాస్(40), రాజు ఇద్దరు స్నేహితులు. గత కొంతకాలంగా రాజు భార్యతో గొడవల కారణంగా ఒంటరిగా ఉంటున్నాడు. ఈ నెల 19న నర్సాపూర్ చౌరస్తాలోని ఓ బిల్డింగ్ లో శ్రీనివాస్ కి రాజు మద్యం తాగించాడు. శ్రీనివాస్ మద్యం మత్తులోకి జారుకోగానే హోమో సెక్స్ కి ప్రయత్నించాడు. శ్రీనివాస్ కి మెలుకువ వచ్చి ప్రతిఘటించడంతో కర్రతో కొట్టి చంపివేసాడు.

## యాదాద్రిలో కొనసాగుతున్న మహా కుంభాభిషేకం

యాదాద్రియాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి స్వర్ణ విమాన రాజగోపురం మహా కుంభాభిషేకం మూడో రోజు పూజలు నిర్వహించడం జరిగింది యాగశాలలో స్వామివారి అమ్మవారి ఉత్సవ మూర్తులను ప్రతిష్టించి యజ్ఞాతి హోమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రుత్వికులను ఆహ్వానించడం జరిగింది. 23వ తేదీన ఉదయం 10:30 నుండి మహా కుంభాభిషేకం నిర్వహించడం జరుగుతుందని ఆలయ ప్రధాన అర్చకులు తెలిపారు.

భారత శక్తి

ఆదివారం, 23 ఫిబ్రవరి 2025

# కరీంనగర్ సమీపంలో చింతకుంట వద్ద ఘోర ప్రమాదం...

## అదుపు తప్పి డివైడర్ ను ఢీ కొట్టిన బైక్.. ఒకరు మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు

కరీంనగర్

కరీంనగర్ సమీపంలోని చింతకుంట వద్ద తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బైక్ అదుపు తప్పి డివైడర్ ను ఢీ కొట్టి రోడ్డుపై పడడంతో బైక్ పై ఉన్న ఇద్దరు యువకుల్లో ఒకరు అక్కడికక్కడే మృతి చెందాడు. మరొకరు గాయపడ్డారు. మృతుడు గాయపడ్డ యువకుడు కరీంనగర్లోని న్యూ శ్రీనగర్ కాలనీకి చెందిన వారుగా గుర్తించారు. ప్రమాద దృశ్యాలు సిసి కెమెరాల్లో రికార్డ్ అయ్యాయి. ప్రమాదం జరిగి రోడ్డుపై పడ్డ యువకుడు ఒకరు లేచి దారిలో పోయేవారిని ఆపే ప్రయత్నం చేసిన ఎవరు ఆగకుండా వెళ్ళిపోయారు. సోషల్ మీడియాలో ఈ వీడియో వైరల్ గా మారింది. ప్రమాదం పై కొత్తపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# సీఎం రేవంత్ రెడ్డికి బిఆర్ఎస్ నేత మాజీ ఎంపీ వినోద్ కుమార్ బహిరంగ లేఖ

కరీంనగర్

కాళేశ్వరం ప్రాజెక్టు ను బద్నాం చేసేందుకు మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుపై కాంగ్రెస్ బిజెపి రాజకీయం చేశాయని బిఆర్ఎస్ నేత మాజీ ఎంపీ వినోద్ కుమార్ ఆరోపించారు. మరమ్మత్తుల పేరుతో కాలయాపన చేస్తూ రైతులతో చెలగాటం ఆడొద్దని హితవు పలికారు.

కరీంనగర్లో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జివి రామకృష్ణారావుతో కలిసి మీడియాతో మాట్లాడిన వినోద్ కుమార్, కాంగ్రెస్ ప్రభుత్వ తీరు బిజెపి నేతల వైఖరిపై మండిపడ్డారు. కేసీఆర్ నేతృత్వంలో పదేళ్ళు రైతులకు సాగునీటికి డోకా లేకుండేనని, కాంగ్రెస్ ప్రభుత్వం తొలి ఏడాదిలోనే రైతులకు నీళ్లు ఇవ్వలేని దుస్థితి నెలకొందన్నారు. మరమ్మత్తులకు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ అనుమతులకు సంబంధం లేదని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో డ్యాం ఓనర్ గా తెలంగాణ ప్రభుత్వం ఉందన్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టును రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవాలని ప్రభుత్వం చూస్తుందని విమర్శించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లేఖ రాయడంతోనే స్టేట్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నుంచి మేడిగడ్డ అంశం నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ పరిధిలోకి వెళ్ళిందన్నారు. మేడిగడ్డ బ్యారేజ్ పాక్షిక కుంగుబాటును చూపించి కాళేశ్వరం ప్రాజెక్టు ఒక విఫల ప్రాజెక్టుగా చిత్రీకరించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఇప్పటికైనా కుంటి సాకులు చెబుతూ కాలయాపన చేయకుండా తక్షణ చర్యలపై దృష్టి పెట్టాలని కోరారు.

బ్యారేజీల శాశ్వత మరమ్మత్తులు పూర్తిచేసి కాళేశ్వరం ప్రాజెక్టను నీళ్లను వినియోగించుకునేలా కార్యాచరణ చేపట్టాలన్నాలరు వినోద్ కుమార్.

# ప్రజా ఉపయోగ పనులపై అధికారులు దృష్టి సారించాలి

**వనపర్తి నియోజకవర్గం అభివృద్ధికి పూర్తి సహకారం**

**నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడే ఎమ్మెల్యే మేఘారెడ్డి**

**వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

వనపర్తి ఫిబ్రవరి 22, (న్యూస్ పల్స్)

అధికారులు ప్రజా ఉపయోగపరమైన పనులపై దృష్టి సారించి పనుల్లో వేగవంతం పెంచాలని, వనపర్తి నియోజకవర్గ అభివృద్ధికి తాను ఎల్లవేళల సహకరిస్తానని, వనపర్తి శాసనసభ్యులు మేఘారెడ్డి కష్టపడే తత్వం గల వ్యక్తి ఉన్నాడని ఆయన ప్రతిపాదించిన ప్రతి పనిని తాము ఆమోదించి మంజూరు చేసే విధంగా కృషి చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం వనపర్తి నియోజకవర్గం పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామంలో నూతనంగా నిర్మించే ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రా నిర్మాణానికి, వ్యవసాయ శాఖ మంత్రితోపాటు టూరిజం శాఖ మాత్యులుజూపల్లి కృష్ణారావు ఎంపీ మల్లు రవి గతో కలిసి శాసనసభ్యులు మేఘారెడ్డి భూమి పూజ చేశారు.

తరువాత వెల్టూరు గ్రామ చేనేత కాలనీలోని ఉన్ని పారిశ్రామిక సంఘం ను వారు సందర్శించి చేనేత కార్మికులతో మాట్లాడారు, ఇక్కడ కార్మికులు తయారుచేసిన రగ్గులకు ఫినిషింగ్ కోసం హర్యానా వెళ్ళవలసి వస్తుందని ఆ ఫినిషింగ్ యూనిట్ను తమకు మంజూరు చేయవలసిందిగా శాసనసభ్యులు మేఘారెడ్డి మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.

అందుకు ఆయన సానుకులంగా స్పందించారు. ఉన్ని చేనేత పరిశ్రమలో పనిచేసే కార్మికులకు పనికి తగ్గ వేతనం అందేలా చూడాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభిని మంత్రి ఆదేశించారు. అనంతరం జాతీయ రహదారి బుర్రవాగు స్టేజి నుంచి మోజర్ల గ్రామానికి వెళ్లే రహదారిలో నిర్మించే బ్రిడ్జిల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. పెద్దమందడి మండలంలో నిర్మించే 10వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోడౌన్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపనలు చేశారు.

# రూ.3 లక్షల కోట్లతో.. బడ్జెట్

విజయవాడ , ఫిబ్రవరి 22(న్యూస్ పల్స్)

ఏపీ అసెంబ్లీ సమావేశాలు ఈనెల 24న ప్రారంభం కానున్నాయి. 28వ తేదీన ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెడుతున్న తొలి పూర్తిస్థాయి బడ్జెట్ ఇదే. ఏపీ అభివృద్ధిలో ఈ బడ్జెట్ కీలక పాత్ర పోషిస్తుందని నేతలు చెబుతున్నారురాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్.. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ నెల 28న చట్ట సభలకు బడ్జెట్‌ను సమర్పించనున్నారు. పయ్యావుల కేశవ్ శాసనసభలో బడ్జెట్ ప్రవేశపడతారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రవేశపెట్టే తొలి పూర్తిస్థాయి బడ్జెట్ ఇదే కావడంతో.. ప్రజల్లో ఆసక్తి నెలకొంది. ఉభయ సభల సమావేశం ప్రారంభం సందర్భంగా గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగిస్తారు. ఈనెల 25న గవర్నర్ ప్రసంగంపై చర్చ ఉండనుంది.ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు, మేనిఫెస్టోలో చెప్పిన పథకాల అమలు కోసం ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించనున్నట్టు తెలుస్తోంది. ఇందుకోసం వనరుల సమీకరణపై ఆర్థిక శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. బడ్జెట్ రూపకల్పనపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టిపెట్టారు. ఇప్పటికే ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, అధికారులతో రెండు మూడుసార్లు సమావేశమయ్యారు.చంద్రబాబుతో సమావేశం తర్వాత.. ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్.. అన్ని శాఖల మంత్రులు, కార్యదర్శులతో సమావేశాలు నిర్వహించారు. ఆయా శాఖల ప్రతిపాదనలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రులు, ఆయా శాఖల కార్యదర్శులు ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు సమర్పించారు. ముఖ్యంగా జలవనరుల శాఖ, సాంఘీక సంక్షేమ శాఖ, విద్య, వైద్య శాఖలకు భారీగా నిధులు కేటాయించే అవకాశం ఉందని తెలుస్తోంది.ఇటు కేంద్ర ప్రాయోజిత పథకాలను ఎక్కువగా వినియోగించుకునేందుకు అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. అటు కేంద్రం నుంచి వీలైనంత ఎక్కువ నిధులు రాబట్టేలా ప్లాన్ చేస్తున్నారు. రాష్ట్ర ప్రస్తుత ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ.. నిధులు సమీకరించుకోవాలి ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా విద్య, వైద్య శాఖ ద్వారా కేంద్రం నుంచి ఎక్కువ నిధులు పొందవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాలను.. కొత్త ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించేందుకు ప్లాన్ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నూతన ఇసుక విధానాన్ని అమలు చేసింది. దీంతో ఆదాయం తగ్గింది. పోలవరం, అమరావతి వంటి కీలక ప్రాజెక్టులకు కేంద్రం సాయం చేస్తోంది. ఇది కొంతమేర ఊరటనిస్తోంది. అయితే.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ప్రత్యేక సాయం చేయాలని సీఎం చంద్రబాబు కేంద్రాన్ని కోరుతున్నారు.గత ప్రభుత్వం భవిష్యత్తు ఆదాయాలను కూడా తాకట్టు పెట్టిందని.. ఆర్థిక వ్యవస్థ గాడి తప్పిందని కూటమి నేతలు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెబుతున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.2.94 లక్షల కోట్లతో నవంబర్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఇప్పుడు రూ.3 లక్షల కోట్లు దాటే అవకాశం ఉందని తెలుస్తోంది.

సరే.. ఇవన్నీ పక్కనపెడితే బడ్జెట్ పై ఇప్పటికే అధికారులు కసరత్తులు చేశారు. ప్రాధాన్యత రంగాలకు కేటాయింపులపై చర్చించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా అధికారులతో సమావేశమై ఏ ఏ శాఖలకు నిధులు కేటాయింపులు జరపాలో అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈసారి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2024 - 25 సంవత్సరానికి 2.95 లక్షల కోట్లతో బడ్జెట్ అంచనాలను రూపొందించి గత శాసనసభలో ప్రవేశపెట్టింది. ఇందులో రెవెన్యూ వ్యయంగా 2,35,916 కోట్లు, మూలధన వ్యయంగా 32,712 కోట్ల రూపాయలుగా చూపించింది. ప్రభుత్వం మారింది. ఇప్పుడు ఈ ప్రభుత్వం మూడు లక్షల కోట్లకు పైగానే బడ్జెట్ ను శాసనసభలో ప్రవేశపెట్టే అవకాశముంది... అయితే గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలకు నిధుల కేటాయింపుపైనే ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. వరసగా మూడు నెలలకు మూడు హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం సిద్ధమయింది. మార్చి నెలలో మహిళలకు బస్సు ప్రయాణం, ఏప్రిల్ నెలలో రైతులకు అన్నదాత సుఖీభవ, మే నెలలో తల్లికి వందనం కార్యక్రమాలను అమలు చేయాలని ఇప్పటికే చంద్రబాబు నిర్ణయించారు. ఈ మూడు పథకాలకు సంబంధించి దాదాపు పదిహేను నుంచి ఇరవై వేల కోట్ల నిధులు అవసరమవుతాయని అంచనా వేస్తున్నారు. అయితే ఈ పథకాలకు సంబంధించి ఇంత వరకూ విధివిధానాలను ఖరారు చేయకపోవడంతో పాటు నిధులు ఎంత కేటాయిస్తారన్న దానిపై కూడా చర్చ జరుగుతుంది. మరొక వైపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డ్రీమ్ ప్రాజెక్ట్స్ అమరావతి, పోలవరం ప్రాజెక్టులకు కూడా నిధులు కేటాయించాలి. కేవలం పోలవరానికి మాత్రమే కాకుండా బనకచర్లకు కూడా నిధులు కేటాయించాల్సి ఉంటుంది. బనకచర్ల ను చంద్రబాబు గేమ్ ఛేంజర్ గా అభివర్ణిస్తుండటంతో దానికి నిధులు కేటాయించే అవకాశాలున్నాయని చెబుతున్నారు. మరొక వైపు సంక్షేమ పథకాలకు కూడా పెద్దయెత్తున నిధులు కేటాయించాల్సి ఉంటుంది. బడ్జెట్ లో కేటాయింపులను బట్టే అవి అమలవుతాయా? లేదా? అన్న దానిపై స్పష్టత వచ్చే అవకాశముంది. అందుకే మార్చి 3వ తేదీన ప్రవేశ పెట్టే బడ్జెట్ కోసం రాష్ట్ర ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మరి కూటమి ప్రభుత్వం ఏంచేస్తుందన్నది చూడాలి.

# సైలెంట్ గా జిల్లా టూర్లలలో జగన్

గుంటూరు, ఫిబ్రవరి 22(న కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు దాటిపోయింది కానీ ప్రతిపక్ష నేతగా జగన్ తన మార్క్ చూపించడంలో విఫలమయ్యారు. ప్రధాన ప్రతిపక్ష హోదా ఆయనకు లేనప్పటికీ ఏపీలో ఉన్న ఏకైక ప్రతిపక్ష నేత మాత్రం ఆయనే. దానికి తగ్గట్లుగా పోరుబాట ఎంచుకుంటారని.. అనుకున్నారు కానీ ఆయన నింపాదిగా ఉన్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగే వరకూ వేచి చూడాలని అనుకున్నారు. అందుకే



కార్యకర్తలను పరామర్శించేందుకు ఆయన జిల్లాల టూర్ పెట్టుకున్నారు. కానీ దాని గురించి ఇప్పుడు మాట్లాడటం లేదు. కానీ ప్రజా సమస్యలపై మాత్రం మెల్లగా పర్యటనలు ప్రారంభించాలని డిసైడయ్యారు. జగన్ రెండు రోజుల కిందట బెంగళూరు నుంచి వచ్చారు. రాగానే విజయవాడలో వంశీ ని జైలులో పరామర్శించారు. అక్కడ ఓ పాప ఆయన కోసం ఏడవడం.. ఆ పాపతో సెల్ఫీ దిగడం వంటి కార్యక్రమాలతో జగన్ మళ్లీ తన రాజకీయం ప్రారంభించారని వైసీపీ నేతలు అర్థం చేసుకుననారు. వెంటనే గుంటూరులో మిర్చి రైతుల పరామర్శకు అని వెళ్లారు. ఎన్నికల కోడ్ ఉన్నా సరే లెక్క చేయలేదు. అనుమతి లేని పర్యటనకు పోలీసులు కూడాపెద్దగా బందోబస్తు ఏర్పాటు చేయలేదు. అక్కడ ఆవేశంగా చంద్రబాబుపై విమర్శలు చేశారు. మిర్చి కోరు కారణంగా ఇబ్బంది పడినప్పటికీ కొంత మంది రైతులతో మాట్లాడి వెళ్లారు. అక్కడ కూడా జగన్ మార్క్ కనిపించింది. జగన ఇటీవలి కాలంలో ఎక్కువగా బెంగళూరులోనే ఉంటున్నారు. వారానికి మూడు లేదా నాలుగు రోజులు తాడేపల్లిలో ఉంటున్నారు. దానికి సంబంధించి ఆయన కారణాలు ఆయనకు ఉండవచ్చు కానీ ఏపీకి వచ్చిన రోజుల్లో తాడేపల్లిలో పార్టీ కార్యకర్తల సమావేశాలు నిర్వహించేవారు. అయితే ఇక నుంచి ఓ జిల్లా వర్యటనకు వెళ్లాలని అనుకుంటున్నట్లుగా తెలుస్తోంది. ప్రజాసమస్యలను తీసుకుని ఆ సమస్య పరిశీలనకు జగన్ ప్రజల్లోకి వెళ్లాలని అనుకుంటున్నారని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. తన ప్లాన ను బయట పెట్టలేదు కానీ అన్ ప్లాన్డ్ గానే ఆయన ప్రజల్లోకి వెళ్తే మంచి స్పందన వస్తుందని కొత్తగా వ్యూహకర్తలు ప్లాన్ రెడీ చేసుకుంటున్నట్లుగా తెలుస్తోంది.అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కాబోతున్నాయి. అసెంబ్లీకి హాజర్యయేందుకు సిద్ధంగా లేరు. ప్రతిపక్ష నేత హోదా ఇచ్చి చంద్రబాబుతో సమానంగా మాట్లాడే అవకాశం ఇస్తేనే వస్తానని ఆయనంటున్నారు కాబట్టి హాజరయ్యే అవకాశం లేదు. అయితే అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నప్పుడు ఆయన సైలెంట్ గా ఉండే అవకాశం లేదు. ఏదో ఓ రాజకీయ కార్యక్రమం పెట్టుకుంటారు. గతంలో ఆయన మాక్ అసెంబ్లీ నిర్వహించాలని అనుకున్నారు. కానీ నిర్వహించలేదు. ఈ సారి జనాల్లోకి వెళ్లాలని అనుకుంటున్నట్లుగా తెలుస్తోంది. అసెంబ్లీకి ఎందుకు వెళ్లలేదో తన వాదన వినిపిస్తూ.. అక్కడి నుంచి ప్రజాసమస్యలపై ప్రశ్నిస్తానని ఆయన వ్యూహాన్ని ఖరారు చేసుకునే అవకాశం ఉంది.

==============

# జిల్లాలో యథేచ్ఛగా ఇసుక దోపిడీ

నిజామాబాద్

జిల్లాలో యాదేశచ్ఛగా ఇసుకు అక్రమ రవాణాకు గురవుతోంది. అనుమతుల పేరిట అక్రమ రవాణా సాగుతోంది. ఏరుగట్ల మండలం బట్టాపూర్ వద్ద పెద్ద వాగులో ఇసుక జాతర జరుగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా జేసిబిల తో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. సీఎం రేవంత్ ఆదేశాలు భే ఖాతర్ అయ్యాయి. 30 వే బిల్లులతో 3 వందల ట్రాక్టర్ల ఇసుక తరలింపు జరిగినట్లు సమాచారం.

# ఘనంగా గోమాత పుట్టిన రోజు

నల్గోండ

నల్లగొండ జిల్లా నార్కట్ పల్లి (మం) చిన్న నారాయణపురంలో గోమాత పట్ల భక్తి భావం చాటుకున్నరొకరు.గోమాత పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.కేక్ కటింగ్ కార్యక్రమం తోనే సరిపెట్టలేదు.వేడుకలకు ఊరందరినీ ఆహ్వానించాడు.కుటుంబ సభ్యుల ఫంక్షన్ మాదిరిగా తీరొక్క రుచులతో భోజనం వడ్డించి సంబరం అంగరంగ వైభవంగా జరుపుకున్నారు...

గ్రామానికి చెందిన సైదాచారి, ఓ రైతు వద్ద నెల రోజుల వయసు గల గోమాత ను తెచ్చుకుని పెంచుకుంటున్నాడు.దానికి ముద్దుగా గౌరీ అని పేరు పెట్టాడు.ఇంట్లోకి గోమాత ఎంట్రి తన జీవితాన్ని మార్చేసిందంటున్నారు సైదాచారి.ఇంట్లో సిరి సంపదలతో పాటు,ఆశీర్వచనం తీసుకుని బయటికి వెళితే అనుకున్న పని సక్సెస్ అవుతుందని చెబుతున్నారు.అందుకే గోవును కుటుంబ సభ్యుల్లో ఒకరిలా కంటికి రెప్పలా కాపాడుకుంటున్నానని గర్వంగా చెబుకుంటున్నారు. అందుకే బర్త్ డే వేడుకలను గ్రాండ్ గా నిర్వహించుకున్నానని సైదాచారి అంటున్నారు.ఇక ఈ వేడుకలకు వచ్చిన వారంతా గోమాత ను దీవించి,పూజించి ఆశీర్వచనం కూడా తీసుకున్నారు.

# యూట్యూబ్ ఛానల్ ముసుగులో స్పా సెంటర్ నిర్వహణ..?

విజయవాడ,

విజయవాడ వెటర్నరీ కాలనీ సర్వీస్ రోడ్ లోని ఓ స్టూడియోపై పోలీసుల దాడి జరిగింది. పది మంది మహిళలు, 13 మంది విటులను అదుపులోకి తీసుకున్నారు. మహిళలంతా ఇతర రాష్ట్రాలకు చెందిన వారుగా గుర్తించారు. చలసాని ప్రసన్న భార్గవ్ యూట్యూబ్ ఛానల్ ను అడ్డం పెట్టుకుని స్పా సెంటర్ నిర్వహిస్తున్నట్లు సమాచారం. భార్గవ్ ప్రస్తుతం పరారీలో ఉన్నారు,. మాచవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మాచవరం సీఐ ప్రకాష్ మాట్లాడుతూ వెటర్నరీ కాలనీలో స్టూడియో 9 పేరున స్పా ముసుగులో వ్యభిచారం జరుగుతుంది.



ఉత్తర భారత దేశమైన హిమాచల్ ప్రదేశ్ ఢిల్లీ ఉత్తరప్రదేశ్ నుంచి మహిళలను తీసుకువచ్చారు. ఆన్లైన్ ద్వారా విటులకు గ్యాలం వేస్తున్నారు. యూని సెక్స్ సెలూన్ పేరుతో క్రాస్ మసాజ్ లకు నిర్వహిస్తున్నారు. స్టూడియో 9 స్పా ఓనర్ చలసాని భార్గవ్ స్పాను నిర్వహిస్తున్నారని మేనేజర్ శ్యామ్ స్టేట్మెంట్ ఇచ్చాడు. సీసీ కెమెరాలు, హై సెక్యూరిటీ లాక్ డోర్లను స్పా సెంటర్ కు ఏర్పాటు చేసి పోలీసుల రాకను ముందుగానే గమనిస్తున్నారు. గతంలో అనేకసార్లు వీరిని హెచ్చరించాం. విజయవాడ నగరంలో స్పా పేరుతో క్రాస్ మసాజులు చేసేవారిపై ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు. ఒక యూట్యూబ్ ఛానల్ కు కూడా చలసాని భార్గవ్ నిర్వహిస్తున్నట్లుగా సమాచారం ఉంది.. యూట్యూబ్ ఛానల్ ఉద్యోగులు ఎవరిని మేము అదుపులోకి తీసుకోలేదు విచారణ చేయలేదు. చలసాని ప్రసన్న భార్గవ్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు త్వరలోనే అతనిని పట్టుకుంటామని అన్నారు.

# నరేష్ తొలగిస్తారా....

తిరుమల, ఫిబ్రవరి 22, (న్యూస్ పల్స్)

తిరుమల పవిత్రతకు నిదర్శనం. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి కొలువైన పుణ్యక్షేత్రమిది. అంతటి మహిమాన్విత క్షేత్రంలో పని చేసే అవకాశం దక్కడం మహా భాగ్యం. ఇక్కడ పని చేసే ఉద్యోగులు కూడా స్వామి వారి మీద భక్తి భయంతో విధులు నిర్వహిస్తారు. కొందరు దురుసుతనం ప్రవర్తించినా, వారిపై టీటీడీ సీరియస్ యాక్షన్ తీసుకుంటుంది. అందుకే తిరుమలలో ఉద్యోగులు వారి విధులను జాగ్రత్తగా నిర్వర్తించాల్సిన పరిస్థితి. కానీ ఇటీవల టీటీడీ బోర్డు సభ్యులలో ఒకరు చేసిన నిర్వాకంతో, ఒక్కసారిగా ఉద్యోగులు భగ్గుమన్నారు. ఈ పరిస్థితిని చక్కదిద్దుకొనేందుకు ఆ సభ్యుడే నేరుగా వారితో మాట్లాడనున్నట్లు సమాచారం.టీటీడీ పాలకమండలిలో పలువురిని సభ్యులుగా నియమిస్తారు. అలా నియమింపబడ్డ వారే నరేష్ కుమార్. ఇటీవల తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చిన సమయంలో మహాద్వారం గేటు వద్ద నరేష్ కుమార్ ఆగారు. గేటు తీయాలని కోరగా, టీటీడీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మహాద్వారం గేటు తీయడం జరగదని టీటీడీ ఉద్యోగి బాలాజీ తెలిపారు. ఇక అంతే.. శ్రీవారి ఆలయ పవిత్రతను కాపాడే స్థానంలో ఉన్న నరేష్ కుమార్ ఆగ్రహం కట్టలు తెంచుకుంది. థర్డ్ క్లాస్ అంటూ ఉద్యోగి బాలాజీని ఉద్దేశించి సీరియస్ కామెంట్స్ చేశారు. ఇలా పవిత్రమైన పుణ్యక్షేత్రంలో భాధ్యతాయుతమైన బోర్డు సభ్యుడిగా ఉన్న నరేష్ కుమార్ తీరుపై ఉద్యోగులు, భక్తులు కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు.నరేష్ కుమార్ ప్రవర్తించిన తీరు, సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. కర్ణాటకకు చెందిన నరేష్ కుమార్ బీజేపీకి చెందిన నేతగా గుర్తింపు పొంది, బోర్డు సభ్యుడిగా నియమితులయ్యారు. సభ్యుడిగా ఉండి కూడా ఇలా నరేష్ కుమార్ ప్రవర్తించిన తీరుకు ఏకంగా బోర్డు సభ్యుడిగా తొలగించాలన్న డిమాండ్ వినిపిస్తోంది. ఎందరో ప్రముఖులు, సాధారణ భక్తుల వలె శ్రీవారిని దర్శించుకొనేందుకు ఆసక్తి చూపుతారు. కానీ బోర్డు సభ్యుడిగా ఉన్న నరేష్ ప్రవర్తించిన తీరుతో బోర్డుకు మచ్చ వచ్చిందని భావిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది.థర్డ్ క్లాస్ ఉద్యోగి అంటూ అవమానించిన నరేష్ కుమార్ ను వదిలే ప్రసక్తే లేదని టీటీడీ ఉద్యోగులు తెలుపుతున్నారు. తాము నిరంతరం భక్తులకు సేవలు చేస్తూ, బోర్డు సూచనల మేరకు నడుచుకుంటున్న నేపథ్యంలో తమను అవమానించడం ఎంతవరకు సబబని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. అయితే ఈ విషయంపై ఇంత జరుగుతున్నా, టీటీడీ స్పందించక పోవడం విశేషం. ఛైర్మన్ బీఆర్ నాయుడు భాధ్యతలు స్వీకరించిన సమయం నుండి ఉద్యోగుల సంక్షేమ కోసం, భక్తుల కోసం ఎన్నో చర్యలకు శ్రీకారం చుట్టారు. నరేష్ నిర్వాకం వల్ల టీటీడీ పై బోర్డు పెద్ద మచ్చ వచ్చిందని టీటీడీ బోర్డు సభ్యులు అభిప్రాయ పడుతున్నట్లు సమాచారం. చివరకు వివాదం చిలికిచిలికి గాలివానగా మారుతున్న క్రమంలో నరేష్. సారీ చెప్పేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. తిరుమలకు చేరుకొని ఉద్యోగుల సమక్షంలో సారీ చెప్తారని, ఈ వివాదానికి ఫుల్ స్టాప్ పెట్టాలని నరేష్ సమాచారం ఇచ్చారు. ఇదే నిజమైతే నరేష్ సారీతో వివాదం సద్దుమణుగుతుందా? లేక బోర్డు సభ్యుడిగా తొలగిస్తారా అన్నది మున్ముందు తెలిసే అవకాశం ఉంది.

====================

భారత శక్తి
ఆదివారం, 23 ఫిబ్రవరి 2025

## బతికిన బతుకమ్మ కుంట

హైదరాబాద్, ఫిబ్రవరి 2

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపాలిటీ పరిధిలో చెరువులు కుంటల సంరక్షణ పునరుద్ధరణలో.. హైడ్రా మరో విజయం సాధించింది. బఫర్ జోన్లలో నాళాలపైన అక్రమ నిర్మాణాలను కూల్చివేయడంతో పాటు చెరువులను పునరుద్ధరించే పనులు నిర్వహిస్తున్న హైడ్రా.. అంబర్ పేట్ బతుకమ్మ కుంటలో తవ్వకాలు చేపట్టింది. మోకాల లోతు తవ్వగానే బతుకమ్మ కుంటలో నీళ్లు వచ్చాయి. దీంతో బతుకమ్మకుంట బ్రతికే ఉందంటూ స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.రేవంత్ సర్కారు ఏర్పాటు చేసిన హైడ్రా పుణ్యమా అంటూ అంబర్ పేట్‌లోని బతుకమ్మకుంట బయటపడింది. కబ్జా చెర వీడడంతో దీని అభివృద్ధి పైన హైడ్రా దృష్టి పెట్టింది. ఇళ్లను కూల్చకుండా కుంటపైనే దృష్టిపెట్టింది. ఆ తర్వాత చెత్త, మొక్కల్ని తొలగించిన అధికారులు తాజాగా చెరువులో పూడిక తీయడం స్టార్ట్ చేశారు. బుధవారం జేసీబీలు కేవలం అడుగున్నర తవ్వగా లోపల నుంచి వాటర్ ఉబికి వచ్చాయి. ఈ దృశ్యాన్ని చూస్తున్న స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ.. కుంట అభివృద్ధిలో తమ వంతు సహకారాన్ని అందించడానికి ముందుకు వచ్చారుబడాబాబుల కబ్జాలకు గురై కుంట ఎండిపోయి జీవం పోయిందనుకున్న బతుకమ్మ కుంట బ్రతికే ఉందని తెలిసి స్థానికులు చేరుకుంటున్నారు. ఆ కుంటలో మోకాళ్ల లోతు మట్టి తీయగానే బిరబిర గంగమ్మ బయటకు వచ్చిందని స్థానికులు చెబుతున్నారు. అయితే ఇటీవల కొందరు ఇది బతుకమ్మకుంట కాదు.. మా స్థలమని నమ్మబలికిన వారు ఇప్పుడేమంటారు అక్కడి స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కాగా హైదరాబాద్‌ను మహా నగరంగా తీర్చిదిద్దేందుకు హైడ్రా చర్యలు చేపడుతుంది. నగరంలో ట్రాఫిక్ సమస్యలను తీర్చిదిద్దేందుకు చర్యలు చేసేందుకు కృషి చేస్తున్నారు. దాని కోసం జీహెచ్ఎంసీ హెచ్-సిటీ ప్రాజెక్టు పేరులో ఫ్లై ఓవర్లు, జంక్షన్ల అభివృద్ధి, అండర్‌పాస్‌ల నిర్మాణాలకు రూ.5,942 కోట్ల విలువైన 38 పనులకు ప్రభుత్వం పాలనా పరమైన అనుమతులు ఇచ్చింది. ఇక ఫోర్త్ సిటీ లక్ష్యం, నగరం నలుమూలలా మెట్రో విస్తరణ, అంతర్జాతీయ సంస్థలకు హైదరబాద్ ఫస్ట్ ఛాయిస్‌గా ఎదుగుతుండడంతో కొత్త టెక్నాలజీ రంగాలకు హబ్‌గా హైదరాబాద్‌ను నిలిపేందుకు, ఏఐ, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారు.రాబోయే రోజుల్లో హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున ఆధునిక సదుపాయాల వృద్ధికి.. ప్రభుత్వం నడుంబిగించడమే కాకుండా నగరాన్ని సస్టైనబుల్ సిటీగా తీర్చిదిద్దడమే హైడ్రా లక్ష్యమని ప్రభుత్వం చెబుతుంది. ఇందులో భాగంగా బతుకమ్మ కుంటలో కొన్ని అడుగుల తవ్వకాలకే నీళ్లు ఉబికిరావడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. హైడ్రా చర్యల వల్లే బతుకమ్మకుంటకు పునరుజ్జీవం దక్కిందని కాంగ్రెస్ నేతలు కుంట వద్ద సంబరాలు చేసుకుంటున్నారు.ఏర్పాటైన అతి తక్కువ కాలంలోనే ఔటర్ రింగ్ రోడ్డు వరకు తన పరిధిని పెంచుకొని చెరువులు, కుంటలు, నాళాలు, ప్రభుత్వ భూముల పరిరక్షణ బాధ్యతలను హైడ్రా చేపట్టింది. కాగా అతి త్వరలోనే హైడ్రా మొదటి పోలీసు స్టేషన్ కూడా ఏర్పాటు కానుంది. ఈ నేపథ్యంలో రాబోయే హైడ్రా చర్యలపై ఆసక్తి నెలకొంది.

## 4136 పేజీలతో అతిపెద్ద శుభలేఖ...

పెళ్ళి పుస్తకం ముద్రించి బంధుమిత్రులను అహ్వానించిన కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు చెందిన కుటుంబం

పెళ్ళీలు...పేరంటాలకు సామాజిక మాధ్యమాలను ఉపయోగించి ఆహ్వానాలు పలికే రోజులవి. ఇలాంటి పరిస్థితుల్లో కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు చెందిన ఓ కుటుంబం హిందూ వివాహం విశిష్టత... వివాహం సందర్భంగా జరిగే ఘట్టాలు వివరిస్తూ 36 పేజీలతో పెళ్ళిపుస్తకం ముద్రించి బంధుమిత్రులను ఇచ్చి ఆహ్వానించడం అందర్నీ ఆకర్షిస్తోంది.

కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు చెందిన సుద్దాల శ్రీనివాస్ శ్రీదేవి దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు. మొదటి కూతురు కూతురు రవళిక సిఏ పూర్తి చేసింది. ఇటీవల కామారెడ్డి పట్టణానికి చెందిన నాగేంద్ర బాబుతో పెళ్ళిసంబంధం కుదిరింది. ఈనెల 23న వివాహ ముహూర్తం ఖరారు చేసుకున్నారు. పెళ్లికి బంధుమిత్రులను ఆహ్వానించేందుకు శుభలేఖ తయారు చేయాలని సంకల్పించి రొటీన్ కు భిన్నంగా అందర్నీ ఆకర్షించేలా తమ ప్రత్యేకతను చాటుకునేలా అతిపెద్ద శుభలేఖ పెళ్ళి పుస్తకం ముద్రించారు.

హిందు వివాహం యొక్క ప్రత్యేకతను చాటి చెప్పేలా ఒక్కొక్క పేజీలో పెళ్ళి తంతులో జరిగే వివరాలను పొందుపరిచి 36 పేజీలతో వివాహ ఆహ్వాన పత్రికను రూపొందించారు. ఆహ్వాన పత్రిక పెళ్ళిపుస్తకంలో వివాహానికి సంబంధించిన కళ్యాణ సంస్కృతి, పెళ్లిచూపులు, పాణిగ్రహణ శుభముహూర్త పత్రిక, పెళ్లి కుమార్తెను చేయుట ,పెళ్లి కుమారుని చేయుట, వరపూజ, వధువును గంపలో తెచ్చుట, తెరసాల, కన్యాఫలం, మాంగల్యపూజ, జీలకర బెల్లం, తలంబ్రాలు, బ్రహ్మముడి, సప్తపది, ఉంగరాలు తీయించుట, అప్పగింతల పాటతో పాటు పెళ్లిలో జరిగే 36 రకాలతంతుల గురించి వివరిస్తు పెళ్ళి పుస్తకం తయారు చేశారు.పుస్తక రూపంలో ముద్రించిన వివాహ ఆహ్వాన శుభలేఖ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది.సుద్దాల శ్రీనివాస్ శ్రీదేవి దంపతులు పెళ్ళికూతురు రవళిక బంధుమిత్రుల ఇళ్లకు వెళ్లి బొట్టు పెట్టి పెళ్లి పుస్తకం ఇచ్చి ఆహ్వానం పలకడం, ప్రత్యేకంగా రూపొందించిన శుభలేఖ అందర్నీ ఆకట్టుకుంటుంది. పెళ్లి పుస్తకాన్ని ఆసక్తిగా చూస్తూ పెళ్లిలో ఇన్ని జరుగుతాయా, అని చర్చించుకుంటున్నారు.శుభకార్యాల సందర్భంగా ఆహ్వాన పత్రికలు ముద్రించి బంధుమిత్రులకు పంచడం సహజమే... కానీ ఆ పత్రికలు శుభకార్యం కాకముందే పెట్టకుప్పల పాలవుతున్నాయి. మనం ఇచ్చే శుభలేఖ అలా కాకుండా ఉండేందుకు జీవితాంతం గుర్తుంచుకునేలా ఇంట్లో దాచిపెట్టుకునేలా వివాహ సంస్కృతి అందరికి తెలిసేలా ఉండాలని భావించి పెళ్లి యొక్క విశిష్టతను పెళ్ళిలో జరిగే కార్యక్రమాలన్నీ నేటి సమాజానికి తెలియజేసే విధంగా 36 పేజీలతో పెళ్లిపుస్తకం శుభలేఖ తయారు చేసి బంధుమిత్రులకు అందజేయడం జరిగిందని సుద్దాల శ్రీనివాస్ శ్రీదేవి దంపతులు, పెళ్లి కూతురు రవళిక తెలిపారు. పురాతన కాలంలో పెళ్లి ఐదు రోజులు జరిగేది... రాను రాను ఒకరోజు ప్రస్తుతం ఒక గంటలో పెళ్లి అయిపోతుంది..

# పాలమూరుపై పంతాల్
# బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్

మహబూబ్ నగర్, ఫిబ్రవరి 22,

పాలమూరు జిల్లా పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్ అయ్యారు. పాలమూరు ప్రగతిపై పచ్చి అబద్ధాలు చెప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణా జలాలను ఏపీ యథేచ్ఛగా తరలించుకపోతుంటే ఆపడం చేతగాక? బీఆర్ఎస్ మీద రంకెలేయడమేంటని ప్రశ్నించారు.టీడీపీ, కాంగ్రెస్ పాలమూరుకు తీరని ద్రోహం చేసింది రేవంత్ రెడ్డి. ఇదిచరిత్ర చెపుతున్న సత్యం. పాలమూరును దత్తత తీసుకున్న అని చెబుతూనే పడావు పెట్టిండు నీ గురువు చంద్రబాబు. పాలమూరు ప్రాజెక్టులను పెండింగ్ ప్రాజెక్టులుగా మార్చి? పాలమూరు ప్రజల బతుకుల్లో నిప్పులు పోసింది కాంగ్రెస్. పాలమూరును ఎండబెట్టిన పాపం కాంగ్రెస్, టీడీపీలదే. ఆ 2 పార్టీల్లో ఉన్న రేవంత్ రెడ్డికి ఆ రెండు పాపాల్లో వాటా ఉంది. నువ్వు వక్రీకరించినంత మాత్రాన చరిత్ర మారుతుందా?? నీ వక్రబుద్ధి ప్రజలకు తెలియకుండా పోతుందా..?" అని హరీశ్ రావు ప్రశ్నించారు."పోతిరెడ్డిపాడు నీళు తరలిస్తుంటే హారతులు ఇచ్చి.. వైఎస్ రాజశేఖర్ రెడ్డికి ఊడిగం చేసింది కాంగ్రెస్ నేతలే. అలాంటి చరిత్ర మరిచి రేవంత్ మాట్లాడటం గురివింద సామెత ను గుర్తు చేస్తోంది. చంద్రబాబుకు ఊడిగం చేసినా మోదీకి భయపడి బడే భాయ్ అన్నా అది రేవంత్ రెడ్డికే సాధ్యం. రేవంత్ కు నీటి విలువ తెలియదు. నోటి విలువ తెలియదు. తెలిసింది ఒక్క అవినీతి నోట్ల విలువ మాత్రమే. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతలకు అడ్డుపడుతూ కేసులు వేయించిన వ్యక్తివి నువ్వే" అని హరీశ్ రావు విమర్శలు గుప్పించారు.కాంగ్రెస్ అధికారంలోకి రాకుంటే పాలమూరు ఎత్తిపోతల పూర్తి చేసి నారాయణపేట కొడంగల్ రైతుల కాళ్లు కడిగేవాళ్లమని హరీశ్ రావు అన్నారు. వలసలకు, ఆకలి చావులకు నిలయంగా మారిన పాలమూరు తలరాతను మార్చింది కేసీఆర్ అని స్పష్టం చేశారు. పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చారని గుర్తు చేశారు."పదేళ్ల బీఆర్ఎస్ పరిపాలనలో దాదాపు 12 లక్షల ఎకరాల ఆయకట్టుకు పాలమూరులో నీళ్లు అందించిన ఘనత మాది. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పూర్తికాగానే మరో ఏడు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఒక్క ఎకరానికి నీళ్లు ఇవ్వని నువ్వు కేసీఆర్ మీద రంకెలేస్తావా..? సూర్యుడి మీద ఉమ్మేసినట్టే. 14 నెలల్లో ఒక్క చెక్ డాం కూడా కట్టని ముఖ్యమంత్రివి నువ్వు కేసీఆర్ గురించి మాట్లాడుతావా..? నీ 14 నెలల పాలన మీద చర్చకు నేను సిద్ధం. నీ సవాలును స్వీకరిస్తున్నా. ఏ రోజు చర్చ చేద్దాము, ఎక్కడ చర్చ చేద్దామో నువ్వే చెప్పు. నువ్వు చెప్పిన చోటికి, చెప్పిన సమయానికి వస్తా. నీ కొడంగల్ నియోజకవర్గమైన సరే, చివరకు నీ ఇంట్లో అయినా సరే తప్పకుండా వస్తా" అంటూ హరీశ్ రావు కౌంటర్ ఇచ్చారు.నారాయణపేటలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. గత పాలకులు పాలమూరు జిల్లాను పట్టించుకోలేదని విమర్శించారు. పదేళ్లు సీఎంగా ఉన్న కేసీఆర్ పాలమూరు ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు.కాంగ్రెస్ పాలన సరిగా లేదని విమర్శలు చేస్తున్న బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. "10 ఏళ్లు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నారు.. 12 ఏళ్ల నుంచి మోడీ ప్రధానిగా ఉన్నారు. 12 నెలలుగా కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం అధికారంలో ఉంది. ప్రతిపక్ష నేతగా కేసీఆర్, కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి చర్చకు వస్తే సీఎం నేను సిద్ధం. గత పదేళ్ల పాలనపై చర్చిద్దాం" అంటూ సవాల్ విసిరారు.

# 4 లక్షల ఎకరాల రిజిస్ట్రేషన్లు రద్దు

విజయవాడ, ఫిబ్రవరి 22 (న్యూస్ పల్స్)

రాష్ట్రంలో ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లు రద్దు చేస్తామని.. రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోదియా తేల్చి చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 13 లక్షల ఎకరాల్లో.. 4 లక్షల ఎకరాలను అక్రమంగా ఫ్రీహోల్డ్ చేసినట్లు గుర్తించినట్లు ఆర్పీ సిసోడియా స్పష్టం చేశారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ప్రారంభించిన రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా వెంట జిల్లా కలెక్టర్ శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ ఉన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అక్రమంగా చేసిన భూముల రిజిస్ట్రేషన్లను రద్దు చేస్తామని వెల్లడించారు.ఏపీలో దాదాపు 13 లక్షల ఎకరాలకు గానూ 4 లక్షల ఎకరాల భూములను అక్రమంగా ఫ్రీహోల్డ్ చేసినట్లు రెవెన్యూశాఖ గుర్తించినట్లు చెప్పారు. ఈ లక్షల ఎకరాల భూముల్లో 25 వేల ఎకరాల వరకు రిజిస్ట్రేషన్ చేసినట్లు వెల్లడించారు. ఆ భూముల్లో 8 వేల ఎకరాల వరకు అక్రమంగా రిజిస్ట్రేషన్లు జరిగినట్లు తేలినట్లు స్పష్టం చేశారు. ఇక నిషేధిత జాబితా నుంచి అక్రమంగా తొలగించిన 4 లక్షల ఎకరాల భూములతోపాటు ఈ 8 వేల ఎకరాల భూముల రిజిస్ట్రేషన్లను రద్దు చేసేందుకు తక్షణ చర్యలు తీసుకున్నట్లు ఆర్పీ సిసోడియా తేల్చి చెప్పారు.గతేడాది అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో దస్త్రాల కాలిపోవడంతో మొత్తం ఆఫీస్ దెబ్బతింది. ఈ క్రమంలోనే మదనపల్లె సబ్‌కలెక్టర్ ఆఫీస్‌ను పునరుద్ధరించగా.. ఆ కార్యాలయాన్ని ఆర్పీ సిసోడియా బుధవారం ప్రారంభించారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడిన ఆయన.. ఈ విషయాలు వెల్లడించారు. ఇక ఆఫీస్ దహనం అయిన 2400 దస్త్రాలను తిరిగి రికవరీ చేసినట్లు వెల్లడించారు. కలెక్టర్, తహసీల్దార్ల కార్యాలయాల్లో ఉన్న రికార్డుల లింకు దొరకడంతో ఈ దస్త్రాలను రికవరీ చేయడం సాధ్యమైనట్లు తెలిపారు.ఈ క్రమంలోనే ఆ దస్త్రాల రికవరీలో భాగంగానే ఫ్రీహోల్డ్ భూముల అక్రమాలు బయటికి వచ్చినట్లు వెల్లడించారు. మరోవైపు.. ఈ మదనపల్లె సబ్ కలెక్టర్ ఆఫీస్ దస్త్రాల దహనం కేసులో ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. ఈ కేసులో ఇప్పటికే కొందరిని అరెస్ట్ చేసి విచారణ జరుపుతున్నామని.. వేరే బయటి వ్యక్తులతో సంబంధాలు ఉండడంతో దర్యాప్తు పూర్తి అయ్యేందుకు కొంత సమయం పడుతోందని వివరించారు. తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్ల పోస్టులు ఖాళీగా ఉన్న విషయం వాస్తవమేనని అంగీకరించిన ఆర్పీ సిసోడియా.. ఉద్యోగ ప్రమోషన్ల విషయంలో తలెత్తిన న్యాయపరమైన వివాదాలతో ఈ పరిస్థితి తలెత్తిందని వివరించారు. కొత్త రిక్రూట్‌మెట్లు కూడా త్వరలోనే చేపడతామని స్పష్టం చేశారు.

# మళ్లా తెలంగాణ సెంటిమెంట్...

హైదరాబాద్, ఫిబ్రవరి 22( రాజకీయాల్లో నేతల ప్రతీ మాటకు ఓ లెక్క ఉంటుంది. కొద్ది మంది తమ మాటల ద్వారా ప్రజల్ని తమ వైపు తిప్పుకుంటారు. మరి కొద్ది మంది నేతలు తమ మాటల ద్వారా ప్రత్యర్థి నేతలను, పార్టీలను ఢిఫెన్స్‌లోకి నెడతారు. మరి కొద్ది మంది నేతలు మాట జారి వివాదస్పదమై సెల్ఫ్ డిఫెన్స్‌లోకి జారుకుంటారు. అలాంటి వ్యాఖ్యలతో పార్టీకి, ప్రజలకు ఓ సంకేతాన్ని పంపుతారు ఇంకొందరు. ఇదంతా ఎందుకంటే రాజకీయ నేతలకు ప్రధాన ఆయుధం వారి మాటలే. బుధవారం తెలంగాణ భవన్‌లో జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు చర్చాంశనీయమయ్యాయి. ఏపీ సీఎం చంద్రబాబు తెలంగాణలో పాగా వేసేందుకు ప్రయత్నిస్తున్నారు అని కేసీఆర్ వాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు కాకతాళీయంగా చేసినవి కాదన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. చాలా ఆచితూచి ప్రయోగించిన పాత అస్త్రంగా కేసీఆర్ రాజకీయాలన్ని దగ్గరి నుంచి చూస్తోన్న విశ్లేషకులు చెబుతున్నారు. విస్తృత స్థాయి సమావేశంలో కేసీఆర్ చంద్రబాబు పాలన నాటి రోజులను గుర్తు చేశారు. కరెంటు కోతలు, కరెంటు ఛార్జీల పెంపు, ఉద్యమం నాటి పరిస్థితులను చెప్పే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే తాను తెలంగాణ ఉద్యమాన్ని ఎత్తుకోవాల్సి వచ్చింది, కనీసం తన పార్టీకి కార్యాలయం దొరకనీయకుండా చంద్రబాబు చేశారని గుర్తు చేశారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జల దృశ్యంలో తన ఇంటినే కార్యాలయంగా ఇస్తే దాన్ని చంద్రబాబు కూల్చివేశారని చెప్పుకొచ్చారు. ఈ వ్యాఖ్యల ద్వారా తెలంగాణ ప్రాంతానికి చంద్రబాబు ప్రధాన శత్రువు అని చెప్పే ప్రయత్నం చేశారు కేసీఆర్. చంద్రబాబు అడుగుపెడితే అవే పరిస్థితులు పునరావృతం అవుతాయని హెచ్చరికను పార్టీ శ్రేణులకు, ప్రజలకు పంపే ప్రయత్నం చేశారు.తెలంగాణ ఏర్పడిన తర్వాత జరిగిన తొలి శాసన సభ ఎన్నికల్లోను కేసీఆర్ ప్రధాన ప్రచారాస్త్రం చంద్రబాబే. తెలంగాణను అడ్డుకున్న వ్యక్తిగా చంద్రబాబును ఆ ఎన్నికల్లో కేసీఆర్ చిత్రీకరించారు. తెలంగాణను అడ్డుకునేందుకు టీడీపీ ఎమ్మెల్యేలతో రాజీనామాలు చేయించిన చంద్రబాబు తిరిగి తెలంగాణ రాజకీయాల్లోకి ఎలా రానిద్దామంటూ ప్రతీ సభలో కేసీఆర్ ప్రజలను ప్రశ్నించారు. ఈ ప్రచారం ప్రజల్లోనీ తీవ్ర చర్చ రెకెత్తించింది. కేసీఆర్ ఎత్తుగడ ఫలించింది. ఆ ఎన్నికల్లో గులాబీ పార్టీ మెజార్టీ స్థానాలు గెల్చుకొని అధికారంలోకి వచ్చింది.2018లో కూడా చంద్రబాబును టార్గెట్ చేస్తూ ప్రచారం చేశారు. ఆయన టార్గెట్‌గానే కేసీఆర్ ప్రతి సభలో విమర్శలు చేశారు. కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకొని తెలంగాణపై పెత్తనం చేయడానికి వస్తున్నారని తీవ్ర స్థాయిలో సెంటిమెంట్ రగిల్చారు. అప్పుడు కూడా చంద్రాస్త్రంతోనే కేసీఆర్ పవర్‌లోకి వచ్చారు. అధికారం కోల్పోయి ఏడాదిన్నర అవుతున్న టైంలో పార్టీ విస్తృత స్థాయి సమావేశం వేదికగా కేసీఆర్ చంద్రబాబు అస్త్రాన్ని బయటకు తీశారు. తిరిగి ఎన్డీఏ పేరుతో చంద్రబాబు తెలంగాణలో రాజకీయాలు చేయనున్నారని ఇది తెలంగాణ ప్రాంతానికి నష్టం చేస్తోందని చెప్పేందుకు కేసీఆర్ విమర్శలు చేశారు. ఓవైపు చంద్రబాబు ఏపీ సీఎంగా ఉంటూ, తెలంగాణలో రాజకీయాల్లో కూడా అడుగుపెడితే తెలంగాణాకు అన్యాయం, ఏపీకి లాభం జరుగుతుందన్న లాజిక్‌ను వాడే ప్రయత్నం చేస్తున్నారు కేసీఆర్.ఎన్డీఏలో చక్రం తిప్పే పరిస్థితుల్లో ఉన్న చంద్రబాబు, తెలంగాణలోకి రానిస్తే కేంద్రం నుంచి వచ్చేవి రాకుండా అడ్డుపడే అవకాశం ఉంటుందని, గోదావరి, కృష్ణా జలాలను తరలించుకునే అవకాశం ఉందని అందుకే కేసీఆర్ ఈ వాఖ్యలు చేసినట్లు గులాబీ ముఖ్య నేతలు చెబుతున్నారు. చంద్రబాబు శిష్యుడైన రేవంత్ రెడ్డి ఇక్కడ సీఎంగా ఉండటంతో చంద్రబాబుకు అడ్డు లేకుండా పోతుందని అందుకే కేసీఆర్ ముందు చూపుతో చేసిన వ్యాఖ్యలుగా బీఆర్ఎస్ నేతలు విశ్లేషిస్తున్నారు. ఎన్డీఏ పేరుతో తెలంగాణలోకి చంద్రబాబు రాకుండా చేసే ప్రచారం కేసీఆర్ చేపట్టే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రచారంతో తెలంగాణ ప్రజల్లో మరోసారి సెంటిమెంట్ రేకేత్తించవచ్చన్నది ఆయన వ్యూహంగా రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. 2014, 2018లో మెజార్టీ స్థానాలు బీఆర్ఎస్ గెలవడానికి కారణం తెలంగాణలో చంద్రబాబు ప్రచారం చేయడమే అన్న విశ్లేషణలు ఉన్నాయి. మళ్లీ ఇప్పుడు చంద్రబాబు తెలంగాణలో తిరిగితే అది కేసీఆర్‌కు ప్లస్ అవుతుందని రాజకీయ పరిశీలకుల అభిప్రాయం. ఇదే జరిగితే మళ్లీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అది కేసీఆర్‌కు సెంటిమెంట్ అస్త్రంగా మారనుందని అంటున్నారు. ఇదే వ్యూహంతో కేసీఆర్ చాలా ఆలోచించే ఈ వ్యాఖ్యలు చేసినట్లు చెబుతున్నారు.

## అర్థరూపాయికి టమోటా

కర్నూలు, ఫిబ్రవరి 22,

టమాటా ధరలు రోజురోజుకూ పతనం అవుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా కిలో రెండు రూపాయలకు కూడా మార్కెట్ లో రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయడం లేదు. మొన్నటి వరకూ కిలో నలభై నుంచి యాభై వరకూ బయట మార్కెట్ లో పలికిన టమాటా ధర నేడు పది రూపాయలకు పడిపోయింది. టమాటా తినే వినియోగదారులకు ఇది లాభదాయకవే అయినప్పటికీ, దానిని పండించే రైతులు మాత్రం తీవ్రంగా నష్టపోతున్నారు. పత్తికొండ, మదనపల్లి మార్కెట్ లో కిలో టమాటా ధర అర్థ రూపాయికి కూడా కొనేవారు లేరు. దీంతో టమాటా పండించిన రైతులు కనీసం తాము పండించిన దానికి పెట్టుబడి రాకపోవడంతో మార్కెట్ బయట పారేసి వెళుతున్నారు. మరికొందరు రైతులు మాత్రం పొలాల్లోనే పశువుల మేతగా టమాటాను వదిలేస్తున్నారు. టమాటా కోయడానికి రైతులు కూలీలకు చెల్లించాల్సిన మొత్తం కూడా రాదని తెలియడంతో దానిని కోయడం అనవసరమని పొలాల్లోనే వదిలేస్తున్నారు. పశువులకు మేతగా తీసుకెళ్లవచ్చని కొన్ని చోట్ల పశువుల కాపర్లకు రైతులు చెబుతున్నారు. దీంతో టమాటా ధరలు ఇప్పట్లో పెరిగే అవకాశం లేదని తెలిసి రైతులు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా నవంబరు మాసం నుంచి టమాటా దిగుబడులు ఎక్కువగా వస్తుంటాయి. ఇతర రాష్ట్రాల నుంచి కూడా దిగుమతి అవుతుంటాయి. అందుకే కావాల్సిన దానికన్నా ఎక్కువ టమాటా మార్కెట్ లోకి వస్తుంది. దీని వల్ల ధరలు పడిపోతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. టమాటా ధరల రైతులు ఆందోళన వ్యక్తం చేయడంతో ఏపీ ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టింది. టమాటాకు గిట్టుబాటు ధర కల్పించేందుకు వ్యవసాయశాఖ చర్యలను ప్రారంభించింది. అనంతపురం, కర్నూలు, విజయనగరం జిల్లాల్లో ప్రభుత్వం టమాటా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. ఇప్పటివరకు రైతుల నుంచి కిలో ఎనిమిది రూపాయల చొప్పున వెయ్యి క్వింటాళ్ల టమాటా కొనుగోలు చేసినట్లు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. విజయవాడ, విశాఖ, రాజమండ్రి, గుంటూరు రైతుబజార్లలో టమాటా విక్రయాలు చేపట్టారు. నాఫెడ్, ఏసీసీఎఫ్ ద్వారా ఆపరేషనల్ ఖర్చులు భరించేలా ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. కిలో టమాటాపై పది రూపాయల నుంచి పదిహేను రూపాయల గిట్టుబాటు ధర అందేలా ఏపీ వ్యవసాయశాఖ చర్యలు ప్రారంభించింది. కానీ ఇప్పటికీ రైతులు తమకు గిట్టుబాటు ధర లభించడం లేదని చెబుతున్నారు. తమిళనాడు, తెలంగాణ, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో విక్రయించేలా కేంద్రంతో చర్చలు ప్రారంభించింది.

## గెలిచిన వెంటనే ప్రభుత్వం పై యుద్ధం స్టార్ట్ చేస్తాం
## కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్

కరీంనగర్ ప్ర

నమ్మక ద్రోహానికి పోరాటానికి మధ్య జరుగుతున్న ఎన్నికలివి నాకు మంత్రి పదవి ముఖ్యం కాదు ప్రజలే ముఖ్యం

అందు కోసం ఎందాకైనా తెగిస్తా రోడ్డెక్కి కొట్లాడేందుకు సిద్ధం,బీసీ జాబితాలో ముస్లింలను చేర్చి బీసీకు ద్రోహం చేస్తున్న పార్టీ కాంగ్రెస్,ఇప్పుడు బీసీ జపం చేస్తే నమ్మి మోస పోదామా?

బీజేపీ అంటేనే బీసీల పార్టీ నేను గెలిస్తే నా వేతనమంతా స్కూల్స్ అభివృద్ధికే ఇచ్చేస్తానని ప్రకటించిన అంజిరెడ్డి,నమ్మక ద్రోహం నయవంచనకు పోరాటాలకు, ధర్మ రక్షణకు మధ్య ఎమ్మెల్సీ ఎన్నికలు జరగబోతున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. 6 గ్యారంటీలతో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన నయవంచన, నమ్మక ద్రోహానికి తగిన గుణపాఠం చెప్పాలని గ్రాడ్యుయేట్, టీచర్లకు పిలుపునిచ్చారు. బీజేపీ అభ్యర్థులు గెలిచిన వారం రోజుల్లోనే దీక్షలు, ఉద్యమాలతో కాంగ్రెస్ సర్కార్ పై యుద్ధం ఆరంభిస్తామని ప్రకటించారు. తనకు కేంద్ర మంత్రి పదవి ముఖ్యాం కానేకాదని, ప్రజలే తనకు ముఖ్యమని చెప్పారు. మంత్రిగా ఉంటూ గ్రూప్ 1 అభ్యర్థుల పక్షాన హైదరాబాద్ లో ఉద్యమించిన విషయాన్ని గుర్తు చేశారు. బీసీ జాబితాలో ముస్లింలను చేర్చి బీసీలకు వెన్నుపోటు పొడిచిన కాంగ్రెస్ పార్టీ, ఇయాళ బీసీ జపం చేయడం సిగ్గు చేటన్నారు.

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పచ్చీస్ ప్రభారీల సమావేశంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తోపాటు ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెంకటరమణారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, గోపి, మాజీ మేయర్లు సునీల్ రావు, డి.శంకర్, వాసాల రమేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ చేసిన ప్రసంగంలోని ముఖ్యాంశాలు:

భారతీయ జనతా పార్టీ నాయకత్వం ఏ అభ్యర్థిని నిలబెట్టినా గెలిపించే బాధ్యత మాదేనని నిరూపిస్తూ ఇంత పెద్ద సంఖ్యలో విచ్చేసిన కార్యకర్తలకు అభినందనలు ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలతో రాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పులు రావడం తథ్యం. ప్రజలు బీజేపీకి ఓటేయడానికి సిద్ధంగా ఉన్నారు. టీచర్, గ్రాడ్యూయేట్ ఓటర్ల ఇంటింటికీ వెళ్లి ఓట్లు వేసేలా కష్టపడాలి. ఎందుకంటే ఓటు అడిగే అర్హత బీజేపీకి మాత్రమే ఉంది. బీజేపీ గెలుపును కూడా ఎవ్వరూ ఆపలేరు. అన్ని సర్వేల్లోనూ అంజిరెడ్డి ముందస్తులో ఉన్నారు. రెండో స్థానం కోసమే కాంగ్రెస్, ఇండిపెండెంట్ అభ్యర్థులు పోటీ పడుతున్నారు.

ఇప్పుడు బీసీ జపం చేస్తున్న కాంగ్రెస్ పార్టీని చూస్తే నవ్వొస్తుంది. భారతీయ జనతా పార్టీ అంటేనే బీసీల పార్టీ. ప్రధానమంత్రి బీసీ వ్యక్తి. తెలంగాణలో అధికారం లోకి వస్తే బీసీనే సీఎంను చేస్తామని గత ఎన్నికల్లో అధికారికంగా ప్రకటించినం. కానీ కాంగ్రెస్ లో సీఎం ఎవరు? బీసీ జాబితాలో ముస్లింలను కలిపి బీసీలకు అన్యాయం చేస్తోందెవరు? బీసీలకు అన్యాయం జరిగితే నోరు మెదపనోరు బీసీ బీసీ అని జపం చేస్తుంటే మోసపోదామా? ఇతరులు ఎవరు గెలిచినా ఎన్నికల తరువాత వాళ్లంతా కాంగ్రెస్ లో చేరతారు. నిఖార్సుగా నిజాయితీగా నిలబడి మీ పక్షాన పోరాడేది బీజేపీ మాత్రమేనని గుర్తుంచుకోవాలి.బీఆర్ఎస్ పార్టీకి అభ్యర్థులే లేక పోటీ నుండి తప్పుకుంది. కాంగ్రెస్ కూడా అభ్యర్థులు దొరకక బయటి వాళ్లను అరువు తెచ్చుకుంది.

# భారీగా పెరిగిన ఎక్స్ చార్జీలు

హైదరాబాద్, ఫిబ్రవరి 22

భారత ఎక్స్ యూజర్లకు ప్రపంచ కుబేరుడు ఎక్స్ సీఈవో ఎలాన్ మస్క్ పెద్ద షాక్ ఇచ్చాడు. ఎక్స్ ప్రీమియం + సబ్‌స్క్రిప్షన్ ధరలను భారత్‌లో భారీగా పెంచేశాడు. ఈ పెంపుతో గతంలో ఉన్న ధరలకు ఈ ధరలు రెంట్టిపు కానున్నాయి. మరోవైపు ఇప్పటికే ఒకసారి ఎక్స్ ప్రీమియం + చార్జీలను పెంచారు. మూడు నెలల వ్యవధిలో రెండోసారి చార్జీలు పెంచేశారు. మస్క్ తీరుపై ఎక్స్ యూజర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రోక్3 ఏఐ విడుదల తర్వాత ఎక్స్ ప్రీమియం + సబ్‌స్క్రిప్షన్ చార్జీలు పెంచడం గమనార్హం.మస్క్‌కు చెందిన ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్కు సంబంధించిన స్టార్టప్ సంస్థ ఎక్స్‌ఏఐ తాజాగా గ్రోక్3 సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఇక ఈ ఎక్స్‌ఏఐని వినియోగించాలంటే ఎక్స్ ప్రీమియం ప్లస్ సబ్‌స్క్రిప్షన్ తీసుకోవాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని గ్రోక్3 ప్రారంభించిన సమయంలోనే మస్క్ వెల్లడించాడు. ఈ నేపథ్యంలో తాజాగా ప్రీమియ్ + సబ్‌స్క్రిప్షన్ ధరలు పెంచేశారు.ఇప్పటి వరకు ఇండియాలో ప్రీమియమ్ + సబ్‌స్క్రిప్షన్ ధర నెలకు రూ.1,750గా ఉంది. తాజా పెంపుతో అది రూ.3,470కి చేరింది. అంటే ఈ ప్లాన్ ధరలు దాదాపు రెట్టింపు పెరిగాయి. ఇక ఏడాది మొత్తానికి తీసుకునే ప్లాన్ ధరను రూ.18,300 నుంచి రూ.34,340కి పెంచింది. అంటే ఈ ప్లాన్ ధరలు దాదాపు రెట్టింపయ్యాయి. అయితే ట్విట్టర్(ఎలితిబిబివతీ)ను కొనుగోలు చేసిన ఎలాన్ మస్క్.. ఆ తర్వాత అందులో ఎన్నో సంచలన మార్పులు చేశారు. ఈ క్రమంలోనే ట్విట్టర్‌ను కొనుగోలు చేసిన వెంటనే దానిపేరు ఎక్స్ గామార్చేశారు. తర్వాత ఎక్స్‌నుంచి ఆదాయం సమకూర్చుకునేందుకు 2020 అక్టోర్‌లోనే మొదటిసారి 6పీమియం + సబ్‌స్క్రిప్షన్‌ను ప్రవేశపెట్టారు. అయితే మొదట ప్రీమియం + ప్లాన్ ధర చాలా తక్కువగా నిర్ణయించారు. 2023 అక్టోబర్‌లో రూ.1,300గా ఉన్న ఎక్స్ ప్రీమియం + సబ్‌స్క్రిప్షన్ ధర.. ఆ తర్వాత 2024 డిసెంబర్‌లో రూ.1,750కి పెంచారు. తాజాగా మూడు నెలల వ్యవధిలోనే మరోమారు ప్లాన్ ధర పెంచారు. రూ.1,750 నుంచి ఒక్కసారి రూ.3,470కి పెంచడంతో యూజర్లపై భారం పడనుంది. అయితే ఎక్స్‌లో ఇతర ప్లాన్‌ల ధరలు మాత్రం పెంచకపోవడం ఊరటనిచ్చే అంశం. బేసిక్ సబ్‌స్క్రిప్షన్ ప్లాన్ ధర ప్రస్తుతం నెలకు రూ.244గా నిర్ణయించారు. ఇక ప్రీమియం + సబ్‌స్క్రిప్షన్ ప్లాన్ ధర నెలకు రూ.650గా ఉంది. యాడ్?ఫ్రీ ఎక్స్‌పీరియన్స్, సుదీర్ఘ పదాలు రాసే అవకాశం ఈ ప్రీమియం ప్లాన్ల ద్వారా ఎక్స్ యూజర్లకు లభిస్తుంది.

# కుబేర టైటిల్ పై వివాదం

## టైటిల్ మాది న్యాయం చేయాలని కోరిన త్రిశక్తి ఎంటర్ప్రైజెస్

కుబేర టైటిల్ పై వివాదం నెలకొంది. ఆ టైటిల్ తమదేనంటూ

త్రిశక్తి ఎంటర్ప్రైజెస్ ప్రొడ్యూసర్, నరేందర్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో న్యాయవాది రాజేష్, కో ప్రొడ్యూసర్లు రజనీకాంత్, మల్లేష్ లతో కలిసి మాట్లాడారు. అన్ని

అనుమతులు పొందిన కుబేర టైటిల్ ను కాపీ చేసి ఇప్పుడు కుబేర టైటిల్ కు ముందు శేఖర్ కమ్ముల అని పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. ఇది తమకు తీవ్రంగా నష్టం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయమై తాము ఫిలిం ఛాంబర్ లో ఫిర్యాదు చేసిన ప్రయోజనం లేకపోగా తిరిగి తమనే బెదిరిస్తూ వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. తాము చట్ట ప్రకారం కుబేర టైటిల్ విషయంలో కోర్టును ఆశ్రయించామని చెప్పారు.తమ కుబేర టైటిల్ని కాపీ చేసిన ప్రొడ్యూసర్లు, డైరెక్టర్లు స్పందించాలని డిమాండ్ చేశారు మీకు. టైటిల్ ను మార్చాలి, టైటిల్ ను వాడితే వాటాను చెల్లించాలి, చట్ట ప్రకారం నష్ట పరిహారాన్ని చెల్లించి కుబేర టైటిల్ ఫాంటును వాడుకోవాలని డిమాండ్ చేశారు. స్పందించకపోతే న్యాయపోరాటం కొనసాగుతుందని చెప్పారు.

# హోటల్ ధ్వంసం కేసు? ఒకరు అరెస్టు

హైదరాబాద్‌లాలగూడ పీఎస్ పరిధిలో హోటల్ లో దాడి చేసి సిబ్బందిని గాయపరిచిన సలీం అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. లాలగూడ లోని సూపర్ స్టార్ హోటల్ లో బిర్యానీ తీసుకున్న తరువాత హోటల్ సిబ్బంది డబ్బులు అడగడం తో నన్నే డబ్బులు అడుగుతారా అని సలీం మరో వ్యక్తి జావేద్ లు కలిసి హోటల్ లో రాడ్డు తో ఫర్నిచర్ ధ్వంసం చేయడంతో పాటు సిబ్బంది పై దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. గతంలో కూడా తన సోదరుడు రౌడీ షీటర్ అని చెప్పి హోటల్ లో దౌర్జన్యం చేసేవాడని సలీం పై పిర్యాదు అందినట్లు పోలీసులు తెలిపారు. నిన్న రాత్రి పరారీలో సలీం ను అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలిస్తున్నట్లు తెలిపారు.

# ఘనంగా కేంబ్రిడ్జ్ స్కూల్ స్పోర్ట్స్ డే వార్షికోత్సవం

హైదరాబాద్‌హైదరాబాద్ అంబర్పేట మున్సిపల్ మైదానంలో శనివారం ఉదయం గోల్నాక లోని కేంబ్రిడ్జ్ స్కూల్ స్పోర్ట్స్ డే వార్షికోత్సవం ను ఘనంగా నిర్వహించారు. స్కూల్ నిర్వాహకుడు ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ డిప్యూటీ చైర్మన్ మహమ్మద్ యాసిన్ షరీఫ్ అతిధులను ఆహ్వానించాగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ రాజ్యసభ సభ్యుడు వి హనుమంతరావు హాజరై స్వర్గీయ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ కు నివాళులు అర్పించి స్పోర్ట్స్ డే జెండా ఆవిష్కరణ చేసి స్పోర్ట్స్ డేని ప్రారంభించాడు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ విద్యార్థులు చదువులతోపాటు ఆటలలో రాణించాలని అందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం అన్ని విధాలుగా అవకాశాలను కల్పిస్తుందని ఆదిశగా విద్యార్థులు అన్ని రంగాలలో ముందుకెళ్లాలని అన్నాడు

# హైడ్రాకు మరిన్ని పవర్ పోలీస్ స్టేషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 22(న

హైడ్రా గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. హైడ్రా పేరు వింటేనే అక్రమదారులు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే హైడ్రాకు ప్రభుత్వం రోజురోజుకీ మరింత బలాన్ని చేకూరుస్తోంది. ఆర్థికంగా ప్రభుత్వం ఫుల్ సపోర్టు చేస్తోంది. గతంలో హైడ్రాకు పోలీస్ స్టేషన్ కూడా అందుబాటులోకి రానుందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. పోలీస్ స్టేషన్ ఏర్పాటు అయ్యాక హైడ్రాకు మరింత బలం చేకూరనుంది.మార్చి మొదటి వారంలో హైడ్రా పోలీస్ స్టేషన్ అందుబాటులోకి రానుంది. ఇప్పటికే హైడ్రా పోలీస్ స్టేషన్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. పోలీస్ స్టేషన్ కు సంబంధించిన అన్ని రకాల పనులు ఫిబ్రవరి చివరి వారంలోగా పూర్తి చేయాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. దీంతో పోలీస్ స్టేషన్ లో కావాల్సిన సిబ్బంది గురించి కమిషనర్ ప్రభుత్వానికి లేఖ రాశారు. కావాల్సిన సిబ్బందిని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది.హైడ్రాకు ఒక పోలీస్ స్టేషనే కాక వెబ్ సైట్, మొబైల్ యాప్ కూడా అందుబాటులోకి రానున్నాయి. హైడ్రాకు సంబంధించిన వెబ్ సైట్ , మొబైల్ యాప్ కూడా రూపొందించేందుకు ఇప్పటికే అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే వీటికి సంబంధించిన పనులు కూడా వేగవంతంగా జరుగుతున్నాయి. మొబైల్ యాప్ లో చెరువులు, కుంటలు, ఎఫ్టీఎల్, బఫర్ జోన్ ల వివరాలను తెలియజేయనున్నారు. దీంతో భాగ్యనగర వాసులకు ఎలాంటి స్థలం కొనాలో ఈజీగా తెలుసుకోవచ్చు. ఎక్కడ ల్యాండ్ కొనకూడదో తెలుసుకోవచ్చు. హైడ్రా పోలీస్ స్టేషన్, వెబ్ సైట్, యాప్ సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించాలని నిర్ణయించారు. మార్చి ఫస్ట్ వీక్ లో ఈ మూడు అందుబాటులోకి రానున్నట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు.హైడ్రా ప్రధాన కార్యాలయానికి పైగా ప్యాలెస్ ను కేటాయించిన విషయం అందరికీ తెలిసిందే. ఈ భవంతికి సంబంధించిన మరమ్మతులను హెచ్ఎండీఏ చేపడుతోంది. పైగా ప్యాలెస్ భవనానికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయడానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ కూడా ఇచ్చింది. అయితే, ఈ మరమ్మతుల పనులు అన్నీ పూర్తి కావడానికి సంవత్సర కాలం పట్టే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. అలాగే రీజనల్ అఫీసులను కూడా ఏర్పాటు చేయనున్నారు.భాగ్యనగరానికి సంబంధించిన రీజినల్ కార్యాలయాన్ని బుద్ధ భవన్ లో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రాచకొండకు సంబంధించిన రీజినల్ కార్యాలయాన్ని తార్నాకలోని పాత హెచ్ఎండీఏ కార్యాలయంలో ఏర్పాటు చేయనున్నారు. సైబరాబాద్ కు సంబంధించిన రీజనల్ కార్యాలయాన్ని నానక్ రాం గూడలోని హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్(ఊఉఅఒ)లో ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే వీటి పనులు ప్రారంభమయ్యాయి.

ఈ విధంగా రీజనల్ కార్యాలయాలు:

హైదరాబాద్ ? బుద్ధభవన్

రాచకొండ- తార్నాక ఓల్డ్ హెచ్ఎండీఏ ఆఫీస్

సైబరాబాద్ ? నానాక్ రాం గూడ (హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్)

# ఎల్ ఆర్ ఎస్ పై రూల్స్... కండిషన్స్ అప్లై

హైదరాబాద్, ఫిబ్రవరి 22

ఎల్ఆర్ఎస్ (లే అవుట్ల క్రమబద్ధీకరణ) దరఖాస్తులను పరిష్కరించే దిశగా తెలంగాణ సర్కార్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. స్కీమ్ అమలులో వేగం పెంచేందుకు 25 శాతం రాయితీని ప్రకటించింది. 2020లో తీసుకువచ్చిన రూల్స్ కి కొన్ని సవరణలు చేసింది.

అవుట్ల క్రమబద్ధీకరణ ప్రక్రియపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇటీవలనే కీలక నిర్ణయం తీసుకోగా.. తాజాగా ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు కూడా జారీ చేసింది. క్రమబద్ధీకరణ ఫీజులో 25 శాతం రాయితీ ఇవ్వనుంది. అయితే మార్చి 31లోగా ప్రభుత్వం నిర్ణయించిన ఫీజును చెల్లించిన వారికి మాత్రమే ఈ రాయితీ నిర్ణయం వరిస్తుంది. ఇదే విషయాన్ని ఉత్తర్వుల్లో కూడా ప్రభుత్వం స్పష్టం చేసింది. గతంలో ఉన్న నిబంధనల్లో పలు




మార్పులు తీసుకువచ్చింది.స్కీమ్ లో తీసుకువచ్చిన తాజా మార్పులతో చాలా మంది భూయాజమానులు తమ స్థలాలను క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉంది. దీని ద్వారా ప్రభుత్వ ఖజానాకు భారీగానే ఆదాయం రానుంది. అయితే ఈ స్కీమ్ లో తాజాగా తీసుకువచ్చిన మార్పులు, కటాఫ్ తేదీ వివరాలకు సంబంధించిన ముఖ్యమైన విషయాలు ఇక్కడ చూడండి?.

ఎల్ఆర్ఎఎస్ స్కీమ్ – 10 ముఖ్యమైన అంశాలు:

ఎల్ఆర్ఎన్ స్కీమ్ 2020 ఏడాదిలో తీసుకొచ్చారు. ఇందుకోసం గ్రామాలు, పట్టణాల్లో భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఈ స్కీమ్ లో భాగంగా?అక్రమ లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించారు.

దరఖాస్తు ఫీజు కింద రూ. 1000 నిర్ణయించారు. ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి ప్రభుత్వానికి 25.67 లక్షల దరఖాస్తులు అందాయి. ఇందులో ప్లాట్లకు సంబంధించినవి 25.53 లక్షల దరఖాస్తులు కాగా, లేఅవుట్ల దరఖాస్తులు 0.13 లక్షలుగా ఉన్నాయి. ఇవన్నీ కూడా పెండింగ్ లో ఉన్నాయి.

ఎల్ఆర్ఎస్ స్కీమ్ విషయంలో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి. దీంతో నాటి ప్రభుత్వం ముందుకు వెళ్లలేకపోయింది. దీంతో అప్పట్నుంచి? నేటి వరకు కూడా ఈ దరఖాస్తుల విషయం పెండింగ్ లోనే ఉండిపోయింది. దరఖాస్తుదారులంతా క్రమబద్ధీకరణ కోసం ఎదురుచూస్తున్నారు.

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం?. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై ఫోకస్ పెట్టింది. జిల్లాల వారీగా ప్రత్యేక డెస్క్ లను ఏర్పాటు చేసి? పరిష్కారం చేసే దిశగా ప్రయత్నాలు చేసింది. అయితే అనుకున్న స్థాయిలో స్పందన రాలేదు.

ఇటీవలే తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 10 శాతం ప్లాట్లు రిజిస్టరైన లేఅవుట్లలో మిగిలిన ప్లాట్ల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించాలని నిర్ణయించింది. మార్చి 31 లోపు క్రమబద్ధీకరణ ఫీజు చెల్లిస్తే 25 శాతం రాయితీ ఇస్తామని మంత్రుల బృందం ప్రకటించింది.

మంత్రుల బృందం ప్రకటన తర్వాత తాజాగా ఇందుకు సంబంధించి అధికారికంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. 'తెలంగాణ రెగ్యూలరైజేషన్ ఆఫ్ అన్అప్రూవ్డ్ అండ్ ఇల్లీగల్ లేఅవుట్ రూల్స్ 2020కి సవరణలు చేస్తూ జీవో నెంబర్ 28ని విడుదల చేశారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులను జారీ చేశారు.

ఈ జీవో వివరాల ప్రకారం? లే ఔట్ల క్రమబద్ధీకరణ ఫీజులో 25 శాతం రాయితీ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. మార్చి 31లోగా ఫీజు చెల్లించిన వారికి ఈ రాయితీ వర్తిస్తుందని స్పష్టం చేసింది.

తాజా సవరణల ప్రకారం ఒఖీూ కటాఫ్ తేదీ (26.08.2020) నాటికి లేఔట్లలో కనీసమైనా 10 శాతం ప్లాట్లు విక్రయించి ఉండాలి. దీంతో మిగతా విక్రయించని ప్లాట్లను ప్రస్తుతం రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వీలు ఉంటుంది.

ఈ లేఔట్లలో భూమిని కొనుగోలు చేసినవారు సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ కు వెళ్లి వివరాలను సమర్పించవచ్చు. వీటిని ఎల్ఆర్ఎస్ పోర్టల్ కు అనుసంధానం చేస్తారు. ఇక్కడ క్రమబద్ధీకరణ చార్జీలతో పాటు ప్రోరేటా ఓపెన్ స్పేస్ చార్జీలు వసూలు చేసి రిజిస్ట్రేషన్‌కు అనుమతిస్తారు.

# ఐదేళ్ల తర్వాత సేమ్ సీన్.... నీటి దొంగలు అంటూ ఆరోపణలు

హైదరాబాద్, ఫిబ్రవరి 22, (న్యూస్ పల్స్)

తెలంగాణలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆంధ్రప్రదేశ్ లో ఐదేళ్ల పాటు జగన్ సీఎంగా ఉన్నారు. అప్పుడు కాంగ్రెస్ ఇద్దరు కుమ్మక్కయ్యారని, జగన్ తో లాలూచీపడి కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెట్టారని ఆరోపించింది. ఇప్పుడు ముఖ్యమంత్రులు మారినా అదే విమర్శ మళ్లీ వినపడుతుంది. ఈసారి తెలంగాణలో ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ఉండగా, ఏపీలో చంద్రబాబు సీఎంగా ఉన్నారు. కృష్ణానది నీటిని ఏపీ తరలించుకుపోతున్నా పట్టించుకోవడం లేదని అప్పుడూ..ఇప్పుడూ ఆరోపణలు ఒక్కటే. దీనికి ముఖ్యమైన కారణం ఇద్దరి ముఖ్యమంత్రుల మధ్య ఉన్న సాన్నిహిత్యమే కారణమని చెప్పకతపపదు. అదే విపక్షాలకు వరంగా మారిందని చెప్పాలి. ఎందుకంటే కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏపీలో జగన్ సీఎంగా ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వెళ్లి వచ్చారు. తర్వాత ఇద్దరి మధ్య బంధం బలపడింది. జగన్ కూడా ప్రగతి భవన్ కు వచ్చి కేసీఆర్ తో ముచ్చటించారు. కేటీఆర్ కూడా జగన్ సీఎం కాక ముందు ఆయన నివాసానికి వెళ్లి మాట్లాడి వచ్చారు. ఇలా ఈ ఇద్దరి మధ్య సఖ్యత అనేది బాగా ఉందని అందరికీ తెలిసిందే. బహిరంగ రహస్యమే. అయితే రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య సఖ్యత ఉండటాన్ని ఎవరూ తప్పుపట్టడానికి వీలులేదు. కానీ దానిని రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటూ విపక్షాలు ఎదిగేందుకు చేస్తున్న ప్రయత్నమే ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. మొన్నటి ఎన్నికల్లోనూ జగన్ గెలుస్తారని కేసీఆర్ వ్యాఖ్యానించారురేవంత్, చంద్రబాబు... ఇక 2023 ఎన్నికల్లో తెలంగాణ లో కాంగ్రెస్ రాగా, 2024 ఎన్నికల్లో ఏపీలో కూటమి ప్రభుత్వం వచ్చింది. రెండు ప్రభుత్వాలకు సారూప్యత లేదు. అయితే ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలుగుదేశం పార్టీ నుంచి వచ్చిన వారే కావడంతో పాటు ఆయన రాజకీయ గురువు అని భావించే చంద్రబాబుతో లాలూచీ పడి రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టుపెడుతున్నారని ప్రస్తుత బీఆర్ఎస్ ఆరోపిస్తుంది. కొంతకాలం క్రితం చంద్రబాబు కూడా వచ్చి రేవంత్ రెడ్డితో సమావేశమై రాష్ట్ర విభజన సమస్యలపై చర్చించి వెళ్లారు. అయితే ఇద్దరి పార్టీల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఎవరి రాష్ట్రం వారికి కావాలి. జగన్ కోసం కేసీఆర్, చంద్రబాబు కోసం రేవంత్ లు రాష్ట్రాన్ని పణంగా పెట్టరు. ఎందుకంటే ఏమాత్రం నలుగురి లో ఏ ఒక్కరు రాష్ట్ర ప్రయోజనాలు పణంగా పెట్టినా ప్రజలు రాజకీయ సమాధి కట్టేస్తారని తెలయని నేతలు కాదు. కృష్ణా నదిని తరలించుకుపోతుంటే కేసీఆర్ చూస్తూ ఊరుకుండరు. అలాగే రేవంత్ రెడ్డి కూడా మౌనంగా ఉండరు. ఖచ్చితంగా పోరాడతారు. కేఆర్ఎంబీ ఒకటి ఉంది. అది నిర్ణయించిన మేరకే నీటి వాటాలుంటాయి తప్పించి ఎవరిష్టం వారు నీటిని తోడుకుపోయే అవకాశం ఉండదు. కానీ రాజకీయాలకు ఇవన్నీ అనవసరం. ఎవరు విపక్షంలో ఉన్నప్పటికీ ఈ ఆరోపణలను కట్టిపెట్టి వాస్తవాలను ప్రజల ముందుంచాలి. అయితే రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులుగా ఎవరున్నా సఖ్యతగానే ఉంటూ ఇరురాష్ట్రాల రైతుల, ప్రజల కు సాగు,తాగునీరు అందించగలగాలి. అదే కదా? ఎవరైనా కోరుకునేది. అందుకే విపక్షాలు విమర్శలు మాని సహేతుకమైన సూచనలు చేస్తే బాగుంటుంది.

==============================

# చికెన్ కోసం ఎగబడ్డ జనాలు

గుంటూరు

గుంటూరులో ఉచితంగా చికెన్ పంపిణీ చేశారు పౌల్ట్రీ పరిశ్రమ నిర్వాహకులు.బర్డ్ ఫ్లూ వదంతుల తో పడిపోయిన చికెన్ అమ్మకాల ను తిరిగి పుంజుకునేలా చేసేందుకు సిద్ధమయ్యారు.నష్టాల పాలైన నేపథ్యంలో, పౌల్ట్రీ పరిశ్రమకు మద్దతుగా రంగంలోకి దిగి చికెన్ తినాలంటున్న ప్రజా ప్రతినిధులు ప్రచారం చేస్తున్నారు.ప్రజల్లో అవగా హన కల్పించే ప్రయత్నాలు చేస్తు న్నారు.. అందులో భాగంగా.. గుంటూరులోని స్వామి థియేటర్ ప్రాంగణంలో ప్రజలకు ఉచితంగా చికెన్, గుడ్ల వంటకాలను పంపిణీ చేశారు పౌల్ట్రీ పరిశ్రమ నిర్వాహకు లు.. ఉడికించిన చికెన్, గుడ్లు తినడం వల్ల ఎలాంటి సమస్యలు రావని వివరించారు. ఈ కార్యక్ర మంలో ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, నసీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.. ఇక, చికెన్ వంటకాల కోసం ఆహార ప్రియులు భారీగా తరలివచ్చారు. ఊహించని విధంగా ప్రజలు తరలిరావడంతో నిర్వాహకులు గేట్లకు తాళం వేయాల్సిన పరిస్థితి వచ్చింది.

# వెంటనే ఏపీలో రిపోర్ట్ చేయండి

## ఐపీఎస్ ఆఫీసర్లకు ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 22,

తెలంగాణలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ముగ్గురు ఐపీఎస్‌లకు కేంద్ర హోం శాఖ షాకిచ్చింది. ప్రస్తుతం ఉన్న పోస్టుల నుంచి రిలీవ్ చేస్తూ.. 24 గంటల్లోగా ఏపీలో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఆ ముగ్గురు ఐపీఎస్‌లు ఎవరంటే.. అంజనీ కుమార్, అభిలాష బిస్త్, అభిషేక్ మహంతి. ఈ ముగ్గురిని వెంటనే రిలీవ్ చేయాలని హోం శాఖ ఆదేశాలిచ్చింది. డీజీ అంజనీ కుమార్ ఏపీ క్యాడర్ ఐపీఎస్ అధికారిగా ఉన్నారు. ఆయన తెలంగాణ డీజీపీగా కూడా గతంలో పనిచేశారు. అభిషేక్ మహంతి ప్రస్తుతం కరీంనగర్ సీపీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అభిలాష బిస్త్ తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. అంజనీ కుమార్, అభిలాష బిస్త్ డీజీ ర్యాంక్‌లో ఉండగా, అభిషేక్ మహంతి ఎస్పీ ర్యాంక్‌లో కొనసాగుతున్నారు.ఈ ముగ్గురికి కేవలం 24 గంటల సమయం మాత్రమే ఇచ్చిన కేంద్ర హోం శాఖ వెంటనే ఏపీ ప్రభుత్వానికి రిపోర్ట్ చేయాలని ఆదేశాలిచ్చింది. అయితే ఈ ఆదేశాలపై ఐపీఎస్‌లు కొంత సమయం కావాలని కోరే అవకాశం ఉంది. మూడు నెలల క్రితం ముగ్గురు ఐఏఎస్ అధికారులను ఇలాగే బదిలీ చేసింది కేంద్ర ప్రభుత్వం. తాజాగా ఈ ముగ్గురు ఐపీఎస్‌లకు షాక్ ఇచ్చింది. తెలంగాణ ఏర్పాటైనప్పటి నుంచి వీళ్లు ఇక్కడే ఉన్నారు. రాష్ట్ర విభజన జరిగిన సమయంలో ఈ ముగ్గురిని కూడా కేంద్రం ఏపీకి అలాట్ చేసింది. కానీ, ఆ నిర్ణయాన్ని వీరు ముగ్గురు సవాల్ చేస్తూ క్యాట్‌ని ఆశ్రయించారు. అక్కడ వీరి అలాట్‌మెంట్‌కు సంబంధించిన వాదనలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.

# భర్త ఇంటి ముందు భార్య ధర్నా...

రంగారెడ్డి

మైలార్ దేవ్ పల్లి లక్ష్మీగూడ లో భార్య న్యాయపోరాటానికి దిగింది. ఆమెకు తనకు మద్దతుగా కుటుంబ సభ్యులు బైఠాయించారు. లక్ష్మీగూడకు చెందిన శివతో లహరీకి నాలుగు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. కొంత కాలంగా లహరిని భర్త వేధిస్తున్నట్లు ఆమె ఆరోపణ. తప్ప తాగి భార్య పై దాడి చేస్తున్నాడు. అకారణంగా బూతులు తిడుతూ విచక్షణరహితంగా చితకబాదాడని వాపోయింది. అత్తా, భర్త కలసి వేదిస్తున్నారని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. తమపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేస్తావంటూ భార్య ను ఇంటి నుండి గెంటేసాడు శివ. గత ఆరు నెలుగా భార్య ఊసు ఎత్తడంలేదు. తనకు న్యాయం చేయాలంటూ లహరీ ఆందోళనకు దిగింది.

# యూరియా కొరతతో రైతుల ఆందోళన

కరీంనగర్

అరకొర స్టాక్ తో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల వద్ద రైతులు క్యూ కడుతున్నారు. రైతులు. చిగురుమామిడి మండలం ఇందుర్తిలో యూరియా కోసం చెప్పులు క్యూలో పెట్టారు. రైతుకు రెండు మూడు బ్యాగుల కంటే ఎక్కువ ఇవ్వని పరిస్థితి నెలకొంది. జిల్లాలో 42 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని అధికారులు ఇండెంట్ పెట్టారు.జిల్లాకు వచ్చిన స్టాక్ 37 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే. రైతులు సాగుచేసిన పంటలకు ప్రస్తుతం మరో 10 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం. సరిపడ యూరియా నిల్వలు లేకపోవడంతో ఎక్కువ రేటుకు ప్రైవేట్ ట్రేడర్స్ విక్రయిస్తున్నారు. సహకార సంఘాల్లో 270 రూపాయలకు లభిస్తున్న యూరియా, ప్రైవేట్ ట్రేడర్స్ 330 నుంచి 350 రూపాయలకు విక్రయిస్తున్నారు. ఎక్కువ రేటు పెట్టి కొందామన్నా దొరకని పరిస్థితులలో అన్నదాతలు ఆందోళనకు దిగారు.

# పద కవితా పితామహుడు, వాగ్గేయకారుడు తాళ్ళపాక అన్నమయ్య

( పెండ్యాల రామ్ కుమార్, )

అన్నమయ్య లేదా తాళ్ళపాక అన్నమాచార్యులు వైశాఖమాసం విశాఖ నక్షత్రంలో ఒక శుభలగ్నంలో మూడు గ్రహాలు ఉన్నత దశలో వుండగా నారాయణసూరి, లక్కమాంబలకు నందకాంశమున పుత్రోదయమైనది, మగశిశువు గా ఉదయించాడు. సర్వధారి సంవత్సరం వైశాఖ శుద్ధ పూర్ణిమ నాడు (మే 9, 1408) కడప జిల్లా లోని రాజంపేట మండలం తాళ్ళపాక గ్రామములో అన్నమయ్య జన్మించాడు. 8వ యేట అన్నమయ్యకు ఆయన గురువు ఘనవిష్ణు దీక్షనొసగినపుడు అన్నమాచార్య నామం స్థిరపడింది. నారాయణసూరి ఆ శిశువునకు ఆగమోక్తంగా జాతకర్మ చేశాడు.

అన్నమాచార్య తెలుగు సాహితీ చరిత్రలో లభించిన ఆధారాల ప్రకారం మొదటి వాగ్గేయకారుడు (సాధారణ భాషలో గేయాలను కూర్చేవారు). అన్నమయ్యకు పదకవితా పితామహుడు అని బిరుదు ఉన్నది. దక్షిణాపథంలో భజన సాంప్రదాయానికి, పదకవితాశైలికి ఆద్యుడు. గొప్ప వైష్ణవ భక్తుడు. తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి ని, అహోబిలము లోని నరసింహ స్వామి ని, ఇతర వైష్ణవ సంప్రదాయ దేవతలను కీర్తిస్తూ 32వేలకు పైగా కీర్తనలు రచించాడు. అన్నమయ్య పాటలు, పదాలు, పద్యాలలో భక్తి, సాహిత్యం, సంగీతం, శృంగారం, భావలాలిత్యం పెనవేసికొని ఉంటాయి.

కన్నడ వాగ్గేయకారుడు పురందరదాసు అన్నమయ్యను శ్రీనివాసుని అవతారంగా ప్రశంసించాడంటారు. (సాక్షాత్తు శ్రీమహావిష్ణువు ఖడ్గమైన నందకం అంశతో అన్నమయ్య జన్మించాడని శ్రీవైష్ణవసంప్రదాయంలో నమ్మకం ఉన్నది. ప్రధాన మందిరంలో ఘంట అవతారమని కూడా అంటారు). త్యాగయ్య, క్షేత్రయ్య, రామదాసు వంటి సంకీర్తనాచార్యులకు అన్నమయ్య మార్గదర్శకుడు.

చందమామ రావే జాబిల్లి రావే అంటే వేంకటేశుడు ముద్దులు తిన్నాడో తినలేదో కానీ, తెలుగు పిల్లలు మాత్రము గబుక్కున తింటారు. జోఅచ్యుతానంద జో జో ముకుందా అంటే ముకుందుడు నిద్ర పోతాడో లేదో కానీ తెలుగు పిల్లలు మాత్రము హాయిగా నిద్ర పోతారు. అన్నమయ్య పాటలు తెలుగు సంస్కృతికి ప్రతిరూపాలు. అవి తెలుగు సంస్కృతిలో ఒక భాగమై పోయినాయి; జనాల నోళ్లలో నాటుకొని పోయినాయి. తుమ్మెద పాటలు, గొబ్బిళ్ళ పాటలు, శృంగార గీతాలు, ఆధ్యాత్మిక పదాలు - ఇలా మొత్తము ముప్పై రెండు వేల పాటలు వ్రాసాడు.

95 సంవత్సరాలు పరిపూర్ణ జీవితం గడిపిన అన్నమయ్య దుందుభి నామ సంవత్సరం ఫల్గుణ బహుళ ద్వాదశి నాడు (1503 ఫిబ్రవరి 23) పరమపదించాడు. రాగిరేకులమీద వ్రాసిన తిథుల కారణంగా అతని జన్మ, మరణ దినాలు తెలుస్తున్నాయి.

# వైభవంగా ఆండాళ్ అమ్మవారి మాలల ఊరేగింపు

## ఫిబ్రవరి 23న స్వర్ణ రథోత్సవం

తిరుపతి, ఫిబ్రవరి 22

శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం రాత్రి 7 గంటలకు జరుగనున్న శ్రీవారి గరుడ సేవలో అలంకరించేందుకు ఉదయం శ్రీ గోవిందరాజస్వామి ఆలయం నుండి ఆండాళ్ అమ్మవారి మాలలను ఊరేగింపుగా తీసుకెళ్లారు.గోదా కల్యాణయాత్ర పేరిట నిర్వహించిన ఈ యాత్రలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ యాత్ర శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో ఉదయం 7 గంటలకు ప్రారంభమైంది. ఆలయం నుండి ఎస్వీ గోసంరక్షణశాల,తాతితోపు, పేరూరుమల్లపల్లి మీదుగా అంబారీపై మాలల ఊరేగింపు శ్రీనివాసమంగాపురానికి చేరుకుంది. భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపుగా అంబారీపై మాలలు ఆలయానికి చేరుకున్నాయి. రాత్రి జరిగే శ్రీవారి గరుడ సేవలో ఈ మాలలను స్వామివారికి అలంకరించనున్నారు.ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి, స్థానిక ఆలయాల డెప్యూటీ ఈవోలు వరలక్ష్మి, శాంతి పాల్గొన్నారు.

# హైదరాబాద్ ఉప్పల్ లో వీకెండ్ కూల్చివేతలు

## ఫుట్ పాత్ ఆక్రమణలపై జీహెచ్ఎంసి అధికారులు కొరడా

ఉప్పల్ ఫిబ్రవరి 22ఉప్పల్ లోని మండే మార్కెట్ ప్రధాన రహదారి పై ఫుట్ పాత్ ను ఆక్రమించి నిర్మించిన నిర్మాణాలను జీహెచ్ఎంసి అధికారులు కూల్చివేసారు. పోలీస్ బందోబస్తు నడుమ ఫుట్ పాత్ ఆక్రమణలు తొలగించారు. ఇకముందు ఫుట్ పాత్ ఆక్రమణలు జరిగితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

# ఆదివారం నాడు గ్రూప్ 2 పరీక్షలు యాథాతథం

విజయవాడ ఫిబ్రవరి 22ఆదివారం నాడు గ్రూప్ – 2 మెయిన్స్ పరీక్షలు యథాతథంగా జరుగుతాయి. ఉదయం 10 నుంచి 12.30 వరకు పేపర్ – 1 పరీక్ష, మధ్యాహ్నం 3 నుంచి 5.30 గంటల వరకు పేపర్ – 2 పరీక్ష వుంటుంది. అభ్యర్థులు 15 నిమిషాలు ముందే పరీక్షా కేంద్రానికి రావాలి.. గ్రూప్ – 2 మెయిన్స్ వాయిదా అంటూ తప్పుడు ప్రచారం జరుగుతోంది. సోషల్ మీడియాలో జరిగే తప్పుడు ప్రచారం నమ్మవద్దు.. తప్పుడు ప్రచారం చేసేవారిపై క్రిమినల్ కేసులు పెడతామని ఏపీపీఎస్సీ హెచ్చరించింది.

# అంతు పట్టని దళపతి వ్యూహం ఆత్మ స్తుతి, పరనింద

హైదరాబాద్, ఫిబ్రవరి 22, (

నెల లాంగ్ రెస్ట్ తర్వాత గులాబీ బాస్ జనంలోకి వచ్చారు. పార్టీ ఆఫీస్ లో మీటింగ్ పెట్టారు. ఇంత చేసి భవిష్యత్ పై దిశానిర్దేశం చేస్తారని చాలా మంది గులాబీ లీడర్లు అనుకున్నారు. కానీ కేసీఆర్ మాత్రం తెలంగాణ ఉద్యమ చరిత్ర ? బీఆర్ఎస్ పాత్రపై గంటలు గంటలు మాట్లాడారు. మళ్లీ సెంటిమెంట్ రగల్చి లాభపడే ఉద్దేశమే తప్ప.. భవిష్యత్ లో ఏం చేద్దాం.. ఎలా ముందుకెళ్దాం అన్న పాయింట్లు లేకుండా పోయాయన్న వాదన వినిపిస్తోంది. ఆత్మ స్తుతి, పరనింద ఇదేనా గులాబీ బాస్ కొత్త సందేశం?మరోసారి తెలంగాణ ఉద్యమ చరిత్ర, అందులో కేసీఆర్ పాత్ర, సెంటిమెంట్ చుట్టూనే మ్యాటర్ మొత్తం తిప్పారు. పార్టీ నేతలతో మాట్లాడిన స్పీచ్ లో ఎక్కువ దానికే కేటాయించారు. ఎక్కడైనా చేసిన పని గెలిపిస్తుంది. నిలబెడుతుంది. ఇంకా ఎన్నాళ్లు సెంటిమెంట్ ను పట్టుకుంటారన్న విమర్శలను ప్రత్యర్థులు వినిపిస్తున్నారు. ఇంత చేసి గత పదేళ్లలో ఉద్యమకారులకు కేసీఆర్ ఏపాటి గౌరవం ఇచ్చారన్న ప్రశ్నలు వచ్చి పడుతున్నాయ్.రాకరాక జనంలోకి వచ్చి పార్టీని ఎలా జనంలోకి తీసుకెళ్లాలన్న విషయంపై దిశానిర్దేశం చేసుకోవాలి. కానీ విస్తృతస్థాయి మీటింగ్ లో అలా జరగలేదు. ఏదో అనుకుని ఇంకేదో చెప్పారా.. అన్న టాక్ ఇంటర్నల్ గా నడుస్తోంది. తమ పాలన భేష్, కాంగ్రెస్ పాలన బేకార్ అన్నట్లుగా మాట్లాడారు. అన్ని రంగాలు పడకేశాయన్నారు. అన్ని వర్గాల వారు రోడ్డున పడ్డారన్నారు. ప్రతిపక్ష నేతగా ఇవన్నీ రొటీన్ డైలాగ్స్. అయితే కొంత వరకైనా కనెక్ట్ అయ్యేలా ఉండాలి కదా అన్న పాయింట్ ను ప్రత్యర్థులు వినిపిస్తున్నారు.బీఆర్ఎస్ పార్టీ ఇప్పుడు ఏ పొజిషన్ లో ఉంది. అన్నది కేసీఆర్ చూసుకోవడం లేదా అన్న పాయింట్ కూడా చర్చకు వస్తోంది. నడిపించే నాయకుడు జనానికి దూరంగా.. ఉంటే నష్టం ఎవరికి అన్నది కూడా ఆలోచించడం లేదా అంటున్నారు. ప్రధాన ప్రతిపక్ష నేతగా అసెంబ్లీకి వచ్చి.. ప్రభుత్వం ఏవైనా తప్పులు చేస్తే నిలదీయడం, ఎండగట్టడం, సలహాలు ఇవ్వడం వంటివి కూడా చేయకపోతే ఎలా అన్న పాయింట్ కూడా తెరపైకి వస్తోంది. అంతెందుకు కులగణనలో పాల్గొనకుండా తిరిగి ఆ సర్వేపైనే విమర్శలు చేయడం.. ఇవన్నీ జనం అబ్జర్వ్ చేసే అంశాలే.అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం తర్వాత బీఆర్ఎస్ పార్టీ గ్రాఫ్ మరింతగా పడిపోయింది. తమకు తెలంగాణలో తిరుగే లేదు అనుకున్న గులాబీ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో వచ్చిన సీట్లు సున్నా. ఇది ఎవరూ ఊహించలేదు. అయితే రాష్ట్రంలోనే ఓడారు.. ఇక ఎంపీ సీట్లు గెలిపించడం ఎందుకని జనం దూరం పెట్టేశారు. ఇప్పుడు ఏకంగా ఆదిలాబాద్-నిజామాబాద్-కరీంనగర్-మెదక్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి వరుసగా పోటీ పెట్టకపోవడం కూడా వేరే సిగ్నల్స్ ను పార్టీ శ్రేణుల్లోకి, జనంలోకి తీసుకెళ్తోంది.అంతెందుకు ఈ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పరిధిలోనే కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, కవిత ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇలా సొంతంగా ప్రాతినిధ్యం వహించే చోట కూడా అభ్యర్థిని పెట్టి తమ స్టామినా ఏ పొజిషన్ లో ఉందో చూసుకోవాల్సిన టైంలో అస్త్ర సన్యాసం ఏంటన్న ప్రశ్నలకు కూడా తాజా మీటింగ్ లో జవాబు రాకుండా పోయింది. బీఆర్ఎస్ టిక్కెట్ వస్తుందని నమ్ముకున్న రవీందర్ సింగ్ లాంటి లీడర్లు.. ఇండిపెండెంట్ గా నామినేషన్లు వేసుకున్నారు. ఇదేనా గులాబీ బాస్ తమ లీడర్లు, క్యాడర్ కు ఇచ్చుకునే సందేశం?సో తిరిగి పుంజుకున్నాం.. జనంలోనే ఉన్నాం.. అని చెప్పుకోవాల్సిన పోటీలో దూరం ఉండడం గులాబీ పార్టీకి చాలా నష్టం చేసే అంశం. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు కూడా ఫాంహౌజ్ సీఎం అన్న ప్రచారం జరిగి అది ఓటమికి దారి తీసింది. ఇప్పుడు కూడా పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అధ్యక్షుడిగా ముందుండి నడపాల్సిన టైంలో ఏకంగా 7 నెలల గ్యాప్ తర్వాత ఫాంహౌజ్ నుంచి బయటకు వచ్చారు. ఇలా జరిగితే క్యాడర్ లో జోష్ పెరిగేదెలా.. లీడర్లలో ఉత్సాహం వచ్చేదెలా అన్నది గులాబీ పార్టీలో ఇంటర్నల్ గా జరుగుతున్న డిబేట్. పనిలో పనిగా కాంగ్రెస్ నేతలు కూడా కేసీఆర్ సీజనల్ పొలిటీషియన్ అంటూ, ఆయన ఫాంహౌజ్ లో పర్మినెంట్ గా రెస్ట్ తీసుకుంటేనే బెటర్ అని కౌంటర్లు కూడా ఇస్తున్నారు.అయిపోయిందనుకున్న పార్టీలు లేవాయి. లేచిన పార్టీలు పడిపోయిన సందర్భాలు చరిత్రలో ఉన్నాయి. అయితే తెలంగాణలో మాత్రం బీఆర్ఎస్ స్పేస్ ను బీజేపీ క్రమంగా ఆక్రమిస్తూ వస్తోంది. ఇది ఆ పార్టీకి అన్నిటికంటే పెద్ద సవాల్. అలాంటి విషయాలపై దిశానిర్దేశాలు లేకుండా పోవడమే పెద్ద మైనస్ అన్న టాక్ ఆ పార్టీలోనే వినిపిస్తోంది.కాంగ్రెస్, బీజేపీకి చెరో 8 ఎంపీ సీట్లున్నా నిధులు తేలేదన్నారు కేసీఆర్. మరి అదే అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్ ఎన్నిసార్లు ఢిల్లీ వెళ్లి.. ఎన్నిసార్లు ప్రధానిని కలిశారన్న పాయింట్ వినిపిస్తోంది. అటు కృష్ణా జలాలను కాపాడుకోవడం తెలియట్లేదన్నారు. మరి బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు సంగమేశ్వరం పనులు జరుగుతుంటే ఏం చేశారన్న ప్రశ్న తెరపైకి వస్తోంది. ఎమ్మెల్యేలు పార్టీ మారిన చోట్ల బైపోల్స్ రావడం ఖాయమే అంటున్నారు కేసీఆర్. బైపోల్స్ కు పోటీ చేసే ఉత్సాహం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో లేదా.. ధైర్యం చాలట్లేదా.. గతంలో బలం ఉన్నా ప్రత్యర్థి పార్టీల నుంచి ఎమ్మెల్యేలను ఎందుకు లాగేశారన్న ప్రశ్నలకు జవాబులు లేవు.పార్టీ పని అయిపోయిందని సొంత పార్టీ వాళ్లే ప్రచారం చేయడంతోనే పది మంది ఎమ్మెల్యేలు వెళ్లిపోయారని కేసీఆర్ మీటింగ్ లో అన్నారు. కానీ అక్కడ జరిగింది నిజంగా అదే ఫ్యాక్టరా.. అంటే కాదన్న జవాబు వస్తోంది. మరోవైపు కేసీఆర్ పవర్ లో ఉన్నప్పుడు కేంద్రంతో అంటీ ముట్టనట్లు ఉండడం, ప్రధాని మోడీ రాష్ట్రానికి వచ్చినా కనీసం వెళ్లి కలవకపోవడం, అలక పాన్పు ఎక్కడం, ఎడమొహం పెడమొహం అన్నట్లుగా డీల్ చేయడం ఇవన్నీ జరిగాయి. కేంద్రంతో గట్టిగా కొట్లాడలేదు.. అడగాల్సినవి అడగలేదు. ఫాలోఅప్ చేయాల్సినవి చేయలేదు.. మరి వచ్చేవి ఎలా వస్తాయన్న ప్రశ్నలకు జవాబు లేకుండా పోయింది.ఇంత చేసి తాజా విస్తృతస్థాయి మీటింగ్ లో గులాబీ బాస్ బీజేపీపై ఒక్క మాట కూడా మాట్లాడలేదంటున్నారు. ఇంతకు ముందు కూడా బీజేపీని పెద్దగా టార్గెట్ చేయడం లేదు. బీజేపీ ఇప్పుడు బీఆర్ఎస్ కు డేంజర్ గా మారింది. బీఆర్ఎస్ ఓటు బ్యాంక్ బీజేపీకే వెళ్తోంది. పార్లమెంట్ ఎన్నికల్లోనే ఇది క్లారిటీ అయింది. అలాంటప్పుడు బీజేపీ విషయంలో సాఫ్ట్ గా ఉంటే ఇంకా సమస్యలు ఎదురవుతాయి. కానీ కేసీఆర్ మాత్రం బీజేపీని టార్గెట్ చేసే పరిస్థితిలో కూడా లేరంటున్నారు.

అంతేందుకు ఉత్తర తెలంగాణ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ పెట్టకుండా బీజేపీకి పరోక్షంగా సపోర్ట్ ఇస్తున్నారన్నది కాంగ్రెస్ నేతల విమర్శ. ఇలా ఎన్ని కౌంటర్లు పడ్డా.., మాట మాత్రం మాట్లాడడం లేదు. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో వరుస ఓటములతో పార్టీ లీడర్స్, క్యాడర్ అంతా నైరాశ్యంలో ఉండడంతోనే ఎమ్మెల్సీకి పోటీ పెట్టడం లేదని ఓవైపు గులాబీ లీడర్లు చెబుతుంటే.. ఉప ఎన్నికలకు రెడీ అవ్వాలని, స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదామని కేసీఆర్ ఎలా చెబుతారన్న ప్రశ్నలకు మాత్రం జవాబు ఇవ్వలేని పరిస్థితి.పరిస్థితి చూస్తుంటే.. పోటీ చేయకపోయినా పర్వాలేదు.. ఓడినా పర్వాలేదు.. కానీ అధికార పార్టీ మాత్రం గెలవొద్దు ఇప్పుడు గులాబీ నాయకత్వం ఇదే కాన్సెప్ట్ తో పని చేస్తోందా అన్న డౌట్లు కూడా వస్తున్నాయి. సో ఫైనల్ గా కేసీఆర్ రాజకీయ వ్యూహాలను తక్కువ అంచనా వేయడానికి లేదు. అలాగని సీరియస్ గా తీసుకోవాల్సిన పని కూడా లేదన్నది ప్రత్యర్థుల మాట. ఎందుకంటే ఆ వ్యూహాలకు కాలం చెల్లిపోయిందంటున్నారు. ఎన్ని చేసినా కథ మారదని గుర్తు చేస్తున్నారు. అయినా ఆశ ఉంటుంది కదా.

# సిబ్బంది సమస్యల పరిష్కారంకే "పోలీస్ దర్బార్"

గోదావరిఖని :

రామగుండం కమిషనరేట్ స్పెషల్ పార్టీ, క్యూఆర్టి సిబ్బంది, అధికారులకు రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎం. శ్రీనివాస్ ఐపిఎస్., ఆదేశాల మేరకు శనివారం నాడు కమిషనరేట్ హెడ్ క్వార్టర్స్ లో "దర్బార్"కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం కు సీపీ హాజరై స్పెషల్ పార్టీ, క్యూఆర్టి సిబ్బంది తో మాట్లాడి సమస్యలను, వినతిలను ఒక్కొక్కరిని అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది అడిగిన వినతిలను, సమస్యలను వెంటనే పరిష్కరించే విధముగా చూస్తాం అన్నారు. ఏలాంటి సమస్య ఉన్న దర్బార్ లో చెప్పడం ఇబ్బందిగా ఉంటే ఆఫీస్ కి వచ్చి నేరుగా కలిసి చెప్పవచ్చు అన్నారు.

ఈ సందర్బంగా సీపీ మాట్లాడుతూ.....స్పెషల్ పార్టీ, క్యూ ఆర్ టి పోలీస్ విధి నిర్వహణలో భాగంగా ఎన్నో పని ఒత్తిళ్లను ఎదుర్కోనాల్సి వుంటుంది క్రమ శిక్షణ, ప్రణాళికబద్ధంగా విధులు నిర్వహించడంతో ద్వారా ఈ ఒత్తిళ్లను అధిగమించవచ్చని కాని వ్యక్తిగత కారణాలతో ఎదురయ్యే మానసిక ఒత్తిళ్లు చాలా ప్రమాదకరమని కొన్ని సందర్భాల్లో ఈ ఒత్తిళ్ల కారణంగా ఆరోగ్య సమస్యలు ఎదుర్కోనాల్సి వస్తుంది. కొన్ని సందర్భాల్లో ఒత్తిళ్ల తట్టుకోలేక క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలతో కుటుంబ రోడ్డున పడుతుందని ముఖ్యంగా క్షణికావేశంలో తప్పుడు నిర్ణయాలు తీసుకునే ముందు మీ కుటుంబ గురించి ఆలోచించాలని సూచించారు. సిబ్బంది క్రమశిక్షణతో డ్యూటీ లను నిర్వర్తించాలని



రామగుండం కమిషనరేట్ కి, తెలంగాణ పోలీస్ మంచిపేరు తీసుకురావాలన్నారు. బయట డ్యూటీస్ కి వెళ్ళినప్పుడు ఇబ్బందులు ఉంటె సంబంధిత అధికారులకు తెలియచేయాలన్నారు. సిబ్బంది క్రమశిక్షణతో, మంచిప్రవర్తన తో విదులు నిర్వర్తించినప్పుడు అధికారులు తమ వెంట ఉంటామన్నారు. సిబ్బందికి చేయవలసిన విధులు, చేయకూడని పనుల గురించి పలు సూచనలు, ఆదేశాలు చేయడం జరిగింది. చెడు వ్యసనాలకు, చెడు స్నేహాలకు అలవాటు పడి, విధులలో నిర్లక్ష్యం వహించినట్లైతే, పోలీస్ శాఖ ప్రతిష్ఠ కి భంగం కలిగించే విధంగా ప్రవర్తించిన శాఖ పరమైన చర్య తీసుకోవడం జరుగుతుందన్నారు .

ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి. రాజు,ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐ లు దామోదర్, శ్రీనివాస్, ఆర్ ఎస్ఐ లు, సిబ్బంది పాల్గొన్నారు.

# టింబర్ డిపోలో భారీ అగ్ని ప్రమాదం

రంగారెడ్డి

సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కర్మాన్ గట్ లో శ్రీ మణికంఠ టింబర్ డిపో లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. మంటలు భారీగా ఎగిసిపడ్డాయి. సరూర్ నగర్ అగ్నిప్రమాదం పై రాత్రి 11:07 గంటలకు కాల్ వచ్చింది. ఎల్బి నగర్, హయత్ నగర్, మలక్పేట్ నుండి మూడు అగ్నిమాపక వాహనాలు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశాయి. మంటలను అదుపులోకి తీసుకురావడానికి దాదాపు అరగంట పట్టింది. అగ్నిప్రమాదానికి కారణం మరియు ఎంత ఆస్తి నష్టం జరిగిందనేది ఇంకా తెలియరాలేదు మరియు దర్యాప్తులో ఉంది.

# రెండు లారీల మధ్య ఇరుక్కుని డ్రైవర్ మృతి

తిరుపతి

రెండు లారీల మధ్య ఇరుక్కుని వ్యక్తి మృతి చెందాడు. చంద్రగిరి మండలం, కాశీపెంట్ల , హెరిటేజ్ ఫ్యాక్టరీ వద్ద ఘటన జరిగింది. మృతుడు తవణం పల్లి మండలం, మారేడుపల్లెకు చెందిన డ్రైవర్ సౌందర్ రాజు (35) గా గుర్తించారు. లారీని పార్క్ చేసి చూసుకొని క్రమంలో మరో లారీ ఢీకొనడంతో లారీల మధ్య ఇరుక్కుని మృతి చెందాడు. విషయం తెలుసుకున్న చంద్రగిరి పోలీసులు మృతదేహాన్ని తిరుపతి రుయా మార్చురీ కి తరలించారు. చంద్రగిరి పోలీసులు ప్రమాద ఘటనపై విచారిస్తున్నారు.

# మంత్రి నాదెండ్ల మనోహర్ నెల్లూరు పర్యటన

## స్వాగతం పలికిన మంత్రి ఆనం

నెల్లూరు

నెల్లూరు జిల్లా పర్యటనలో భాగంగా మంత్రి ఆనం నివాసానికి విచ్చేసిన మంత్రి నాదెండ్ల మనోహర్ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సాదరంగా ఆహ్వానించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి , రాష్ట్ర టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ బాబు , జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణ కాంత్ కూడా మంత్రి నివాసానికి చేరుకున్నారు. జిల్లాకు సంబంధించిన పలు విషయాలపై ప్రత్యేకంగా భేటీ అయ్యారు. నెల్లూరు జిల్లా పర్యటన లో భాగంగా సంగం, కోవూరు మండలాల్లో మంత్రి నాదెండ్ల మనోహర్ పర్యటించారు.

# మంత్రి నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో సంగంలో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు

మంత్రులు, ఎంపీ, ప్రజాప్రతినిధులకు మంగళకర వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య భారీ గజమాలతో ఘనస్వాగతం పలికిన స్థానిక ప్రజాప్రతినిధులు

పూల జల్లుల మధ్య భారీ ర్యాలీగా సభా ప్రాంగణానికి చేరుకున్న ప్రజాప్రతినిధులు

నెల్లూరు

నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గం సంగం మండల కేంద్రంలో పండుగ వాతావరణంలో 20 లక్షల 50 వేలతో వ్యయంతో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని , ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి , రాష్ట్ర టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్ , జిల్లా కలెక్టర్ ఆనంద్, స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులు తదితరులు హజరయ్యారు.

# ఆరోగ్యానికి దివ్యౌషదం తెల్లకల్లు

- ప్రకృతిసిద్ధంగా లభించే కల్లునే సేవించాలి
- కులవృత్తులను ప్రోత్సహించాలన్నదే మా లక్ష్యం
- ఇంగ్లీస్ మందులు ఆరోగ్యానికి హానికరమే
- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

మంథని

తెలంగాణలో సురాపానకంగా భావించే తెల్లకల్లు ఆరోగ్యానికి దివ్య ఔషధంగా పని చేస్తుందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. శనివారం ఉదయం మంథని నియోజకవర్గ పరిధిలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం సింగారం గ్రామంలోని తాటివనంలో ఆయన తాటికల్లు సేవించారు. ఈ సందర్బంగా పుట్ట మధు మాట్లాడుతూ ప్రకృతి సిద్ధంగా లభించే తెల్లకల్లును ప్రతి ఒక్కరు సేవించడం ద్వారా అనేక ప్రయోజనాలు ఉంటాయన్నారు. తెల్లకల్లును డాక్టర్లు, శాస్త్రవేత్తలు సైతం చెబుతుంటారని, అనేక వ్యాధులకు ఔషధంగా పనిచేస్తుందని ఆయన వివరించారు. ప్రతి రోజు గౌడులు ఉదయం, సాయంత్రం తాటి చెట్టు ఎక్కి తాటి కల్లు తీసి మన ఆరోగ్యం కోసం కష్టపడుతుంటారని ఆయన కొనియాడారు. కులవృత్తులను ప్రోత్సహించాలన్నదే తన లక్ష్యమని, గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సైతం తెల్లకల్లు సేవించి కల్లు ప్రత్యేకతను చాటానని, ఈనాడు మళ్లీ మంథని కేంద్రానికి 75కిలో మీటర్ల దూరంలో ఉన్న సింగారం వచ్చి ఇక్కడి నుంచి కల్లు విశిష్టతను చెప్పడం జరుగుతుందన్నారు. ఇంగ్లీష్ మందులైన రమ్ము, బ్రాండీ, విస్కీ,బీర్లాంటివి సేవిస్తే ఆరోగ్యం చెడిపోతుందని, ఆ బాటిళ్లపైనే ఆరోగ్యానికి హానికరం అని రాసి ఉంటుందనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. సింగారం గ్రామంలో ఆరుపై పొల్లు ఉన్నాయంటే ఇక్కడ ఎక్కువ శాతం గౌడులు ఉంటారన్నారు.ప్రకృతి సిద్ధంగా లభించే తెల్లకల్లును ప్రతి ఒక్కరు సేవించి సంపూర్ణ ఆరోగ్యం పొందాలని ఆయన పిలుపునిచ్చారు.

# బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపుకోసం సునీల్ రావు ఇంటింటా ప్రచారం

## కేంద్ర ప్రభుత్వంతోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు

కరీంనగర్, ఫిబ్రవరి 22(భారత శక్తి):చిన్న తరహా పరిశ్రమలకు రుణ సదుపాయం కల్పించి నిరుద్యోగులు తన సొంత కాళ్ళ పై నిలబడేలా పథకాలను దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోది తీసుకువచ్చారని మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు అన్నారు. బిజెపి ఉపాధ్యాయుల, పట్టబద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎన్నికల ప్రచారంలో భాగంగా కరీంనగర్ లో శనివారం మేయర్ సునీల్ రావు, బీజేపీ పార్టీ నాయకులతో కలిసి పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. ఉదయం నగరంలోని పలు వాకింగ్ మైదానాలను సందర్శించి వాకర్లను స్వయంగా కలిసి ప్రచారం చేశారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం పది సంవత్సరాల్లో వివిధ రంగాల్లో చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను వాకర్లకు వివరిస్తూ ఓట్లను అభ్యర్థించారు. భారతీయ జనతా పార్టీకి పట్టభద్రులు, ఉపాధ్యాయులు మద్దతు ప్రకటించి పార్టీ అభ్యర్థులైన అంజి రెడ్డి, మల్క కొమురయ్యలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా సునీల్ రావు మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం గత పది సంవత్సరాలుగా ఉద్యోగులకు వివిధ రకాల సౌకర్యాలు కల్పించారని అన్నారు. నిరుద్యోగుల కోసం వివిధ సంస్థలను భారత దేశంలో నెలకొల్పి చాలా మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించారని స్పష్టం చేశారు. ఇన్ కం టాక్స్ పరిదిని పెంచి ఎంతో వెసులుబాటు కల్పించారని తెలిపారు. వ్యవసాయం రంగాన్ని భారత దేశంలో ముందు వరసలో నిలిపేందుకు దేశానికి అన్న పెట్టే రైతన్నలకు పిఎం కిసాన్ పథకం ద్వారా పెట్టుబడి సాయం కింద ఎకరాకు 6వేల నుండి 10 వేలకు పెంచి వ్యవసాయానికి ఊతం అందిస్తున్నారని తెలిపారు. రుణ



సదుపాయాలు కల్పించి దేశంలో ఇండస్ట్రియల్ వ్యవస్థను నెలకొల్పడంలో మోడి ప్రభుత్వం చాలా ప్రాముఖ్యత ను చాటుకుందని తెలిపారు. దేశంలో సమస్యలు పరిష్కారం అయి అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరగాలంటే నరేంద్ర మోడీ ప్రభుత్వమే శరణ్యం అన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నాయకత్వం లో పట్టభద్రులు, ఉపాధ్యయుల ఎమ్మెల్సీ కి పోటి చేస్తున్న ఇద్దరు అభ్యర్థులు, అంజి రెడ్డి, మల్క కొమురయ్య లకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి నరేంద్ర మోడీ ప్రభుత్వం లో చట్ట సభలకు పంపేందుకు పట్టభద్రులు, ఉపాద్యాయులు మద్దతు పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ బీజేపీ కార్పోరేటర్ శ్రీదేవి చంద్రమౌళి, బీజేపీ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఎస్ఎఫ్ఐ ప్రతిభ పరీక్ష విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం : సిద్ధార్థ పాఠశాలల కరస్పాండెంట్ శ్రీపాల్ రెడ్డి



కరీంనగర్, ఫిబ్రవరి 22(భారత శక్తి):భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పదవ తరగతి ప్రతిభ పరీక్ష జిల్లావ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందనీ, శనివారం పరీక్ష ప్రశ్నాపత్రాన్ని సిద్ధార్థ పాఠశాలల కరస్పాండెంట్ దాసరి శ్రీపాల్ రెడ్డి చేతులమిదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీపాల్ రెడ్డి గారు మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు సిద్ధమవుతున్న సందర్భంలో ఎస్ఎఫ్ఐ చే నిర్వహించే ప్రతిభ పరీక్ష విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని వారు తెలియజేశారు. మార్చి 21 నుండి ప్రారంభం అవుతున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో కరీంనగర్ లోని విద్యార్థులు భయాందోళనలకు గురికాకుండా మంచి మార్కులు వచ్చే విధంగా ఈ పరీక్ష ఉపయోగపడుతుందని వారు అన్నారు, పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థిని విద్యార్థులకు ముందస్తు ఆల్ ద బెస్ట్ కూడా వారు తెలియజేయడం జరిగింది. జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ పోరాటాలే కాకుండా పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల లోని సృజనాత్మకతను వెలికి తీయడం కోసం చుక్క రామయ్య ఆధ్వర్యంలో ప్రతిభ పరీక్ష నిర్వహించడం జరుగుతుంది. ఈ ప్రశ్న పత్రం మంచి అనుభవం కలిగిన ఉపాధ్యాయులచే తయారు చేయడం జరిగింది. ఈ పరీక్ష విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలియజేశారు. పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ కరీంనగర్ జిల్లా కమిటీ నుండి ప్రత్యేక అభినందనలు తెలియజేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కాంపెల్లి అరవింద్ జిల్లా ఉపాధ్యక్షులు ఇషాక్ జిల్లా కమిటీ సభ్యులు రాకేష్ మరియు విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

# కేటీఆర్....నోరు హద్దులో ఉంచి మాట్లాడు

## నువ్వెంత నీ బతుకెంత, నీ చిట్టా అంతా నా దగ్గరుంది

## మీ అయ్య లేకుండా నిన్ను రాళ్లతో కొడతారు

## నిప్పులు చెరిగిన కేంద్ర మంత్రి బండి సంజయ్

## సిఎం బహిరంగ చర్చకు రావాలని సంజయ్ సవాల్

కరీంనగర్, ఫిబ్రవరి 22(భారత శక్తి):రేవంత్ రెడ్డికి బండి సంజయ్ రక్షణ కవచంగా నిలిచారని, వీరిద్దరూ ఆర్ఎస్ బ్రదర్సేనంటూ మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో కేటీఆర్ పై నిప్పులుచెరిగారు.కేటీఆర్ కు పనీపాట లేదనీ, ప్రజలెవరూ దేఖడం లేదు. ఎమ్మెల్సీ అభ్యర్థులే దొరకక ఎన్నికల బరి నుండి పారిపోయినోడు. కాంగ్రెస్ కు లోపాయికారీ సపోర్ట్ చేస్తున్నది మీరే అని మండిపడ్డారు. శనివారం ఎన్నికల ప్రచార సమావేశం అనంతరం మీడియా సమావేశంలో సంజయ్ పై విధంగా స్పందించారు. కాళేశ్వరంలో, ఫోన్ ట్యాపింగ్, బామ్మర్ధి ఫాంహౌజ్ లో డ్రగ్స్ కేసు, ఫార్ములా ఈ రేసు స్కాంలో కచ్చితమైన ఆధారాలున్నా మిమ్ముల్ని ఎందుకు అరెస్ట్ చేయడం లేదు. అంటే నిజమైన కేఆర్ బ్రదర్స్ (కేటీఆర్, రేవంత్ రెడ్డి) మీరే. నీ దొంగ నాటకాలు బంద్ చేయ్. నీది బిచ్చపు బతుకు. ఇంకా నీ అహంకారం పోలే. నీ బతుకంతా నా దగ్గర ఉంది. పర్సనల్ గా పోవద్దని నేను ఆగుతున్నా. సవాల్ చేస్తే అవన్నీ బయటపెడతా. నాపై లీగల్ నోటీసు ఇచ్చి పారిపోయిన పరికిపందవు నువ్వు. కేసీఆర్ లేకపోతే నిన్ను కుక్కలు కూడా దేకవు. కేసీఆర్ అనేటోడు లేకపోతే నిన్ను రాళ్లతో కొడతారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అమెరికాలో చిప్పలు కడిగినోడివి. తెలంగాణ ఉద్యమం తీవ్ర స్థాయిలో జరుగుతుంటే ఇక్కడికి వచ్చి ఉద్యమం పేరు చెప్పి టిక్కెట్లు దండుకున్నోడివి. అయ్యపేరు చెప్పి బతికేతోడివి అని దుయ్యబట్టారు. నేను సామాన్య కార్యకర్తను. కింది స్థాయి నుండి ఉద్యమాలు చేసి లాఠీదెబ్బలు తిని జైళ్లకు పోయి ఈ స్థాయికి వచ్చిన సామాన్య కార్యకర్తనని గుర్తుచేసుకున్నారు. మీ అయ్య ఉద్యమకారుడిగా చలామణి అవుతుంటే ఇక్కడ దోశలేసినట్లు ఫోజులిచ్చి సిరిసిల్లలో మహేందర్ రెడ్డికి దక్కాల్సిన టిక్కెట్ ను గుంజుకుని పోటీ చేసి నీ సొంత పార్టీ నాయకులనే మోసం చేసిన చరిత్ర నీదని ఆరోపించారు. నువ్వు అవినీతి పరుడివే. రేవంత్ రెడ్డి అవినీతి పరులే. కాంగ్రెస్ పై కొట్లాడేది బీజేపీయే. అందుకే మీ పార్టీకి పోటీ చేయడానికి అభ్యర్థులే కరువయ్యారు. మీరు చేసిన



అవినీతికి అరెస్ట్ కాకుండా ఉండేందుకు కేసీఆర్ ఢిల్లీ కాంగ్రెస్ పెద్దల వద్దకు పోయి డబ్బులు ఇచ్చి వస్తున్నడని చెప్పారు. కాంగ్రెస్ కు మీ పార్టీ ఏటీఎంలా మారిందని,నువ్వు ఇంకోసారి మాట్లాడితే ఊరుకునే ప్రసక్తే లేదు. యూజ్ లెస్ ఫెలో నోరుంది కదా అని ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే రాళ్లతో కొడతారు. నీలెక్క పైసలిచ్చి బీరు, బిర్యానీలతో సభలు పెట్టి పార్టీ నడిపే చరిత్ర బీజేపీది కాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన సవాల్ ను స్వీకరిస్తున్నామని, డేట్, టైం, వేదిక ఫిక్స్ చేయమని కోరుతున్నా. మా పార్టీ అధ్యక్షులు ఎవరి పేరును ప్రతిపాదిస్తే వారు సీఎంతో చర్చకు సిద్ధంగా ఉంటారని, 14 నెలల రేవంత్ రెడ్డి పాలనపైన, 10 ఏళ్ల కేసీఆర్ పైన, మోదీ పాలనపై ఎవరేం చేశారో? గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీల వారీగా లెక్కలతో వివరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.అలాగే 6 గ్యారంటీలతో కాంగ్రెస్ చేసిన మోసాలను, అవినీతి, అక్రమాలను, 15 శాతం కమీషన్ వివరాలపైనా బహిరంగ చర్చకు సిద్ధమని సీఎంకు దమ్ముంటే చర్చకు రావాలని పిలుపునిచ్చారు.మరోవైపు ఎస్ఎల్ బీసీ సొరంగం పైకప్పు కూలిన దుర్ఘటనపట్ల కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు వెంటనే మెరుగైన సాయం అందించాలని కోరారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరపాలని కోరారు.

# నమ్మక ద్రోహానికి...పోరాటానికి మధ్య జరుగుతున్న ఎన్నికలివి

## నాకు మంత్రి పదవి ముఖ్యం కాదు... ప్రజలే ముఖ్యం

## కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



కరీంనగర్, ఫిబ్రవరి 22(భారత శక్తి):6 గ్యారంటీలతో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన నయవంచన, నమ్మక ద్రోహానికి తగిన గుణపాఠం చెప్పాలని గ్రాడ్యుయేట్, టీచర్లకు పిలుపునిచ్చారు. బిజెపి పార్టీ అంటే బిసిల పార్టీని, తమ అభ్యర్థులు గెలిచిన వారం రోజుల్లోనే దీక్షలు, ఉద్యమాలతో కాంగ్రెస్ సర్కార్ పై యుద్ధం ఆరంభిస్తామని ప్రకటించారు. తనకు కేంద్ర మంత్రి పదవి ముఖ్యాం కానేకాదని, ప్రజలే తనకు ముఖ్యమని చెప్పారు. మంత్రిగా ఉంటూ గ్రూప్ 1 అభ్యర్థుల పక్షాన హైదరాబాద్ లో ఉద్యమించిన విషయాన్ని గుర్తు చేశారు. బీసీ జాబితాలో ముస్లింలను చేర్చి బీసీలకు వెన్నుపోటు పొడిచిన కాంగ్రెస్ పార్టీ ఇయాళ బీసీ జపం చేయడం సిగ్గు చేటన్నారు. శనివారంకరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పచ్చీస్ ప్రభారీల సమావేశంలో బండి సంజయ్ పాల్గొని మాట్లాడారు.భారతీయ జనతా పార్టీ నాయకత్వం ఏ అభ్యర్థిని నిలబెట్టినా గెలిపించే బాధ్యత మాదేనని నిరూపిస్తూ ఇంత పెద్ద సంఖ్యలో విచ్చేసిన కార్యకర్తలకు అభినందనలు తెలియజేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలతో రాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పులు రావడం తథ్యమని, ప్రజలు బీజేపీకి ఓటేయడానికి సిద్ధంగా ఉన్నారనీ చెప్పారు. టీచర్, గ్రాడ్యుయేట్ ఓటర్ల ఇంటింటికీ వెళ్లి ఓట్లు వేసేలా కష్టపడాలన్నారు. ఎందుకంటే ఓటు అడిగే అర్హత బీజేపీకి మాత్రమే ఉందని చెప్పారు. బీజేపీ గెలుపును కూడా ఎవ్వరూ ఆపలేరని, అన్ని సర్వేల్లోనూ అంజిరెడ్డి ముందస్తులో ఉన్నారాని, రెండో స్థానం కోసమే కాంగ్రెస్, ఇండిపెండెంట్ అభ్యర్థులు పోటీ పడుతున్నారని జోస్యం చెప్పారు. ఇప్పుడు బీసీ జపం చేస్తున్న కాంగ్రెస్ పార్టీని చూస్తే నవ్వొస్తుందని,భారతీయ జనతా పార్టీ అంటేనే బీసీల పార్టీ అని,ప్రధానమంత్రి బీసీ వ్యక్తి అన్నారు. తెలంగాణలో అధికారంలోకి వస్తే బీసీనే సీఎంను చేస్తామని గత ఎన్నికల్లో అధికారికంగా ప్రకటించామన్నారు. కాంగ్రెస్ లో సీఎం ఎవరు? బీసీ జాబితాలో ముస్లింలను కలిపి బీసీలకు అన్యాయం చేస్తోందెవరు? బీసీలకు అన్యాయం జరిగితే నోరు మెదపనోరు బీసీ బీసీ అని జపం చేస్తుంటే మోసపోదామా? ఇతరులు ఎవరు గెలిచినా ఎన్నికల తరువాత వాళ్లంతా కాంగ్రెస్ లో చేరతారు. నిఖార్సుగా నిజాయితీగా నిలబడి మీ పక్షాన పోరాడేది బీజేపీ మాత్రమేనని గుర్తుంచుకోవాలని సూచించారు. బీజేపీ అభ్యర్థులను గెలిపించిన వారం రోజుల్లోనే ఉద్యోగ, ఉపాధ్యాయుల, నిరుద్యోగుల పక్షాన దీక్షలతో ఉద్యమాలు చేసి ప్రభుత్వ మెడలు వంచుతామన్నారు.ప్రభుత్వం మాత్రం ఎల్ఆర్ఎస్ పేరుతో వేల కోట్ల దోపిడీకి సిద్ధమైందని ఆరోపించారు. పుట్టక...గతిలేక ఎల్ఆర్ఎస్ పేరుతో భారీ దోపిడీకి స్కెచ్ వేసిందని దుయ్యబట్టారు. నిరుద్యోగులు, ఉద్యోగ, ఉపాధ్యాయుల పక్షాన నిలదీస్తుందెవరు? మీ కోసం జైలుకు పోయిందెవరు? మీ కోసం లాఠీ దెబ్బలు తిన్నదెవరు? మీ కోసం రక్తం చిందించిందెవరు? పీఆర్సీ కోసం, డీఏల కోసం, బదిలీలు, ప్రమోషన్లు, గ్రూప్ 1 అభ్యర్థుల పక్షాన కొట్లాడి కాళ్లు చేతులు విడ్గిందెవరికని గుర్తుచేసారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెంకటరమణారెడ్డి, అభ్యర్థులు అంజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, పార్టీ జిల్లా అధ్యక్షులు గాంగాడి కృష్ణారెడ్డి,గోపి, మాజీ మేయర్లు సునీల్ రావు, డీ.శంకర్, మాజీ ఎంపిపి వాసాల రమేష్ లు పాల్గొన్నారు.

# వచ్చేనెల1,2 తేదీల్లో ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు

## గోడప్రతిని ఆవిష్కరించిన ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు




కరీంనగర్, ఫిబ్రవరి 22(భారత శక్తి):మార్చ్ 1,2 తేదీలలో మేడ్చల్ జిల్లా ఈసీఐఎల్ లోని లయన్స్ క్లబ్ హాల్ లో అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని రాష్ట్ర నాయకులు కోరారు. శనివారం గోడ పత్రికను కరీంనగర్ కలెక్టరేట్ వద్ద విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగంధర్, కౌన్సిల్ సభ్యులు భోనగిరి మహేందర్ లు సంయుక్తంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న యువజన విధానాలపై ఈ సమావేశాల్లో చర్చిస్తున్నట్లు, ఆ చర్చల ద్వారా నిర్దిష్టమైన ప్రణాళికలను పాలకులకు పోరాటాల ద్వారా తెలియపర్చనున్నట్లు వారు అన్నారు. దేశంలో రాష్ట్రంలో నిరుద్యోగులు ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్యపై యువతకు ఉపాధి అవకాశాలపై, ఖాళీగా ఉన్న ఉద్యోగుల భర్తీకై చర్చించడం జరుగుతుందన్నారు.

రెండు రోజుల పాటు జరిగే రాష్ట్ర సమితి సమావేశాల్లో మొదటి రోజు "సాంకేతికత, అభివృద్ధి మరియు నిరుద్యోగ సమస్య" అనే అంశంపై సెమినార్ ను నిర్వహిస్తున్నట్లు, రెండవ రోజు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి కార్యవర్గ సభ్యులు హాజరుకానున్నట్లు వారు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి చెంచల మురళి, నాయకులు వెంకటేష్, రాజు, అరవింద్,లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# రైతులను నిర్లక్ష్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం: మాజీ ఎమ్మెల్యే రసమయి



కరీంనగర్, ఫిబ్రవరి 22(భారత శక్తి):రైతుల ఆత్మహత్యలు ఆగాలనే ఉద్దేశ్యంతోనే తెలంగాణ రాష్ట్రాన్ని సాదించుకున్నామని మనకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మళ్ళీ రైతులలై నిర్లక్ష్యం వహిస్తున్నారని, దీంతో రైతుల ఆత్మ హత్యలు ఆగడం లేదని బాలకిషన్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మానకొండూర్ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూరియా దొరకకా ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం నిమ్మకున్నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని ఆరోపించారు. ప్రభుత్వం కమిషన్ల గురించి మర్చిపోయి సాగునీటి కాలువల గురించి ఆలోచన చేయాలనీ సూచించారు. ఎమ్మెల్సీ ప్రచారంలో ఉన్న శ్రద్ధ రైతులకు పంటల్లకోసం ఎరువుల కొరతపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాలువల పెండింగ్ పనులు చేపట్టకపోతే, పార్టీ పక్షాన రైతులను తీసుకొని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇంటిని ముట్టడిస్తామని. ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి తెలుగుబాషా దినం రోజు తెలంగాణ ప్రథమ ముఖ్యమంత్రి కేసీఆర్ ను సన్యాసి అనడం సిగ్గుచేటు అన్నారు. రైతుల సమస్యలు అందించని ప్రస్తుత సీఎం కూడా సన్యాసి యే అని ఆరోపించారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి బాషా మార్చుకోవాలని హెచ్చరించారు.ఎమ్మెల్సి ఎన్నికలు పార్టీలకు అతీతంగా జరుగుతాయని అందులో కూడా రాజకీయం చేసే పార్టీ తమది కాదని అన్నారు.పట్టభద్రులు సరైన నాయకుణ్ణి ఎన్నుకోవాలని కోరారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎలక్షన్ ఇంఛార్జిగా రుద్ర సంతోష్ కుమార్

## ఉత్తర్వులు జారీ చేసిన టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

కరీంనగర్, ఫిబ్రవరి 22(భారత శక్తి):కరీంనగర్, నిజామాబాద్, మెదక్, అదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జి గా టీపీసిసీ కనెక్ట్ సెంటర్ ఇంచార్జి రుద్ర సంతోస్ కుమార్ ను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ శనివారం ఉత్తర్వులు జారీ చేసారు. గత2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో 31 ఎస్సి, ఎస్టీ అసెంబ్లీ ఇంచార్జిగా, అలాగే ఏఐసిసి వార్ రూమ్ ఇంచార్జిగా పనిచేసారు.



2024 పార్లమెంట్ ఎన్నికల్లో సెంట్రల్ వార్ రూమ్ కోచైర్మన్ గా పనిచేసారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న కులగణన సర్వేకి కోఆర్డినేటర్ గా బాధ్యతలు నిర్వర్తిస్తూ, పార్టీకి - ప్రభుత్వానికి మధ్య వారధిగా ఏర్పాటు చేసిన "టిపిసిసి కనెక్ట్ సెంటర్" ను ఇంఛార్జిగా ఉంటూ, వేలాది మంది కార్యకర్తలతో నిత్యం అనుసంధానం చేస్తూ పనిచేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో "మిషన్ మ్యాన్" గా, అలాగే పార్టీ కోఆర్డినేషన్ లో పేరొందిన రుద్ర సంతోష్ కుమార్ కి ఈ బాధ్యతలు ఇవ్వడంతో కాంగ్రెస్ పార్టీకి కలిసొచ్చే అవకాశం ఉందనీ కార్యకర్తలు అంటున్నారు.

# ఆల్ ఇన్ వన్ బుక్స్ పంపిణి చేయడం ఆనందం గా ఉంది

హనుమకొండ ప్రతినిధి(భారత శక్తి)ఫిబ్రవరి22:శాయంపేట మండలం లోని అన్ని ప్రభుత్వ పాఠశాల లో పదవ తరగతి చదువు చున్న విద్యార్థిని, విద్యార్థుల కు ఆల్ ఇన్ బుక్స్, ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేయడం ఆనందంగా ఉందనిబాసని చంద్రప్రకాష్ అన్నారు. శనివారం మండలంలోని అన్ని హై స్కూల్స్ విద్యార్థినీ విద్యార్థులకు మా తల్లిదండ్రులైన కీ"శే బాసని కైలాసం – కనుక లక్ష్మీల జ్ఞాపకార్థం మా సోదరుడు బాసని జయప్రకాష్( బెంగళూరు) డొనేట్ చేసినటువంటి

ఈ బుక్స్, ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేయడం సంతోషంగా ఉందని అన్నారు.

ఇట్టి వాటిని పిల్లలు సద్వినియోగం చేసుకొని పదవ తరగతిలో మంచి మార్కులు సాధించాలని, మండలంలో మొదటి ర్యాంకు సాధించిన వారికి 5 వేల రూపాయలు బహుకరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వనం సదానందం తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతి శిశు మందిర్ పాఠశాల గది నిర్మాణానికి విరాళం

### తల్లితండ్రుల జ్ఞాపకార్థం 8లక్షల విరాళాన్ని అందజేసిన సుధాకర్

కరీంనగర్, ఫిబ్రవరి 22(భారత శక్తి):శ్రీ సరస్వతీ విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్మించబోతున్నా శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాల కరీనగరమును ఇంటర్నేషనల్ స్కూల్ గా మార్చు చేయుటకు విద్యాపీఠం సంకల్పించింది.. ఇందులో భాగంగా పాఠశాలలో చేపట్టిన భవన నిర్మాణంలో ఒక గదికి తల్లిదండ్రులైన కీర్తిశేషులు బన్నా పాపమ్మ – వెంకటి ల జ్ఞాపకార్థం వారి కుమారుడు బన్నా సుధాకర్ 8,00,000/- లక్షల రూపాయల విరాళంగా అందజేశారు.




ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు బల్మూరి కరుణాకర్ రావు , కార్యదర్శి ఇంజనీర్ కోల అన్నా రెడ్డి , సమితి అధ్యక్షులు డాక్టర్ చక్రవర్తుల రమణాచారి, సమితి కార్యదర్శి ఎలగందుల సత్యనారాయణ, విభాగ్ కార్యదర్శి మేచినేని దేవేందర్ రావు, సహ కార్యదర్శి కొండా గంగాధర్, డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, పులాల శ్యామ్, గట్టు శ్రీనివాస్, రాపర్తి శ్రీనివాస్, డాక్టర్ నాళ్ల సత్య విద్యాసాగర్, తాటి రాజేశ్వరరావు, చందా సుధాకర్, శ్రీరాం వెుండయ్య, కేశెట్టి మహేష్ తదితరులు పాల్గొన్నారని ప్రధానాచార్యులు సముద్రాల రాజమౌళి తెలిపారు.

## బీసీలు ఐక్యంగా లేరు, కుల గణన జరగదు అంటూ బీసీలపై చేసిన వాక్యాలను వెనక్కి తీసుకోవాలి:బీసీ సంఘం నాయకులు సకినాల శంకర్.



మందమర్రి టౌన్, ఫిబ్రవరి 22(భారత శక్తి):బీసీలపై మాల సంఘం నాయకులు నర్సింగ్ చేసిన అనుచిత వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకోవాలని బీసీ సంఘం నాయకులు సకినాల శంకర్ హెచ్చరించారు. శనివారం ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలు ఐక్యంగా లేరు కుల గణన జరగదు అంటూ బీసీలపై చేసిన వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకోవాలని మాల సంఘం నాయకులను ఆయన హెచ్చరించారు. ముఖ్యంగా 10 మంది కూడా లేకున్న మాల సంఘం నాయకుడుగా చలామణి అవుతున్న నర్సింగ్ నీ పద్ధతి మార్చుకోవాలని లేకపోతే తగిన శిక్ష తప్పదని పేర్కొన్నారు. బీసీలపై చేసిన వాక్యాల పట్ల వెంటనే క్షమాపణ చెప్పాలని బీసీల అందరిని వేడుకోవాలని ఆయన సూచించారు. లేకపోతే బీసీల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం సభ్యులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి బండి సంజయ్ పై ఎన్నికల ఉల్లంఘన కేసు నమోదు చేయాలి: సిపిఐ నగర నాయకులు



కరీంనగర్, ఫిబ్రవరి 22(భారత శక్తి):కరీంనగర్ పట్టబద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జరుగుతున్న ఎన్నికల సభలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కాంగ్రెస్ అభ్యర్థి ఒక్క ఓటుకు 7000 పంచుతున్నాడని పట్టభద్రులను అవమానపరిచే విధంగా మాట్లాడడం పట్ల సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర హోం శాఖ మంత్రి స్థాయిలో ఉండి ప్రజలను పట్టభద్రులను తప్పుదారి పట్టిస్తున్న బండి సంజయ్ పై ఎన్నికల అధికారులు వెంటనే ఉల్లంఘన కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. బిజెపి అభ్యర్థి ఓడిపోతాడనే భయంతో బండి సంజయ్ ఇలాంటి తప్పుడు వాక్యాలు చేయుచున్నారని డబ్బులు పంచుతున్నాడని తప్పుడు ప్రచారం చేసి ఓట్లు రాబట్టాలని ప్రయత్నం చేస్తున్నారని ఓటు కోసం ఏంత కయినా దిగజారే తత్వం బిజెపి నాయకులకు ఉందని ఇది గతంలో చూసామని వారు అన్నారు.

పట్టభద్రులను అవమానపరిచే విధంగా కాంగ్రెస్ అభ్యర్థి డబ్బులు పంచుతున్నారని తప్పుడు వ్యాఖ్యలు చేయడం ఆయన అవివేకానికి నిదర్శనం అన్నారు. వెంటనే బండి సంజయ్ తన మాటలను వెనుకకు తీసుకుని పట్టబద్రులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## నూతన సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ 2025 క్యాలెండర్ను ఆవిష్కరించిన ఆర్మూర్ ఎసిపి జె వెంకటేశ్వర రెడ్డి.

భారత శక్తి ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బ్యూరో షేక్ అహ్మద్, ఫిబ్రవరి 22: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ ఎసిపి జె వెంకటేశ్వరరెడ్డి చేతుల మీదుగా సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ నూతన 2025 క్యాలెండర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం వెలికితీస్తున్న ఎన్నో చేదు నిజాలు ఉన్నాయని పనులలో పారదర్శకత ఎంతో ముఖ్యమని ఈ చట్టాన్ని సజీవంగా, చైతన్యవంతంగా చూస్తున్న హక్కు చట్ట పరిరక్షణ కమిటీ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షులు భుజంగం లింగం మాట్లాడుతూ మొత్తం భారతదేశంలో, అవినీతి విలయ తాండవం చేస్తుందని, ప్రపంచంలోనే అవినీతిలో భారతదేశం రెండవ స్థానంలో ఉందని ప్రజాస్వామ్యంలో, ప్రజలే రాజులని, అప్నా పైసా, అప్నా ఇస్సాబ్, ప్రజల చేత, ప్రజల కొరకు, ఎన్నుకోబడిన, ప్రతినిధులే, ప్రభుత్వాలు, కాబట్టి, ప్రభుత్వాలు ఏ పని చేసినా, పారదర్శకంగా, ఉండాలని. ప్రజలకు, ప్రభుత్వాలు, జవాబుదారీతనంగా, ఉండాలని భుజంగం లింగం తెలిపారు, ప్రభుత్వాలు, ప్రజలకు సూపరిపాలన, అందించేందుకు సమాచార హక్కు చట్టం ఎంతో దోహదపడుతుందని, క్షేత్రస్థాయిలో, ప్రజలకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించే బాధ్యత ప్రభుత్వాలే తీసుకోవాలని భుజంగం లింగం డిమాండ్ చేశారు, సమాచార హక్కు చట్టానికి, స్వతంత్రం వచ్చి, 19సంవత్సరాలు గడిచిపోయిన ఇంకా కొంతమంది అధికారుల తీరు మారలేదని, కొన్ని ప్రభుత్వ కార్యాలయాలకు, సమాచార హక్కు చట్ట బోర్డులు, ఇప్పటికీ లేవని, సమాచారం కోరిన వారికి సరియైన సమాచారం కొంతమంది అధికారులు, ఇవ్వలేకపోతున్నారని, కొంతమంది అధికారులుతప్పుడు సమాచారం ఇస్తున్నారని, ఆయన అన్నారు.



పరిపాలన వ్యవస్థలో సమాచార చట్టం, సూర్యకాంతి లాంటిదని, ఆ సూర్యకిరణాల, వేడికి, అవినీతి అధికారులు, మాడి మసైపోతారని, భుజంగం లింగం అన్నారు, తినే ఆహారం, త్రాగే నీరు, పీల్చే గాలి, కల్తీ అయిపోతున్నాయని భారతదేశంలోని, పట్టణాలలో, హైదరాబాద్, కల్తీలో, మొదటి స్థానాన్ని ఆశ్రయించిందని, ప్రతి ఒక్కరూ, కల్తీలపై ఉద్యమాలు చేయాలని భుజంగం లింగం పిలుపునిచ్చారు ఇట్టి కార్యక్రమంలో నిజాంబాద్ జిల్లా సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జిల్లా , ఆర్గనైజింగ్ సెక్రటరీ కే రామకృష్ణ గుప్త, జాయింట్ సెక్రెటరీ సాంబార్ గిరిధర్, వైస్ ప్రెసిడెంట్ సాయికిరణ్ యాదవ్, , ఆర్మూర్ డివిజన్ ప్రెసిడెంట్ సయ్యద్ సలీం, నిజామాబాద్ జిల్లా సలహాదారుడు ఖాజీ, ఆర్మూర్ మండల ప్రెసిడెంట్ జిల్లా రాజేందర్ గుప్తా, ఆర్మూర్ మండల వైస్ ప్రెసిడెంట్ కెనడా శ్రీనివాస్, ఆర్మూర్ మండల్ జనరల్ సెక్రెటరీ సాంబార్ విశ్వ ప్రసాద్, జక్కం రవి , తదితరులు పాల్గొన్నారు.

## దేశం గర్వించదగ్గ గొప్ప నేత మౌలానా అబుల్ కలామ్ ఆజాద్:కొనియాడిన జిల్లా కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్, ఫిబ్రవరి 22(భారత శక్తి):దేశ మొదటి విద్యా శాఖ మంత్రిగా మైనారిటీ నేతకు అవకాశం ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదని సుడా ఛైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ కొనియాడారు. శనివారం కరీంనగర్ లో స్వర్గీయ మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎండి తాజ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అరేపల్లి మోహన్, డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డిలు హాజరై ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ గొప్ప నేత మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ అని, దేశ మొదటి విద్యా శాఖ మంత్రిగా ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకొని దేశంలో అక్షరాస్యత శాతం పెంచి ఈ దేశాన్ని నాగరికత వైపు నడిపించిన మేధావి అబుల్ కలాం గారు.. మైనారిటీ నేతకు అవకాశం ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీది, కానీ నేడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకొని వారిని చిన్నచూపు చూస్తూ పరోక్ష దాడులకు దిగుతున్నారని అన్నారు, అబుల్ కలాం గారు ఆశయ సాధనకోసం



ప్రతి పౌరుడు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రావణ్ నాయక్, నేహాల్ అహమ్మద్, ముస్తాక్ ,లాయికు ,గుండాటి శ్రీనివాస్ రెడ్డి, కంరుద్దీన్ ,సలీమ్ ఉద్దీన్ ,కాజా ఖాన్ ,మహమ్మద్ చాంద్ ,షబానా మహమ్మద్ హనీఫ్, విక్టర్ ,కుర్రపోచయ్య ,అబ్దుల్ బారి, షహెన్షా, బషీరుద్దీన్, ఆరిఫ్ ఖాన్, వంగల విద్యాసాగర్, అజీమ్, ఇమామ్, అస్మత్ ,జమీల్ ఖాన్, కలీం, అక్బర్ ,మంద మహేష్, కుంభాల రాజకుమార్ ,వీర దేవేందర్ ,ముల్కల యోనా, నాగుల సతీష్, వనం రాము, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ లోనే కోనేరు కోనప్ప! ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన కోనేరు కోనప్ప.



భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 22: మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప వెనక్కితగ్గారు. కోనప్పను సీఎం రేవంత్ రెడ్డి పిలిచి చర్చించి పలు హామీలు ఇవ్వడంతో నిర్ణయం వెనక్కి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ భేటీలో సీఎంతో పాటు మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ఉన్నారు. అయితే నిన్న కాంగ్రెస్ను వీడుతున్నట్లు ప్రకటించిన కోనప్ప గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రసన్నహరికృష్ణ(బి ఎస్ పి)కు మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు.సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని ఖండించి చివరి వరకు కాంగ్రెస్ లోనే కొనసాగుతానని తెలిపారు.

## సాగునీటికోసం డ్యాంసెఫ్టి అధికారులతో సమీక్ష ఏర్పాటు చేసి రైతులను అదుకో

### సిఎం రేవెంత్ రెడ్డికి మాజీ ఎంపీ బోయినిపల్లి సూచన



కరీంనగర్, ఫిబ్రవరి 22(భారత శక్తి):తెలంగాణ రాష్ట్ర ప్రజానీకాన్ని నట్టేట ముంచడానికి, మోసం చేసి అధికారంలోకి వచ్చిన సిఎం రేవెంత్ రెడ్డి ప్రజాపాలన లో రైతాంగం ఆగమాగం అవుతున్నారని మాజీ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీ బోయినిపెల్లి వినోద్ కుమార్ ఆవేదన వ్యక్తంచేశారు. శనివారం కరీంనగర్ లోని మాజీ మంత్రి గంగుల కమలాకర్ నివాసంలో చొప్పదండి ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ తో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వినోద్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు ముదురుతున్నాయని, వ్యవసాబావులో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు...ఇలాంటి పరిస్థితిని ముందే పసిగట్టి మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టారని చెప్పారు..ప్రాజెక్టు కింద మేడిగడ్డ, సుందిళ్ళ, ప్రాణహిత ఎత్తిపోతల పథకాలు చేపట్టారని చెప్పారు..రాష్ట్ర ప్రజానీకం సస్యశ్యామలంగా ఉండాలన్న ఉద్దేశంతో కెసిఆర్ ఒక ప్రణాళిక బద్ధంగా పాలనచేపట్టారని చెప్పారు.. 14నెలల కింద రాష్ట్ర ప్రజానీకాన్ని మోసం అధికారంలోకి వచ్చి అన్ని రంగాల్లో ప్రభుత్వ పాలన విపాల విఫలమైందన్నారు. ఇప్పటికైనా ఎప్పటికైనా కేసీఆర్ ను బాధునాం చేసిన ప్రజలను సిఎం రేవేంత్ రెడ్డి మోసాలను నమ్మే స్థితిలో లేరని చెప్పారు. పంటలు పొట్టదశకు వస్తున్నాయని, పొలాలకు నీరందక నెర్రెలువస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు..ఈ దశలో వెంటనే రాష్ట్రంలోని డ్యాం సేఫ్టి , నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని సిఎం కు సూచించారు. ఈ సమావేశంలో బిఆర్ ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జీవి రామకృష్ణారావు. మాజీ కార్పొరేటర్లు వాల రమణారావు, గందే మాధవి, నగర పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్ గౌడ్ లు పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణలో శిక్షణ ముఖ్యమైనది:జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల, ఫిబ్రవరి 22(భారత శక్తి):మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్– కరీంనగర్ ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాల శాసనమండలి సభ్యుల ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించడంలో అధికారులు, సిబ్బంది పొందుతున్న శిక్షణ ముఖ్యమైనదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించడంలో అధికారులు, సిబ్బందికి ఇస్తున్న ముఖ్యమైనదని అన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను తూ.చా. తప్పకుండా పాటించి ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలని తెలిపారు. పోలింగ్ ఒక రోజు ముందు ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలను సందర్శించాలని తెలిపారు. జిల్లాలో పట్టభద్రుల శాసనమండలి సభ్యుల ఎన్నిక కొరకు 40 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయ శాసనమండలి సభ్యుల ఎన్నిక కొరకు 18 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి పోలింగ్ కేంద్రానికి 300 మీటర్ల వ్యాసార్థం పరిధిలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు సంబంధించి ఎలాంటి ప్రచార సంబంధిత అంశాలు ఉండకూడదని తెలిపారు. పోలింగ్ సమయంలో బ్యాలెట్ బాక్స్ లో ఉన్న స్లిప్పులు, రిజిస్టర్లో నమోదు చేసిన వివరాలలో ఎలాంటి బేధాలు ఉండకూడదని, ఓటర్లు, రిజిస్టర్లు, సంతకాలు, పరికరాల ఇతర అన్ని అంశాలలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పోలింగ్ సమయంలో ఓటర్ల గోప్యతకు ప్రాముఖ్యత ఇవ్వాలని, ఎన్నికల ప్రక్రియకు సంబంధించి



ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఎన్నికలలో పోలింగ్ శాతం పెంపొందించాలని, ఎన్నికల ప్రక్రియపై పి.ఓ.లు, ఎ.పి.ఓ.లకు మాన్యువల్ అందించడం జరుగుతుందని, ఈ మాన్యువల్ ప్రకారంగా ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.

ఈ నెల 27వ తేదీన ఉదయం 8 గం॥ల నుండి సాయంత్రం 4 గం?ల వరకు జరుగునున్న పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సను పోలింగ్ కేంద్రం నుండి స్ట్రాంగ్ రూమ్ కు అక్కడి నుండి కరీంనగర్ కు తరలించేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలవుతున్న సందర్భంగా ఎవరైనా నిబంధనలను ఉల్లంఘించినట్లయితే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ క్రింద చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 'ఛావా'పై మోదీ ప్రశంసలు.. విక్కీ కౌశల్ ఆనందం

ముంబయి: విక్కీకౌశల్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఛావా' ( పై ప్రధాని మోదీ ) ప్రశంసలు కురిపించిన విషయం తెలిసిందే. దీనిపై తాజాగా విక్కీ కౌశల్ ఆనందం వ్యక్తంచేశారు. తమ చిత్రాన్ని ప్రశంసించిన ప్రధానికి ధన్యవాదాలు చెప్పారు. సంతోషంతో మాటలు రావడం లేదని తెలుపుతూ ఇన్‌స్టా వేదికగా పోస్ట్ పెట్టారు. ''ఒక చారిత్రక గౌరవం. గౌరవనీయులైన ప్రధాని నరేంద్రమోదీ ఛావాను ప్రశంసించడం, ఛత్రపతి శంభాజీ మహారాజ్ త్యాగాన్ని కీర్తించడం గర్వించదగిన గొప్ప క్షణం'' అని పేర్కొన్నారు.




98వ అఖిల భారత మరాఠీ సాహిత్య సమ్మేళనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'ఛావా' చిత్రాన్ని ఉద్దేశించి మాట్లాడారు. “హిందీ సినిమాతో పాటు మరాఠీ చిత్రాల స్థాయిని పెంచడంలో మహారాష్ట్ర, ముంబయి కీలకపాత్ర పోషించింది. కొత్త సినిమా 'ఛావా' ప్రస్తుతం అంతటా ఆదరణ సొంతం చేసుకుంది. శివాజీ సావంత్ మరాఠీ నవల వల్లే ఈ శంభాజీ మహారాజ్ వీరత్వాన్ని చిత్ర రూపంలో పరిచయం చేయడం సాధ్యమైంది” అని అన్నారు.

# మేనల్లుడు హీరోగా ధనుష్ దర్శకత్వం

## జాబిలమ్మ నీకు అంతకోపమా..బాగుందన్న నటి కీర్తి

హీరో ధనుష్ నల్లుడు పవిష్ నారాయణ్ నటుడిగా ఎంట్రీ ఇచ్చిన చిత్రం 'నిలవుకు ఎన్‌మేల్ ఎన్నడి కోబమ్' ధనుష్ దర్శకత్వంలో ఇది తెరకెక్కింది. అనిఖ సురేంద్రన్, ప్రియాప్రకాశ్ వారియర్, మాథ్యూ థామస్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. శుక్రవారం ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకువచ్చింది. తాజాగా దీనిని నటి కీర్తిసురేశ్ వీక్షించారు. ఈ సినిమా తనకెంతో నచ్చిందని సోషల్‌మీడియా వేదికగా పోస్ట్ పెట్టారు. ధనుష్ మేకింగ్ స్టైల్‌ను ఆమె మెచ్చుకున్నారు. 'ఇప్పుడే ఈ చిత్రాన్ని వీక్షించాను. సినిమా చాలా కొత్తగా, చూడచక్కగా ఉంది. ధనుష్.. మీ డైరెక్షన్‌లో మరో విభిన్నమైన కథను సృష్టించారు. మీ మేకింగ్ స్టైల్

నాకెంతో నచ్చింది. ఇంతమంది నటీనటులను స్క్రీన్‌పై చూడటం ఎంతో సంతోషంగా ఉంది. పవిష్.. హావభావాలు, వాయిస్, యాక్షన్ ఇలా ప్రతి విషయంలో నువ్వు ధనుష్‌ని గుర్తుచేశావు. అద్భుతమైన చిత్రంతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టావు. మాథ్యూ థామస్.. నీ పాత్ర ప్రేక్షకులకు ఎంతగానో గుర్తుండి పోతుంది. ప్రియాంకా మోహన్.. నీ డ్యాన్స్ అదిరింది. టీమ్ అందరికీ అభినందనలు' అని ఆమె రాసుకొచ్చారు. ఇదే చిత్రం తెలుగులో 'జాబిలమ్మ నీకు అంత కోపమా' అనే పేరుతో విడుదలైంది. రొమాంటిక్ కామెడీ కథతో




దీనిని సిద్ధం చేశారు. 'రాయన్' తర్వాత ధనుష్ దర్శకత్వం వహించిన చిత్రమిదే కావడంతో ప్రమోషన్స్ సమయంలోనే ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంది.

# చిరంజీవి ప్రోత్సాహం మరువలేనిది: సందీప్ కిషన్

మజాకా'తో ప్రేక్షకులను అలరించేందుకు నటుడు సందీప్ కిషన్ సిద్ధమయ్యారు. ఈ మూవీ మహాశివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 26న ఇది విడుదల కానుంది. ఈసందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సందీప్‌కిషన్ పలు విశేషాలు పంచుకున్నారు. కెరీర్‌లో తాను ఎన్నో ఎత్తుపల్లాలు చూశానని అన్నారు. ప్రస్తుతం మంచి ప్రాజెక్ట్‌లు చేస్తున్నానని తెలిపారు. ఎవరి సపోర్ట్ లేకుండా నేను పరిశ్రమలోకి వచ్చాను. కెరీర్ పరంగా ఎత్తుపల్లాలు చూశాను. 'ఒక్క అమ్మాయి తప్ప' సినిమా ముందు వరకూ ఎంతోమంది దర్శక, నిర్మాతలు తమ కథలను నాతో పంచుకునేవారు. కథలపై నాకొక మంచి జడ్జిమెంట్ ఉంటుందని వారు నమ్మేవారు. కానీ ఆ తర్వాత పరిస్థితి మారిపోయింది. నా సినిమాలు వరుస పరాజయాలు అందుకోవడంతో నా జడ్జిమెంట్ సరైనది కాదని వారు భావించారు. కెరీర్‌లో వరుస అపజయాలు, రిలేషన్‌షిప్ బ్రేకప్.. జీవితంలో ఏం జరుగుతుందో అర్థంకాక ఎంతో బాధపడ్డా. రోజుకు అరకిలో ఐస్‌క్రీమ్, చాక్లెట్స్ తినేశా. నా బరువు 97 కిలోలకు చేరింది. ఆ సమయంలో నా స్నేహితుడు రూ.కోటి ఇస్తే 'నిను వీడని నీడను నేనే' చేసి రూ.6 కోట్లు రాబట్టా. అక్కడినుంచి జాగ్రత్తగా కథలు ఎంచుకుంటూ కష్టపడుతున్నా' అని సందీప్ కిషన్ అన్నారు.



కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ తనయుడు జేసన్ సంజయ్ దర్శకుడిగా తెరకెక్కిస్తోన్న చిత్రంలో యాక్ట్ చేయడంపై మాట్లాడుతూ.. ఆ సినిమా చిత్రీకరణ మొదలుపెట్టామంతే. వరుస ప్రాజెక్ట్‌ల వల్ల నా డేట్స్ సర్దుబాటు చేయడం వీలుపడలేదు. త్వరలోనే ఆ సెట్‌లోకి అడుగుపెడతా. 'మజాకా' షూట్ సమయంలో ఓసారి అనుకోకుండా అగ్ర కథానాయకుడు చిరంజీవిని కలిశాను. మా మధ్య మంచి అనుబంధం ఉంది. 'మజాకా' కథ చేస్తున్నందుకు నన్ను మెచ్చుకున్నారు. ఈ కథ తనకెంతో నచ్చిందని.. తాను చేయలేకపోయినందుకు బాధపడ్డానని తెలిపారు. 'సంజయ్‌తో నువ్వు సినిమా చేస్తున్నావని తెలిసింది. ఒక తెలుగు హీరోతో వాళ్లు సినిమా చేయాలనుకుంటున్నారంటే మనం గర్వపడాల్సిన విషయం' అన్నారు. ఆ మాట నాకెంతో ఆనందాన్ని ఇచ్చింది. నేను ఆ విధమైన ప్రశంసలనే అందరి నుంచి కోరుకుంటున్నా అని చెప్పారు.

# ఓటిటిలోకి వస్తోన్న ఎమర్జెన్సీ

కంగనా రనౌత్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఎమ్జ్గ÷న్సీ'. పలుమార్లు వాయిదా పడుతూ వచ్చి చివరకు జనవరి 17న థియేటర్లలో విడుదలై బాక్సాఫీస్ వద్ద మిశ్రమ స్పందనలకే పరిమితమైంది. త్వరలో ఇది ఓటీటీ వేదికగా ప్రేక్షకులకు అందుబాటులో ఉండనుందని కంగన తాజాగా ప్రకటించారు. నెట్‌ఫ్లిక్స్ వేదికగా మార్చి 17 నుంచి ఇది స్ట్రీమింగ్ కానుందని తెలిపారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ రాజకీయ జీవితాన్ని ఆధారంగా చేసుకొని 'ఎమర్జెన్సీ' చిత్రాన్ని రూపొందించారు. అత్యవసర పరిస్థితి ప్రకటించిన సందర్భాన్ని ఆధారంగా చేసుకొని దీనిని సిద్ధం చేశారు. ఇందిరాగాంధీగా కంగనా నటించగా.. జయప్రకాశ్ నారాయణ్ పాత్రలో అనుపమ్ ఖేర్, అటల్ బిహారీ వాజ్‌పేయీగా శ్రేయాస్ తల్పడే నటించారు. ఎన్నో అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది. రూ.60 కోట్లతో దీనిని రూపొందించగా.. రూ.21 కోట్లు మాత్రమే ఈ సినిమా రాబట్టినట్లు అంచనా.




# మణిరత్నం సినిమాలో ఛాన్స్ కొట్టేసిన నవీన్ పోలిశెట్టి

టాలీవుడ్ యువ కథానాయకుడు నవీన్ పోలిశెట్టి బంపరాఫర్ కొట్టినట్లు తెలుస్తుంది. తాజాగా ఆయన దిగ్గజ దర్శకుడు మణిరత్నంతో సినిమా చేయబోతున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ, జాతి రత్నలు, మిస్ శెట్టి, మిస్టర్ పోలిశెట్టి సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు నవీన్. సినిమా సినిమాకు గ్యాప్ తీసుకునే నవీన్ ఇటీవల యాక్సిడెంట్ కావడంతో చేయికి

గాయం అయ్యింది. దీంతో ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాడు. అయితే నవీన్ ప్రస్తుతం చేస్తున్న చిత్రం అనగనగా ఒకరాజు. మీనాక్షి చౌదరీ ఈ సినిమాలో కథనాయికగా నటిస్తుంది. ఈ సినిమా అనంతరం నవీన్ మణిరత్నం సినిమాలో చేయబోతున్నట్లు తెలుస్తుంది. లవ్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి త్వరలోనే అన్ని వివరాలు వెల్లడించనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. మణిరత్నం విషయానికి వస్తే.. ప్రస్తుతం థగ్ లైఫ్ అనే సినిమను తెరకెక్కిస్తున్నాడు. కమల్ హాసన్, శింబు ప్రధాన పాత్రల్లో వస్తున్న ఈ చిత్రం ఈ సమ్మర్ కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది.



# హరిహర వీరమల్లు నుంచి కొల్లగొట్టినాదిరో..పాట



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'హరిహర వీరమల్లు' నుండి సెకండ్ సింగిల్ 'కొల్లగొట్టినాదిరో' ఫిబ్రవరి 24న విడుదల కాబోతోంది. ఈ సందర్భంగా శుక్రవారం సాంగ్ ప్రోమోను విడుదల చేశారు. కథానాయకుడు పవన్ కళ్యాణ్ తో పాటు కథానాయిక నిధి అగర్వాల్ పై ఈ పాటను నైట్ ఎఫెక్ట్ లో చిత్రీకరించారు. విశేషం ఏమంటే... ఇందులో అనసూయ భరద్వాజ్‌తో పాటు పూజిత పొన్నాడ కూడా స్పెషల్ అప్పీయరెన్స్ ఇచ్చింది. 'కోర కోర మీసాలతో, కొదమ కొదమ అడుగులతో... కొంటెకొంటె చణుకులతో, కొలిమి లాంటి మగటిమితో... సరసర వచ్చినాడు చిచ్చర పిడుగంటి వాడు' అంటూ సాగే ఈ పాటను చంద్రబోస్ రాశారు. దీనిని ఎం.ఎం. కీరవాణి స్వరపర్చగా, దీనిని మంగ్లీ , రాహుల్ సిప్లిగంజ్, రమ్య బెహరా, యామిని ఘంటసాల గానం చేశారు.ఎ.ఎం. రత్నం సమర్పణలో ఆయన సోదరుడు దయాకరరావు 'హరిహర వీరమల్లు' సినిమాను నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా ఇది విడుదల కాబోతోంది. తొలి భాగాన్ని మార్చి 28న విడుదల చేయబోతున్నారు. ఈ సినిమాకు క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించారు. అయితే బాలెన్స్ ఉన్న చిత్రీకరణ ను పూర్తి చేసే బాధ్యతను ఎ.ఎం. రత్నం తనయుడు జ్యోతికృష్ణ భుజానికి కెత్తుకున్నాడు. పవన్ కళ్యాణ్ పాల్గొనగా నాలుగు రోజుల ఎ÷-లాష్ బ్యాక్ ఎపిసోడ్ ఒక్కటి ఇంకా చిత్రీకరించాల్సి ఉందని, అది మినహా మిగిలిన భాగానికి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ మొత్తం జరుగుతోందని తెలుస్తోంది. ఈ సినిమాలో ఇతర ప్రధాన పాత్రలను బాబీ డియోల్, నాజర్, సునీల్, రఘుబాబు, సుబ్బరాజు, నోరా ఫతేహి తదితరులు పోషించారు.




# చిరకాల ప్రత్యర్థితో పోరు.. ఈసారి ఆ లెక్క సరి చేస్తారా..?

ఛాంపియన్స్ ట్రోఫీ )లో అన్ని మ్యాచ్‌లది ఒక లెక్క.. ఆ ఒక్క మ్యాచ్‌ది మరో లెక్క. ఆ జట్లు తలపడుతుంటే.. ఆ దేశాల నుంచే కాదు, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది అభిమానులు టీవీల ముందుకు చేరిపోతారు. వేదిక ఏదైనా సరే.. ఆ జట్ల మధ్య పోరు హైఓల్టేజ్ మ్యాచ్‌గా మారుతుంది. ఇప్పటికే అర్థమై ఉంటుంది. అది చిరకాల ప్రత్యర్థులైన భారత్–పాకిస్థాన్ మధ్య మ్యాచ్ అని. ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా దాయాది జట్లు ఆదివారం తలపడుతున్నాయి. మరి గత ఫైనల్ ఓటమికి భారత్ ప్రతీకారం తీర్చుకుంటుందా?

వారు ఓటమితో.. మనం విజయంతో..

ఇక డిఫెండింగ్ ఛాంపియన్ పాక్ (%×అఎఖు జం ౖఖుఎఅర్ఖఅ%) ఈ ట్రోఫీని ఓటమితో ప్రారంభించగా.. బంగ్లాపై ఘన విజయంతో భారత్ రెట్టించిన ఆత్మ విశ్వాసంతో బరిలోకి దిగుతోంది. ఫకర్ జమాన్ దూరం కావడం పాక్ జట్టుకు పెద్ద లోటే. స్టార్ బ్యాటర్ బాబర్ అజామ్ ఫామ్ లేమి కూడా వారిని ఇబ్బంది పెట్టే అంశమే. మరోవైపు బుమ్రా లేకపోయినా.. టీమ్ఇండియా పేస్ దళాన్ని తొలి మ్యాచ్‌లో అద్భుతంగా షమీ ఐదు వికెట్ల ప్రదర్శనతో ముందుకు నడింపించాడు. అతడికి హర్షిత్ రాణా తోడయ్యాడు. స్పిన్నర్లు కూడా తమవంతు ప్రాత్ర పోషించారు. మరి వీరు పాకిస్థాన్‌పై ఎలాంటి ప్రదర్శన చేస్తారో చూడాలి. ఇక దూకుడుగా ఆడుతున్న రోహిత్, శతక వీరుడు గిల్ మరోసారి చెలరేగితే.. టీమ్ఇండియాకు భారీ పరుగులు ఖాయమే. పాకిస్థాన్‌పై గొప్ప ఇన్నింగ్స్‌లు ఆడిన కోహ్లీ.. తన మునుపటి ఫామ్‌ను అందుకొని రాణిస్తే.. భారత్‌కు తిరుగుండదు.

వారికి చావో రేవో..

అయితే.. తొలి మ్యాచ్‌లో ఓటమి చవిచూసిన పాకిస్థాన్‌కు భారత్‌తో మ్యాచ్ అత్యంత కీలకం. ఈ మ్యాచ్‌లో ఓడితే అంతే.. ఆ జట్టు టోర్నీ నుంచి ఇంటి ముఖం పట్టాల్సిందే. దీంతో ఆ జట్టును తక్కువగా అంచనా వేయడానికి వీల్లేదు. దాయాదుల పోరు అంటే ఇరుజట్ల ఆటగాళ్లు ప్రాణంపెట్టి ఆడతారన్న విషయం తెలిసిందే. ఈ ఆసక్తికరమైన పోరు నేపథ్యంలో రెండు జట్లు ఛాంపియన్స్ ట్రోఫీలో ఎన్నిసార్లు తలపడ్డాయి.. ఫలితాలు ఎలా ఉన్నాయంటే..?

పైచేయి ఎవరిదంటే..?: ఇప్పటివరకూ ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్, పాకిస్థాన్ జట్లు ఐదుసార్లు తలపడ్డాయి. ఇందులో పాక్‌దే పైచేయి అని చెప్పొచ్చు. ఎందుకంటే మూడు సార్లు పాకిస్థాన్ నెగ్గగా.. రెండుసార్లు భారత్ విజయం సాధించింది.

అప్పుడు రెండు సార్లు..: 2004, 2009, 2013లో ఒక్కోసారి ఇరు జట్లు తలపడగా.. చివరిసారిగా జరిగిన 2017 ఛాంపియన్స్ ట్రోఫీలో దాయాది దేశాలు రెండుసార్లు తలపడటం విశేషం. ఈ రెండు జట్లు ఫైనల్‌కు చేరాయి.

తొలి విజయం పాక్‌దే..: 2004 ఛాంపియన్స్ ట్రోఫీలో చిరకాల ప్రత్యర్థులు తొలిసారి తలపడ్డారు. గ్రూప్ సీలో ఉన్న ఈ రెండు జట్ల మధ్య సెప్టెంబర్ 19న ఎడ్జ్‌బాస్టన్ వేదికగా మ్యాచ్ జరిగింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమ్ఇండియా 200 పరుగులు చేయగా.. పాకిస్థాన్ మూడు వికెట్ల తేడాతో విజయం సాధించింది.

మరోసారి భంగపాటు..: 2009లో గ్రూప్ ఏలో భాగంగా రెండు జట్లు సెంచూరియన్ వేదికగా తలపడ్డాయి. పాక్ మరోసారి టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 50 ఓవర్లలో 302 పరుగులు చేసింది. ఆ తర్వాత భారత్ 248 పరుగులకే 44.5 ఓవర్లలో కుప్పకూలింది. దీంతో భారత్‌పై రెండోసారి విజయాన్ని నమోదు చేసింది.

దాయాదిపై తొలి గెలుపు..: 2013లో గ్రూప్ బీలో భాగంగా లీగ్ స్టేజ్ చివర్లో జూన్ 15న రెండు జట్లు తలపడ్డాయి. ఈసారి ఇండియా టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. వాతావరణం అనుకూలించకపోవడంతో 40 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో పాక్‌ను 165 పరుగులకు భారత్ కట్టడి చేసింది. ఆ తర్వాత కూడా వర్షం అంతరాయం కలిగించడంతో టీమ్ఇండియా లక్ష్యాన్ని 22 ఓవర్లకు 102 పరుగులకు కుదించారు. 19.2 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి పాక్‌పై తొలి విజయాన్ని భారత్ నమోదు చేసింది. రెండు వికెట్లు పడగొట్టిన భువనేశ్వర్ కుమార్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

తొలి మ్యాచ్ మనదే అయినా..: 2017 ఛాంపియన్స్ ట్రోఫీ గ్రూప్ స్టేజ్‌లో పాకిస్థాన్‌పై ఘన విజయాన్ని భారత్ నమోదు చేసింది. గ్రూప్ బీలో భాగంగా జూన్ 4న ఎడ్జ్‌బాస్టన్ వేదికగా ఈ మ్యాచ్ జరిగింది. వర్షం కారణంగా మ్యాచ్‌ను 48 ఓవర్లకు కుదించగా.. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ మూడు వికెట్ల నష్టానికి 319 పరుగులు చేసింది. ఆ తర్వాత పాకిస్థాన్‌కు 41 ఓవర్లలో 289 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించారు. అయితే.. పాక్ 33.4 ఓవర్లలో 164 పరుగులే చేసింది. డక్‌వర్త్ పద్ధతిలో టీమ్ఇండియా విజేతగా నిలిచింది. యువరాజ్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

భారత్‌కు అదో పీడ కల: 2017 ఫైనల్‌కు చేరిన భారత్.. తిరిగి పాకిస్థాన్‌తోనే తలపడింది. జూన్ 18న లండన్‌లోని ఓవల్ మైదానం వేదికగా మ్యాచ్ జరగ్గా.. తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ నిర్ణీత 50 ఓవర్లలో టీమ్ఇండియా ముందు 339 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచింది. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన భారత్.. ఘోరంగా విఫలమై 158 పరుగులకే ఆలౌట్ అయ్యింది. దీంతో తొలిసారి పాకిస్థాన్ ఛాంపియన్స్ ట్రోఫీని ముద్దాడింది.

ఆనాటి ఫైనల్‌లో ఘోర ఓటమికి బదులు తీర్చుకొనే అవకాశం టీమ్ఇండియాకు వచ్చింది. గత వన్డే ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌ను చిత్తుగా ఓడించిన నేపథ్యంలో.. మరోసారి ఆ జట్టును ఓడించి సత్తా చాటాలని ప్రతీ భారత అభిమాని కోరుకుంటున్నాడు. దుబాయ్ వేదికగా జరిగే ఈ మ్యాచ్‌లో విజయం సాధించి ఇరు జట్ల మధ్య ఫలితాల లెక్కను 3–3తో సరిచేయాలని ఆకాంక్షిస్తున్నారు. పలువురు సీనియర్లకు ఇదే చివరి ట్రోఫీ అని భావిస్తున్న తరుణంలో దాయాదిపై చెలరేగి ఆడి.. చిరస్మరణీయ విజయాన్ని నమోదు చేసి కెరీర్‌కు ముగింపు పలకాలని కోరుతున్నారు.

# ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు 9 కేజీలు తగ్గిన షమీ



ఐసీసీ ట్రోఫీ అంటే భారత స్టార్ పేసర్ మహ్మద్ షమీ (%ూష్ఘుఎఱ%) చెలరేగిపోతాడు. దాదాపు 14 నెలల తర్వాత ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టిన షమీ.. ఛాంపియన్స్ ట్రోఫీ (%×జజ జష్ట్రుఎ-జూఅశీఅం ౧తీశీజూష్ట్రఎ% 2025) తొలి మ్యాచ్‌లోనే ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. బంగ్లాదేశ్‌పై 5/53 గణాంకాలను నమోదు చేసిన షమీ వన్డే, ఛాంపియన్స్ ట్రోఫీల్లో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా నిలిచాడు. అయితే, ఈ టోర్నీకి ముందు ఫిట్‌నెస్ సాధించేందుకు తీవ్రంగా కష్టపడ్డాడు. దాదాపు 9 కేజీల వరకు బరువు తగ్గినట్లు షమీ తెలిపాడు. ఆ వీడియోను బీసీసీఐ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేసింది. గాయం నుంచి కోలుకునేందుకు జాతీయ క్రికెట్ అకాడమీలో చాన్నాళ్లు సమయం గడిపానని.. దేశవాళీ క్రికెట్‌లో ఆడటం వల్ల బౌలింగ్‌లో రిథమ్‌ను అందుకోవడం సులువైందని షమీ వెల్లడించాడు. భారత మాజీ క్రికెటర్ నవ్‌జ్యోత్ సిద్ధూతో షమీ చిట్‌చాట్ నిర్వహించాడు.

సిద్ధూ: హాయ్ షమీ.. నువ్వు ఎలా ఐదారు కేజీలు బరువు తగ్గావు?

షమీ: నేను 9 కేజీలు తగ్గా.

సిద్ధూ: అస్సలు అన్నమే తినలేదా? బిర్యానీ కూడా తినలేదా?

షమీ: గాయం నుంచి కోలుకుని వచ్చేందుకు చాలా శ్రమించా. నేను ఎన్‌సీఏకు వెళ్లినప్పుడు దాదాపు 90 కేజీల వరకు ఉన్నా. నేనెప్పుడూ రుచి కోసం తినాలనుకోను. అలాగే ఎక్కువగా స్వీట్లు తినను. అలాంటి వాటికి చాలా దూరంగా ఉంటా. ఇక బిర్యానీ విషయంలోనే కొంత ఆందోళన ఉండేది. అప్పుడప్పుడు చేసే చీట్‌మీల్‌తో పెద్ద సమస్య ఉండేది కాదు. నేను 2015 నుంచి రోజుకు ఒక్క పూటే తింటున్నా. బ్రేక్‌ఫాస్ట్, లంచ్ చేయను. నేరుగా డిన్నర్ చేస్తా. ఇది మొదట్లో కష్టంగా అనిపించినా.. అలవాటైతే ఈజీ అయిపోతుంది

FONT SIZE



# భారత్ vs పాకిస్థాన్ పోరు.. గేమ్ ఛేంజర్స్ వీరే

ఐసీసీ టోర్నీల్లోనే తలపడుతూ ఫ్యాన్స్‌కు అసలైన క్రికెట్ మజాను అందిస్తున్న టీమ్‌లు భారత్ – పాకిస్థాన్. ఇప్పుడు మరోసారి ఢీకొట్టేందుకు సిద్ధమయ్యాయి దాయాది టీమ్‌లు. ఛాంపియన్స్ ట్రోఫీ లో దుబాయ్ వేదికగా ఆదివారం ఈ మ్యాచ్ జరగనుంది. ఇటు భారత్‌పైనా.. అటు పాక్‌పైనా ఆయా జట్ల అభిమానులు భారీ అంచనాలే పెట్టుకుంటారు. ఇరు జట్లలోనూ (%×చీణ జం ౖూఖ%) మ్యాచ్ విన్నర్లకు కొదవేం లేదు. మరి ఆ గేమ్ ఛేంజర్స్‌పై ఓ లుక్కేద్దాం.

భారత ఓపెనర్లు %ూ% పాక్ తొలి స్పెల్ పేసర్లు

దుబాయ్ పిచ్ ఆరంభంలో ఫాస్ట్ బౌలింగ్‌కు అనుకూలంగా ఉంటుంది. ఇప్పటికే బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో భారత పేసర్లు షమీ, హర్షిత్ నిరూపించారు. ఇప్పుడు పాక్‌తో మ్యాచ్‌లోనూ టీమ్ఇండియా ఓపెనర్లకు కఠిన సవాల్ తప్పదు. రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ మంచి ఫామ్‌లోనే ఉన్నారు. అయితే, పాక్ పేసర్లు షహీన్ షా అఫ్రిది, నసీమ్ షా నుంచి ప్రతిఘటన తప్పదు. వన్డేల్లో షహీన్ బౌలింగ్‌లో రోహిత్ రెండుసార్లు ఔటయ్యాడు. 56 బంతులు ఎదుర్కొని కేవలం 48 పరుగులే చేశాడు. ఈసారి మాత్రం షహీన్‌పై రోహిత్ ఆధిపత్యం ప్రదర్శించాలనేది భారత అభిమానుల ఆకాంక్ష.

భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ (%ఎఱతీష్ ఖశీష్ట్రశ్రీఱ%)కి ఇప్పుడు ఫామ్ సమస్యగా మారింది. ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌లో హాఫ్ సెంచరీ సాధించిన అతడు.. ఛాంపియన్స్ ట్రోఫీ తొలి మ్యాచ్‌లో బంగ్లాపై 22 పరుగులు చేశాడు. కానీ, అందుకోసం 38 బంతులు తీసుకోవడం గమనార్హం. ఇక్కడా ఆత్మవిశ్వాసంతో బ్యాటింగ్ చేసినట్లు అనిపించలేదు. స్పిన్ బౌలింగ్‌లోనే పెవిలియన్‌కు చేరాడు. ఇక పాకిస్థాన్‌తో కోహ్లీకి ఇద్దరి నుంచి ముప్పు తప్పదు. అందులో ఒకరు హారిస్ రవూఫ్ కాగా.. మరొకరు అబ్రార్ అహ్మద్. వీరిలో హారిస్ పేసర్ కాగా, అబ్రార్ మాత్రం ఏకైక స్పెషలిస్ట్ స్పిన్నర్. రవూఫ్‌పై వన్డేల్లో విరాట్‌కు పెద్దగా గణాంకాలు లేవు. కానీ, టీ20ల్లో మాత్రం కోహ్లీదే ఆధిపత్యం. పొట్టి ఫార్మాట్‌లో 32 బంతుల్లో 42 పరుగులు రాబట్టాడు. ఇక స్పిన్‌ను ఆడటంలో విరాట్ ఇబ్బందిపడుతున్న సంగతి తెలిసిందే. భారత్‌కు కొత్త స్పిన్నర్ అయిన అబ్రార్‌ను ఎలా ఆడతాడనేది ఆసక్తికరంగా మారనుంది. శ్రేయస్ అయ్యర్, అక్షర్ పటేల్, కేఎల్ రాహుల్ కూడా పాక్ పేస్‌ను ఎదుర్కొని పరుగులు చేయాల్సిన అవసరం ఉంది. స్కోరు బోర్డుపై భారీగా పరుగులు ఉంటే భారత బౌలింగ్ విభాగంపై పెద్దగా ఒత్తిడి లేకుండా ఉంటుంది.

కెప్టెన్ మహ్మద్ రిజ్వాన్, బాబర్ అజామ్ పాకిస్థాన్ జట్టుకు ఆయువుపట్టులాంటోళ్లు. బాబర్ ఓపెనర్ కాగా.. రిజ్వాన్ వన్‌డౌన్‌లో వస్తాడు. వీరిద్దరిని త్వరగా ఔట్ చేస్తే భారత్ పైచేయి సాధించడం చాలా ఈజీ. ఆ బాధ్యతను తొలి స్పెల్ వేసే మహ్మద్ షమీ, హర్షిత్ రాణా తీసుకోవాలి. బంగ్లాదేశ్‌పై స్వల్ప వ్యవధిలోనే వికెట్లు తీసి భారత్‌కు మంచి ఆరంభమే ఇచ్చారు. బాబర్ గత మ్యాచ్‌లో హాఫ్ సెంచరీ సాధించిన విషయాన్ని మరిచిపోకూడదు. ఎక్కువ బంతులు తీసుకున్నప్పటికీ.. ఇతర టాప్ ఆర్డర్ బ్యాటర్లతో పోలిస్తే మెరుగ్గానే ఆడినట్లే. భారత్ అంటే రిజ్వాన్, బాబర్ ఇంకాస్త నిలకడగా ఆడేందుకు ప్రయత్నిస్తారు.

పాక్ మిడిలార్డర్ %శ% టీమ్ఇండియా స్పిన్

బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో 35/5 స్కోరుతో టాప్ ఆర్డర్ వెన్నువిరిచిన భారత బౌలర్లు.. ఆ తర్వాత పట్టు వదిలారు. అయితే క్యాచ్‌లు, స్టంపింగ్ మిస్ కావడం వల్ల అలా జరిగిందని అనుకున్నా.. మిడిలార్డర్ బ్యాటర్‌తో సెంచరీ చేయించడం మాత్రం సరికాదనే భావన అభిమానుల్లో ఉంది. అతడే రాణించకపోతే లక్ష్య ఛేదన ఇంకాస్త ముందే ముగిసేది. నెట్ రన్‌రేట్ విషయంలో చాలా మెరుగ్గా ఉండేవాళ్లం. ఇప్పుడు పాకిస్థాన్‌తో పోరులోనూ మిడిలార్డర్‌పై దృష్టి పెట్టాలి. మరీ ముఖ్యంగా ఖుష్దిల్ షా, సల్మాన్ అఘా వంటి ప్లేయర్లు న్యూజిలాండ్‌పై మంచి ఇన్నింగ్స్‌లే ఆడారు. జట్టును గెలిపించలేకపోయినా ఓటమి అంతరాన్ని బాగా తగ్గించారు. వీరిపై భారత స్పిన్నర్లు కుల్‌దీప్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్ దృష్టిసారించాల్సిందే. ఏమాత్రం పట్టు విడిచినా ఫలితంపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం లేకపోలేదు.

# టీమ్ ఇండియానే ఫేవరెట్.. పాక్ జట్టులో చాలా సమస్యలు: ఇర్ఫాన్ పఠాన్



ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ (%×జజ జష్ట్రుఎజూఅశీఅం ౧తీశీజూష్ట్రఎ% 2025)లో ఆదివారం అత్యంత కీలకమైన పోరు జరగనుంది. భారత్, పాకిస్థాన్ జట్లు తలపడనున్నాయి. టీమ్ఇండియా తన తొలి మ్యాచ్‌లో బంగ్లాపై విజయం సాధించగా.. పాక్ మాత్రం కివీస్ చేతిలో ఘోర పరాభవం ఎదుర్కొంది. ఈ మ్యాచ్‌లో పాక్ పైనా గెలిచి సెమీస్ బెర్తును ఖరారు చేసుకోవాలనే లక్ష్యంతో భారత్ బరిలోకి దిగనుంది. మరోవైపు పాక్‌కు ఇది చాలా కీలకమైన మ్యాచ్. ఇందులో ఓడితే డిఫెండింగ్ ఛాంపియన్ ఇంటిముఖం పట్టాల్సిందే. అయితే, పాక్ కంటే టీమ్ఇండియా(%×చీణ జం ౖూఖ%)నే ఈ మ్యాచ్‌లో ఫేవరెట్ అంటూ మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ పేర్కొన్నాడు. దాయాది జట్టులో చాలా సమస్యలు ఉన్నట్లు వెల్లడించాడు.

“పాకిస్థాన్ జట్టులో సీనియర్ల ఆట ఇంకా ఆందోళనకరంగానే ఉంది. ప్రస్తుతం మోడర్న్ డే క్రికెట్ ఆడటంలో విఫలమవుతున్నారు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో వెనకబడ్డారు. వారి ఆటతీరును న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో గమనించాం. భారత్‌తో పోరులోనైనా మారతారా? అంటే చెప్పడం కష్టమే. అయితే, ఇక్కడ బలాలు, బలహీనతల కంటే ఓ విషయం మాత్రం ఈ మ్యాచ్‌లో ప్రభావం చూపించడం ఖాయం. అదే, భారత్–పాక్ మధ్య పోరనే భావోద్వేగం.

# ఆల్టో కే10, ఎస్-ప్రెసో ధరల తగ్గింపు

దిల్లీ: ఆల్టో కే10, ఎస్-ప్రెసో మోడళ్లలోని కొన్ని వేరియంట్ల ధరలను తగ్గించినట్లు మారుతీ సుజుకీ ( ఇండియా సోమవారం వెల్లడించింది. కొత్త ధరలు తక్షణమే అమల్లోకి వస్తాయని తెలిపింది.

ఎస్-ప్రెసో పెట్రోల్ వేరియంట్ ధరను రూ.2,000 తగ్గించినట్లు మారుతీ సుజుకీ (ఇండియా తెలిపింది. కే10 పెట్రోల్ వెర్షన్ ధరను రూ.6,500 తగ్గించినట్లు రెగ్యులేటరీ ఫైలింగ్‌లో వెల్లడించింది. ఆల్టో కే10 ధర రూ.3.99 లక్షల వద్ద ప్రారంభమై రూ.5.96 లక్షల వరకు ఉంది. ఎస్-ప్రెసో ధర రూ.4.26 లక్షల నుంచి రూ.6.11 లక్షల (ఎక్స్‌షోరూం, దిల్లీ) మధ్య కొనసాగుతోంది.



మారుతీ సుజుకీలో ఆల్టో, ఎస్-ప్రెసోతో కూడిన మినీ కార్ల సెగ్మెంట్ విక్రయాలు ఆగస్టులో 10,648 యూనిట్లుగా నమోదయ్యాయి. క్రితం ఏడాది ఈ సంఖ్య 12,209గా ఉంది.

# గూగుల్, యాపిల్‌కు షాకిచ్చిన జియో.. క్లౌడ్ స్టోరేజీ ధరలు తగ్గేనా?

జియో యూజర్లకు బంపర్ ఆఫర్ ప్రకటించారు రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ. దీపావళి నుంచి 100 జీబీ వరకూ క్లౌడ్ స్టోరేజీని వెల్‌కమ్ ఆఫర్ కింద ఉచితంగా అందించనున్నట్లు వెల్లడించారు. దీంతో ఈ విభాగంలో కీలకంగా ఉన్న గూగుల్, యాపిల్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లయ్యిందని విశ్లేషకులు పేర్కొన్నారు. జియో ఎంట్రీతో క్లౌడ్ స్టోరేజ్ విభాగంలో గూగుల్ (, యాపిల్ తమ సేవల ధరలు తగ్గించే అవకాశం ఉందని భావిస్తున్నారు.



ఆండ్రాయిడ్, యాపిల్ యూజర్లు స్టోరేజీ సమస్యను ఎదుర్కొంటున్నారు. మరీ ముఖ్యంగా ఆండ్రాయిడ్ యూజర్లలో అధిక మంది గూగుల్ ఉచితంగా అందిస్తున్న 15జీబీ డేటా పరిమితికి చేరువయ్యారు. దీంతో వారు అదనపు స్టోరేజీ కోసం గూగుల్ వన్‌ను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రస్తుతం గూగుల్ వన్ 100జీబీ స్టోరేజీ ధర నెలకు రూ.130 ఉండగా.. ఐ క్లౌడ్ 50జీబీ స్టోరేజీ ధర రూ.75గా ఛార్జ్ వసూలు చేస్తోంది.

20 ఏళ్లకే కోటీశ్వరుడినయ్యా.. అంతలోనే అన్నీ కోల్పోయా

ఈ నేపథ్యంలో రిలయన్స్ 47వ వార్షిక సాధారణ సమావేశంలో అంబానీ క్లౌడ్ సేవల గురించి ప్రస్తావించారు. ''ఫొటోలు, వీడియోలు, డాక్యుమెంట్ల వంటి డిజిటల్ కంటెంట్‌ను జియో యూజర్లు భద్రంగా దాచుకునేలా జియో క్లౌడ్ స్టోరేజీని తీసుకురాబోతున్నాం. వెల్‌కమ్ ఆఫర్ కింద 100జీబీ క్లౌడ్ స్టోరేజీని ఉచితంగా అందించనున్నాం. ఇంకా ఎక్కువ క్లౌడ్ స్టోరేజీని కావాలనుకునే వాళ్లకి అందుబాటు ధరల్లోనే అందిస్తాం'' అని ముకేశ్ అంబానీ పేర్కొన్నారు.

రైడ్ అగ్రిగేటర్ అయిన ఓలా క్యాబ్స్ తొలుత మైక్రోసాఫ్ట్ అజూర్ క్లౌడ్ సేవల నుంచి వైదొలిగింది. తర్వాత గూగుల్ మ్యాప్స్ నుంచి నిష్క్రమించింది. తాజాగా సొంతంగా తీసుకొచ్చిన ఓలా మ్యాప్స్‌కు మళ్లింది. దీంతో ఏటా రూ.100 కోట్లు ఆదా అయినట్లు ఓలా సీఈఓ భవీశ్ అగర్వాల్ స్పష్టం చేశారు. దీంతో గూగుల్ మ్యాప్స్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇండియాలోని డెవలర్ల కోసం గూగుల్ మ్యాప్స్ గతంలో ఎన్నడూ లేనంతగా ధరలను 70శాతం తగ్గించింది. ఓలా, మ్యాప్ మై ఇండియా వంటి సంస్థలు బిగ్ టెక్ కంపెనీలకు సవాలు విసురుతున్న వేళ జియో ప్రకటన వెలువడింది. పోటీ నెలకొన్న వేళ క్లౌడ్ స్టోరేజీ ధరలను ఆయా కంపెనీలు తగ్గించే అవకాశం ఉందన్న విశ్లేషణలు వినవస్తున్నాయి.

# స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ కూడా యూపీఐతోనే..

ప్రస్తుతం మనం ఏదైనా ఐపీఓకు దరఖాస్తు చేస్తే యూపీఐ ద్వారా మన ఖాతాలో నగదును బ్లాక్ చేస్తున్నారు. ఒక్కసారి కేటాయింపులు జరిగితేనే ఆ డబ్బులను ఖాతా నుంచి మినహాయిస్తున్నారు. లేదంటే ఖాతాలో బ్లాక్ చేసిన మొత్తం రిలీజ్ అవుతోంది. దీనిని జనవరి 2019లోనే సెబీ అమల్లోకి తీసుకొచ్చింది.





ఇది పబ్లిక్ ఇష్యూలు అంటే ప్రాథమిక మార్కెట్ వరకు ఇప్పటి పరిస్థితి.

ఇదే తరహాలో సెకండరీ మార్కెట్లోనూ యూపీఐ బ్లాక్ మెకానిజం(ఆస్బా తరహా సదుపాయం)ను తప్పనిసరిగా అర్హతగల స్టాక్ బ్రోకర్లు(క్యూఎస్‌బీలు) అందరూ తమ క్లయింట్లకు అందించాలని సెబీ ప్రతిపాదిస్తోంది.

ఎలా పనిచేస్తుందంటే: 2024 జనవరిలోనే ఈ యూపీఐ(యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) బ్లాక్ మెకానిజాన్ని సెబీ ఆవిష్కరించింది. దీని కింద క్లయింట్లు సెకండరీ మార్కెట్లో ట్రేడింగ్‌ను యూపీఐ ఆధారిత బ్లాక్ మెకానిజంతో చేయొచ్చు. అంటే మీరు ట్రేడింగ్ చేస్తున్న జెరోధా, అప్‌స్టాక్స్, గ్రో వంటి ప్లాట్‌ఫారాలకు నిధులను బదిలీ చేసే బదులు సొంత ఖాతాలోనే బ్లాక్ చేసిన మొత్తంతో ట్రేడింగ్ చేయొచ్చన్నమాట. అయితే ఈ సదుపాయాన్ని క్లయింట్లకు అందించడం ఇప్పటిదాకా ఆప్షనల్‌గా ఉంది. తాజా ప్రతిపాదన ద్వారా దీనిని తప్పనిసరి చేయాలని సెబీ భావిస్తోంది.

ఏమిటి ప్రయోజనాలు..

ఈ వ్యవస్థ వల్ల క్లయింట్ల నిధులు, షేర్లకు విస్తృత స్థాయి రక్షణ లభిస్తుందని సెబీ తన చర్చాపత్రంలో పేర్కొంది. మదుపర్లు/క్లయింట్లకు సెకండరీ మార్కెట్లో ట్రేడింగ్‌ను తమ సొంత బ్యాంకు ఖాతాలో బ్లాక్ చేసిన నిధుల ఆధారంగా చేసే అవకాశం లభిస్తుంది. తద్వారా స్టాక్ బ్రోకర్‌కు నిధులు బదిలీ చేసే బాధ తప్పుతుంది. క్లయింట్లకు, క్లియరింగ్ కార్పొరేషన్(సీసీ)కు మధ్య సెటిల్‌మెంట్ నేరుగా జరుగుతుంది. అన్నిటికంటే ముఖ్యంగా మదుపర్ల డబ్బులను బ్రోకర్లు దుర్వినియోగం చేయడానికి వీలుండదు. ఇంకా..

ట్రేడింగ్ సభ్యుడు/బ్రోకర్ ఎగవేతకు పాల్పడ్డా.. నిధులు లేదా షేర్లు తక్షణం వెనక్కి వేయడానికి వీలుంటుంది. ఇది అదనపు భద్రతను కల్పించినట్లు అవుతుంది.

క్లయింట్లు తమకు సేవలందిస్తున్న బ్రోకర్ నుంచి మరో బ్రోకర్‌కు మారడానికి(పోర్టింగ్) కూడా సులువుగా ఉంటుంది.

సేవింగ్స్ ఖాతాలో బ్లాక్ అయిన మొత్తంపై మదుపరికి వడ్డీ కూడా లభిస్తుంది.

యూపీఐ వ్యవస్థ తట్టుకోగలదా..

ప్రస్తుతం నగదు విభాగంలో దాదాపు 6.51 కోట్ల మంది క్లయింట్లు ఉన్నారు. ఒక వేళ వీరంతా యూపీఐ బ్లాక్ మెకానిజానికి మారితే యూపీఐ వ్యవస్థకు ఈ లావాదేవీలను ప్రాసెస్ చేసేందుకు తగిన సామర్థ్యం ఉంటుందా? అన్న ప్రశ్న తలెత్తవచ్చు. అయితే ప్రస్తుతం యూపీఐ నిర్వహిస్తున్న లావాదేవీల్లో ఇపుడు వీరూ చేరితే అదనంగా నిర్వహించాల్సిన లావాదేవీల సంఖ్య అందులో 0.67 శాతానికి మాత్రమే సమానంగా ఉంటుందని సెబీ అంచనా వేసింది. కాబట్టి ఎటువంటి ఇబ్బందుల్లేకుండా లావాదేవీల నిర్వహణకు వీలవుతుందని చెబుతోంది. ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురావడం కోసం ఇప్పటికే సీసీలు, ఎన్‌పీసీఐ, ట్రేడింగ్ సభ్యులు, బ్యాంకులతో విస్తృత స్థాయిలో మార్కెట్ నియంత్రణాధికార సంస్థ చర్చలను చేట్టింది. సదుపాయాన్ని అమలు చేయడంలో ఎదురయ్యే ఇబ్బందులపైనా మాట్లాడింది. సెప్టెంబరు 12లోగా ఈ ప్రతిపాదనలపై ప్రజలు తమ స్పందనలను తెలపవచ్చు.

# గాలా ప్రెసిషన్ ఐపీఓ.. నిమిషాల్లో పూర్తి సబ్‌స్క్రిప్షన్

దిల్లీ: గాలా ప్రెసిషన్ ఇంజినీరింగ్ ఐపీఓకు అనూహ్య స్పందన లభించింది. నేడు ప్రారంభమైన నిమిషాల్లోనే షేర్లన్నీ పూర్తిగా సబ్‌స్క్రైబ్ అయ్యాయి. 22.24 లక్షల షేర్లు పబ్లిక్ ఇష్యూలో అందుబాటులో ఉండగా.. ఉదయం 11.21 గంటలకే 47.77 లక్షల షేర్లకు (2.15 రెట్లు) బిడ్లు దాఖలయ్యాయి. రిటైల్ సెగ్మెంట్‌లో 3.15 రెట్లు, సంస్థాగతేతర మదుపర్ల విభాగంలో 2.54 రెట్ల షేర్లకు దరఖాస్తులు లభించాయి. సెప్టెంబరు 4 వరకు సబ్‌స్క్రిప్షన్ కొనసాగనుంది.





గాలా ప్రెసిషన్ ఇంజినీరింగ్ తమ ఐపీఓ ధరను రూ.503-529గా నిర్ణయించింది. రిటైల్ మదుపర్లు రూ.14,812తో కనీసం 28 షేర్లకు బిడ్లు దాఖలు చేయాల్సి ఉంటుంది. గరిష్ఠ ధర వద్ద మొత్తం రూ.168 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ ఐపీఓ (%ఖూా%)లో రూ.135.34 కోట్లు విలువ చేసే 25.58 లక్షల కొత్త షేర్లతో పాటు రూ.32.58 కోట్లు విలువ చేసే షేర్లు ఆఫర్ ఫర్ సేల్ కింద అందుబాటులో ఉన్నాయి. ఐపీఓ ద్వారా సమీకరించిన నిధులను తమిళనాడులో కొత్త తయారీ కేంద్రం ఏర్పాటు, కొత్త పరికరాల కొనుగోలు, రుణ చెల్లింపులు వంటి వాటికి వినియోగిస్తామని కంపెనీ వెల్లడించింది. మరికొన్ని నిధులను కార్పొరేట్ అవసరాలకు కూడా వాడతామని చెప్పింది.

గాలా ప్రెసిషన్ ఇంజినీరింగ్ డిస్క్ అండ్ స్ట్రిప్ స్ప్రింగ్స్ బీ కాయిల్ అండ్ స్పైరల్ స్ప్రింగ్స్ స్పెషల్ ఫాస్టెనింగ్ సొల్యూషన్ (%ాఖీ%) వంటి టెక్నికల్ స్ప్రింగులకు సంబంధించిన ప్రెసిషన్ పరికరాలను తయారుచేస్తుంటుంది. కంపెనీ తమ ఉత్పత్తులను 'ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫ్యాక్చరింగ్' కంపెనీలు, టైర్-1, ఛానెల్ పార్ట్‌నర్లకు అందజేస్తుంటుంది. విండ్ టర్బైన్, హైడ్రోపవర్ ప్లాంట్లు సహా విద్యుత్తు, మౌలిక, సాధారణ ఇంజినీరింగ్, వాహన, రైల్వే రంగాల్లో ఉపయోగించే ఎక్విప్‌మెంట్లలో ఈ కంపెనీ ఉత్పత్తులను వినియోగిస్తుంటారు. పీఎల్ క్యాపిటల్ మార్కెట్ ప్రైవేట్ లిమిటెడ్.. ఈ ఐపీఓ కి బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్‌గా వ్యవహరిస్తోంది.

# విజయవాడ - బెంగళూరుకు ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం

%ముంబయి: పలు కొత్త మార్గాల్లో విమాన సర్వీసులను ప్రారంభించినట్లు ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ తెలిపింది. కొత్త మార్గాల్లో విజయవాడ- బెంగళూరు, హైదరాబాద్- గువాహటి, బెంగళూరు- ఇండోర్ ఉన్నాయి. అగర్తలా నుంచి గువాహటి, కోల్‌కతాలకు కూడా విమాన సేవలను సంస్థ ప్రారంభించింది. అగర్తలా నుంచి వారానికి 14 విమాన సర్వీసులను కంపెనీ నిర్వహించనుంది.





75 నిమిషాల్లో జాఫ్నాకు: ఇండిగో

చెన్నై నుంచి శ్రీలంకలోని జాఫ్నాకు రోజువారీ విమాన సర్వీసులను ఇండిగో ఆదివారం ప్రారంభించింది. నేరుగా విమాన సర్వీస్ కావడం వల్ల చెన్నై నుంచి జాఫ్నాకు ప్రయాణ సమయం 75 నిమిషాలకు తగ్గుతుందని కంపెనీ తెలిపింది.

# పసుపు దిద్దుబాటు

పసిడి పసిడి అక్టోబరు కాంట్రాక్టు ఈవారం సానుకూల ధోరణిలో చలిస్తే రూ.72,096 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.72,542బీ రూ.72,833 వరకు పెరిగే అవకాశం ఉంటుంది. ఒకవేళ రూ.71,359 దిగువన చలిస్తే రూ.71,068బీ రూ.70,622 వరకు దిద్దుబాటు కావచ్చు. రూ.72,096 ఎగువన షార్ట్ సెల్ పొజిషన్లకు దూరంగా ఉండాలి.

వెండి

వెండి డిసెంబరు కాంట్రాక్టు కిందకు వస్తే రూ.83,905 వద్ద మద్దతు లభించొచ్చు. ఈ స్థాయిని కోల్పోతే రూ.82,563బీ రూ.80,124కు దిగిరావచ్చు. ఒకవేళ పైకి వెళితే రూ.87,686 వద్ద నిరోధం ఎదురయ్యే అవకాశం ఉంది. ఈ స్థాయిని మించితే రూ.90,125బీ రూ.91,467 వరకు రాణించొచ్చు.



ప్రాథమిక లోహాలు

రాగి సెప్టెంబరు కాంట్రాక్టు రూ. 801.50 కంటే దిగువన కదలాడకుంటే సానుకూల ధోరణికి అవకాశముంది. ఈ స్థాయి దిగితే మాత్రం రూ.797.55 వద్ద మద్దతు లభించొచ్చు. దీనిని కూడా కోల్పోతే రూ.789.05బీ రూ.777.65కు పడిపోవచ్చు.

సీసం సెప్టెంబరు కాంట్రాక్టు రూ.184.25 కంటే దిగువన కదలాడకుంటే రాణించేందుకు ఆస్కారం ఉంటుంది. అయితే రూ.188.45 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయినీ అధిగమిస్తే రూ.191.10బీ రూ.192.65 వరకు పెరగొచ్చు. ఒకవేళ రూ.184.25 కంటే కిందకు వస్తే రూ.182.70బీ రూ.180.05కు చేరొచ్చు.

జింక్ సెప్టెంబరు కాంట్రాక్టు రూ.268 కంటే దిగువన కదలాడితే ప్రతికూల ధోరణికి అవకాశం ఉంటుంది. అదేవిధంగా రూ.269 ఎగువన చలిస్తే సానుకూలంగా కదలాడొచ్చు.

అల్యూమినియం సెప్టెంబరు కాంట్రాక్టు రూ.220.90 కంటే కిందకు వస్తే రూ.216.55బీ రూ.207.95 వరకు దిద్దుబాటు కావచ్చు. ఒకవేళ రూ.233.85 స్థాయిని మించితే రూ.242.45బీ రూ.246.85 వరకు పెరిగే అవకాశం ఉంటుంది.

ఇంధన రంగం

ముడి చమురు సెప్టెంబరు కాంట్రాక్టు రూ.6,080 కంటే దిగువన కదలాడితే రూ.5,959బీ రూ.5,741కు చేరొచ్చు. సానుకూల ధోరణిలో చలిస్తే రూ.6,419 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. దీనిని అధిగమిస్తే రూ.6,637బీ రూ.6,758 వరకు పెరగొచ్చు.

# బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ ఐపీఓ 9 నుంచి

దిల్లీ: బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ఈ నెల 9 నుంచి ప్రారంభం కాబోతోంది. ఈ ఇష్యూ ద్వారా రూ.6,560 కోట్ల నిధుల్ని సమీకరించాలన్నది సంస్థ ప్రణాళిక. యాంకర్ మదుపర్లు బిడ్లు దాఖలు చేయడానికి ఈ నెల 6న అవకాశం కల్పించారు. సాధారణ మదుపర్లు 9-11 తేదీల్లో బిడ్లు దాఖలు చేయొచ్చు. ఈ ఐపీఓలో భాగంగా రూ.3,560 కోట్ల విలువైన తాజా ఈక్విటీ షేర్లను సంస్థ జారీ చేస్తుంది. రూ.3,000 కోట్ల విలువైన షేర్లను మాతృ సంస్థ బజాజ్ ఫైనాన్స్ ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్‌ఎస్)లో విక్రయించనుంది.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నిబంధనలకు అనుగుణంగా 2025 సెప్టెంబరులోపు అప్పర్ లేయర్ బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీలు) స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు కావాల్సి ఉన్నందునే, బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ ఐపీఓకు వస్తోంది. కోటక్ మహీంద్రా క్యాపిటల్ కంపెనీ, బ్యాంక్ ఆఫ్ అమెరికా సెక్యూరిటీస్ ఇండియా, ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్, గోల్డ్‌మ్యాన్ శాక్స్ (ఇండియా) సెక్యూరిటీస్ ప్రైవేట్ లిమిటెడ్, జేఎం ఫైనాన్షియల్‌లు ఈ ఇష్యూకు బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా వ్యవహరిస్తున్నాయి.

2023-24లో ఈ సంస్థ రూ.1,731 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. 2022-23 లాభం రూ.1,258 కోట్లతో పోలిస్తే ఇది 38% ఎక్కువ.

# కాలుష్యంతో గర్భిణుల్లో ఫ్లూ

వాయు కాలుష్యం బారినపడకుండా గర్భిణులను కాపాడుకోవటం ఎంతైనా అవసరమని తాజా అధ్యయనం సూచిస్తోంది. గాలిలోని అతి సూక్ష్మ రేణువుల (యూఎఫ్‌పీలు) మూలంగా గర్భిణుల్లో శ్వాసకోశ వైరల్ ఇన్‌ఫెక్షన్ ముప్పు పెరుగుతున్నట్టు తేలటమే దీనికి కారణం. వాయు కాలుష్యం



ఊపిరితిత్తుల్లోని రక్షణ వ్యవస్థను ప్రభావితం చేస్తుంది. ఫలితంగా వైరల్ ఇన్‌ఫెక్షన్ల ముప్పూ పెరుగుతుంది. మామూలుగానే గర్భిణులకు తీవ్ర ఫ్లూ ముప్పు ఎక్కువ. అయినా కూడా వాయు కాలుష్యం, ఇన్‌ఫ్లూయెంజా మధ్య సంబంధంపై ఇప్పటివరకూ పెద్దగా అధ్యయనాలు జరగలేదు. దీనిపై లోతుగా దృష్టి సారించాలని.. తల్లుల ఆరోగ్యం మీద స్వల్పకాలంలో, దీర్ఘకాలంలో పడే ప్రభావాలను నివారించటానికిది అవసరమని పరిశోధకులు చెబుతున్నారు. గర్భిణుల్లో రక్తం మరింత ఎక్కువగా పంప్ కావటం.. శ్వాసించేటప్పుడు ఎక్కువ మొత్తంలో గాలిని తీసుకోవటం, వదలటం.. పిండాన్ని రక్షించటానికి తోడ్పడే కొన్ని రోగనిరోధక కణాల్లో మార్పులు సంభవించటం వంటివన్నీ వీరిలో వైరల్ ఇన్‌ఫెక్షన్ ముప్పు పెరగటానికి దోహదం చేస్తున్నాయని వివరిస్తున్నారు. ఫ్లూ టీకా సమర్థమైంది, సురక్షితమైంది అయినప్పటికీ గర్భిణుల్లో దీని సామర్థ్యం 50% కన్నా తక్కువగానే ఉంటుంది. అందువల్ల టీకా తీసుకున్నప్పటికీ వీరికి శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ ముప్పు ఎక్కువగానే ఉంటుందని పరిశోధకులు గుర్తుచేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి పది అకాల మరణాల్లో తొమ్మిదింటికి కాలుష్యమే కారణమవుతోంది. వాయు మిశ్రమాలు, అతి సూక్ష్మ రేణువులు ఎంతోమందికి ప్రాణాంతకంగా పరిణమిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వాయు కాలుష్యంతో ప్రమాదం ఎక్కువగా గలవారిని గుర్తించి, కాపాడుకోవాల్సిన అవసరముందని పరిశోధకులు చెబుతున్నారు. ముఖ్యంగా ఫ్లూ, యూఎఫ్‌పీలు ఎక్కువగా ఉండే పట్టణ ప్రాంతాల్లో గర్భిణులను కాపాడుకోవటానికి కాలుష్య నియంత్రణ చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.


# పాత జలుబు కొత్తగా..

ఇదిగో జలుబు అంటే అదిగో కరోనా అన్నట్టుగా మారింది పరిస్థితి. ఏ కొత్త వైరస్ విజృంభించినా మహమ్మారిలా మారుతుందేమోననే వణికిపోతున్నాం. కొవిడ్ అంతలా భయపెట్టింది! అందుకేనేమో మామూలుదైన హెచ్3ఎన్2 వైరస్‌కూ ఇప్పుడు బెంబేలెత్తిపోతున్నాం. నిజానికి అంత ఆందోళన అవసరం లేదు. కొవిడ్‌లా ఇదేమీ కొత్తది కాదు. ఏటా వచ్చే సీజనల్ ఫ్లూనే. అలాగని అసలే ప్రమాదం లేదనుకోలేం. కొందరికి తీవ్రంగానూ పరిణమించొచ్చు. కాబట్టి జాగ్రత్త అవసరం.

ఏటా కాలాల వారీగా వచ్చే ఫ్లూ మనదేశంలో అంత ప్రమాదకరమైంది కాదు. దీన్ని అంతగా పట్టించుకునేవారూ కాదు. స్వైన్‌ఫ్లూ రాకతో ఇదెంత ప్రమాదకరమైందో తెలిసొచ్చింది. అది కొందరిలో న్యుమోనియాకు దారితీయటం, ప్రాణాంతకంగా పరిణమించటం తెలిసిందే. అప్పటి నుంచీ ఫ్లూ విషయంలో నిర్లక్ష్యం తగదనే అవగాహన పెరిగింది. ఆసుపత్రుల్లోనూ ప్రత్యేకించి దీనిపై దృష్టి సారిస్తున్నారు. ప్రస్తుతం హెచ్3ఎన్2 కొత్తగా విజృంభిస్తుండటంతో కలకలం మొదలైంది. కాలాల వారీగా వచ్చే ఫ్లూలో ఇదొకరకం.

# ఆస్థమా శాపం కాదు

ఆస్థమా దీర్ఘకాల సమస్యే కావొచ్చు. జీవితాంతం వేధించేదే కావొచ్చు. అంతమాత్రాన భయపడాల్సిందేమీ లేదు. శాపంగా భావించాల్సిన పనీ లేదు. దీనికిప్పుడు మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. వీటిని క్రమం తప్పకుండా వాడుకుంటే ఆస్థమాను చాలావరకు నియంత్రణలో ఉంచుకోవచ్చు. అయితే మనదేశంలో మందులపై సరైన అవగాహన లేకపోవటం.. జబ్బు మీద అపోహలు, భయాలు నెలకొనటం పెద్ద సమస్యగా పరిణమిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆస్థమా బాధితులతో పోలిస్తే మనదేశంలో 13% మంది దీంతో బాధపడుతుండగా.. ఆస్థమా మరణాల్లో 42% మనదగ్గరే సంభవిస్తుండటం గమనార్హం. ఇలాంటి వ్యత్యాసాలను తగ్గించే ఉద్దేశంతోనే 'ఆస్థమా చికిత్స అందరికీ' అని వరల్డ్ ఆస్థమా డే నినదిస్తోంది. ఈ నేపథ్యంలో ఆస్థమా ఎందుకు వస్తుంది? ఎలా నియంత్రణలో ఉంచుకోవచ్చు? అనేవి తెలుసుకొని ఉండటం మంచిది.



ఆస్థమా ప్రధానంగా ఊపిరితిత్తుల్లోని గాలి గొట్టాల సమస్య. దీనికి మూలం అలర్జీ. కంట్లో నలుసు పడితే దురద పుడుతుంది కదా. కన్ను ఎరుపెక్కటం, నీరు కారవటమూ మొదలవుతాయి. సరపడని పదార్థాలు తగిలినపుడు ఊపిరితిత్తుల్లోనూ ఇలాగే జరుగుతుంది. మనం ముక్కుతో పీల్చుకునే గాలి శ్వాసనాళం ద్వారా ఊపిరితిత్తుల లోపలికి చేరుకుంటుంది. ఈ శ్వాసనాళం పైనుంచి రెండుగా చీలుతూ వచ్చి.. మళ్లీ చిన్నచిన్న గొట్టాలుగా విడిపోతూ.. అతి సూక్ష్మమైన గాలిగదుల్లోకి గాలిని చేరవేస్తుంది. సాధారణంగా దుమ్ము ధూళి ఉన్న ప్రాంతాలకు వెళ్లినప్పుడు దగ్గు రావటం మామూలే. ఇది హాని కారకాలు లోపలికి ప్రవేశించకుండా, వాటిని బయటకు నెట్టివేయటానికి శరీరం చేసే ప్రయత్నమే. అయితే ఆస్థమా వచ్చే స్వభావం (అటోపీ) గలవారికి ఇలాంటి మామూలు విషయాలే పెద్ద సమస్యగా మారతాయి. దుమ్మూ ధూళి, పుప్పొడి, రసాయనాల వంటివి తగిలినప్పుడు లోపల అలర్జీ ప్రేరేపితమై గాలిగొట్టాలు విపరీతంగా స్పందిస్తుంటాయి. ఆస్థమాకు మూలం ఇదే. గాలిగొట్టాలకు అలర్జీ కారకాలు తగిలినప్పుడు రోగనిరోధక కణాలు అతిగా స్పందిస్తాయి. దీంతో వాపు ప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్) మొదలవుతుంది. అప్పుడు గాలిగొట్టాల గోడలు ఉబ్బి, లోపలి మార్గం సన్నబడుతుంది. గాలి గొట్టాల్లో జిగురుద్రవం ఉత్పత్తీ పెరుగుతుంది. ఇది లోపలే చిక్కుకు పోతుంది. చుట్టుపక్కలా వాపు మాదిరి మార్పులు మొదలవుతాయి. దీంతో శ్వాస తీసుకోవటం, వదలటం కష్టమైపోతుంది. ఫలితంగా దగ్గు, పిల్లికూతలు, ఊపిరి అందక ఉక్కిరిబిక్కిరి అవటం వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. ఈ లక్షణాలు కొందరిలో కొద్దిసేపే ఉండొచ్చు. ఒకట్రెండు లక్షణాలే ఉండొచ్చు. కొందరికి ప్రత్యేకించి కొన్ని సమయాల్లోనే తలెత్తొచ్చు. కొందరికి నిరంతరం వేధిస్తుండొచ్చు. కొందరికి ఎలాంటి లక్షణాలు లేకుండానూ ఆస్థమా ఉండొచ్చు (సైలెంట్ చెస్ట్).

ఎవరికి? ఎందుకు?

పిల్లల దగ్గర్నుంచి వృద్ధుల వరకూ ఎవరికైనా ఆస్థమా రావొచ్చు. అయితే ఆస్థమా బాధితుల్లో సుమారు సగం మందికి పదేళ్ల వయసులోపే తొలి లక్షణాలు మొదలవుతుంటాయి. ఆస్థమాతో బాధపడే పిల్లల్లో చాలామందిలో ఆరేళ్లలోపే తొలిసారి ఆస్థమా దాడి చేయటం చూస్తుంటాం. దీనికి ప్రధాన కారణం వంశపారంపర్యంగా సంక్రమించే జన్యువులు. అయితే తల్లిదండ్రులకు ఆస్థమా ఉన్నంత మాత్రాన పుట్టే పిల్లలకు తప్పకుండా రావాలనేమీ లేదు. తల్లిదండ్రులిద్దరికీ ఆస్థమా ఉంటే పిల్లలకు 70% వరకు రావొచ్చు. తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరికే ఆస్థమా ఉంటే 30% వరకు వచ్చే అవకాశముంది. అదేపనిగా అలర్జీ కారకాలకు గురవుతున్నప్పుడు జన్యువులు లేకపోయినా ఆస్థమా దాడి చేయొచ్చు. ఆస్థమా బాధితుల్లో సుమారు 6% మంది ఇలాంటివారే. పుట్టుకతో ఆస్థమా జన్యు స్వభావం ఉన్నా అందరికీ సమస్యలు తెచ్చిపెట్టకపోవచ్చు. చాలావరకు నిద్రాణంగానే ఉంటుంది. అలర్జీ కారకాల ప్రభావానికి గురైనప్పుడు ఈ జన్యు స్వభావం బయటపడుతుంది. ఎండుగజ్జి లేదా ఆహార అలర్జీ గల పిల్లలకు ఆస్థమా ముప్పు ఎక్కువ. మానసిక ఆందోళన, ఒత్తిడి, కొన్నిరకాల వృత్తులు, ఇన్‌ఫెక్షన్ల వంటివీ ఆస్థమాను ప్రేరేపించొచ్చు.

లక్షణాలేంటి?

దగ్గు.. ముఖ్యంగా పడని వాతావరణంలో దగ్గు వస్తుంటుంది. శ్వాస తీసుకోవటం, వదలటంలో ఇబ్బంది కలుగుతుంది. ఛాతీ బరువుగా, బిగుతుగానూ అనిపించొచ్చు. శ్వాసిస్తున్నప్పుడు, దగ్గినప్పుడు పిల్లికూతలు వస్తుంటాయి. అయితే అందరిలో అన్ని లక్షణాలూ ఉండాలనేమీ లేదు. కొందరికి దగ్గు ఒక్కటే ఉండొచ్చు. పిల్లికూతలు, ఆయాసం అంతగా ఉండకపోవచ్చు. దీని లక్షణాలూ వస్తూ పోతుంటాయి కూడా. కొందరికి ఉన్నట్టుండి తలెత్తొచ్చు. తీవ్రంగానూ ఉండొచ్చు. ఇలాంటి సమయంలో శ్వాస తీసుకోవటం చాలా కష్టమైపోతుంది.

ఇన్‌హేలర్లపై అనుమానాలొద్దు

ఇన్‌హేలర్లు సురక్షితం. ఆందోళన, అనుమానాలు వద్దు. ఆస్థమా చాలా తీవ్రంగా ఉంటేనే, చివరిదశలోనే ఇన్‌హేలర్లు వాడుతారని అనుకోవద్దు. ఇవి ప్రాథమిక, ఉత్తమ చికిత్స సాధనాలని తెలుసుకోవాలి. వీటితో తీసుకునే మందు మోతాదు మైక్రోగ్రాముల్లో ఉంటుంది. నేరుగా శ్వాసమార్గాల్లోకే చేరుకుంటుంది. కాబట్టి పెద్దగా నష్టమేమీ ఉండదు. ఈ మందులకు అలవాటు పడటమనేది ఉండదు.

ఆస్థమా పిల్లల విషయంలో– 'పెరిగే వయసు కదా. ఇప్పట్నుంచే ఇన్‌హేలర్లు ఎందుకు?' అని కొందరు వెనకాడుతుంటారు. స్టిరాయిడ్ల వాడకంతో ఎదుగుదల కుంటుపడుతుందని భయపడుతుంటారు. ఇది తప్పు. ఆస్థమా నియంత్రణలో లేకపోతేనే ఎదుగుదల దెబ్బతింటుంది. డాక్టర్ సూచించిన మోతాదులో మందు వాడితే ఎలాంటి దుష్ప్రభావాలూ ఉండవు.

ఇన్‌హేలర్లు ఖరీదైనవని మరికొందరి అభిప్రాయం. మాత్రలతో పోలిస్తే వీటి ధర ఎక్కువే కావొచ్చు. కానీ వీటిని సరిగా వాడకపోవటం వల్ల ఆసుపత్రిలో చేరితే అయ్యే ఖర్చుతో పదేళ్లకు సరిపడిన ఇన్‌హేలర్ మందులు కొనుక్కోవచ్చు.

బయటి ఊళ్లకు వెళ్లినా వెంట ఇన్‌హేలర్లు తీసుకెళ్లాలి. వీటి వాడుకోవటాన్ని నామోషీగా భావించొద్దు. ఇన్‌హేలర్ వాడకంలో తప్పులు చేయొద్దు. దీన్ని నొక్కుతూనే మందును లోనికి పీల్చుకోవాల్సి ఉంటుంది. ఇన్‌హేలర్‌కు స్పేసర్‌ను జోడించి మందు పీల్చుకోవటం అన్ని విధాలా మంచిది.

# ఎండకు బాల గుండెలు జాగ్రత్త



ఎండ వేడిని తట్టుకోవటం ఎవరికైనా కష్టమే. గుండెలో రంధ్రాలతో పుట్టిన పిల్లలకైతే మరీ కష్టం. పుట్టిన తర్వాత గుండెజబ్బుల బారినపడే చిన్నారులకూ ఇబ్బందే. అందువల్ల వేసవిలో ఇలాంటి పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకోవటం తప్పనిసరి.

సాధారణంగా ఆక్సిజన్‌తో కూడిన 'మంచి' రక్తం, ఆక్సిజన్‌ను కణాలు వాడుకున్నాక మిగిలే 'చెడు' రక్తం ధమనుల్లో, సిరల్లో వేర్వేరుగా ప్రవహిస్తుంటుంది. గుండెలోనూ వేర్వేరు గదులు ఇవి కలిసిపోకుండా చూస్తాయి. అయితే గుండె గదుల మధ్య గోడలకు రంధ్రాలు గల పిల్లల్లో మంచి, చెడు రక్తం కలిసిపోతుంటాయి. దీంతో రక్తంలో ఆక్సిజన్ మోతాదు తగ్గిపోతుంది. ఫలితంగా అవయవాలకు తగినంత ఆక్సిజన్ అందదు. అప్పుడు రక్తం సరిపోవటం లేదనే ఉద్దేశంతో శరీరం మరింత ఎక్కువగా రక్తం ఉత్పత్తయ్యేలా చేస్తుంది. దీంతో ఎర్ర రక్తకణాలు ఎక్కువగా ఉత్పత్తి అవుతాయి. వీటి సంఖ్య మరీ ఎక్కువైతే రక్తం బాగా చిక్కగా అవుతుంది. ఎండాకాలంలో దీని ముప్పు మరింత ఎక్కువవుతుంది.

రక్తం చిక్కబడితే ప్రమాదం

వేసవిలో వాతావరణ ఉష్ణోగ్రత బాగా పెరుగుతుంది. వేడిని తట్టుకోవటానికి ఒంట్లోని నీరు చెమట రూపంలో ఎక్కువగా బయటకు పోతుంది. దీంతో ఒంట్లో నీటిశాతం తగ్గి, రక్తం చిక్కబడే ముప్పు తలెత్తుతుంది. ఒకవేళ వాంతులు, విరేచనాలు అవుతుంటే ఇది మరింత ఎక్కువవుతుంది కూడా. రక్తం చిక్కబడినప్పుడు తలనొప్పి, తీవ్రమైన అలసట, మగ వంటి లక్షణాలు (హైపర్ విస్కాసిటీ సిండ్రోమ్) తలెత్తుతాయి. రక్తం సిరల్లో గడ్డకట్టే ప్రమాదమూ (వీనస్ థ్రాంబోసిస్) ఉంటుంది. తలలోని సిరల్లో రక్తం గడ్డలు ఏర్పడితే మెదడులో చీము పట్టి పరిస్థితి తీవ్రమవుతుంది. కాబట్టి గుండె లోపాలతో పుట్టిన పిల్లల విషయంలో వేసవిలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి.

జాగ్రత్తగా ఉండాలి

గుండె లోపాలు గల పిల్లలను ఎండలో ఎక్కువగా తిరగనీయొద్దు. వీరిని చెమట ఎక్కువగా పట్టే బీచ్‌ల వంటి చోట్లకు తీసుకెళ్లటం మంచిది కాదు.

నీరు, ద్రవాలు ఎక్కువగా తాగించాలి. పండ్ల రసాలు కూడా మంచివే.

వాంతులు, విరేచనాలు అవుతుంటే వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలి. అవసరమైతే సెలైన్ ఎక్కించాల్సి ఉంటుంది.

గుండెలో రంధ్రం గల పిల్లలు తలనొప్పి వస్తుందన్నా, రోజూ జ్వరం వస్తున్నా, కళ్లు సరిగా కనిపించటం లేదన్నా తాత్సారం చేయకుండా ఆసుపత్రికి తీసుకెళ్లాలి. అవసరమైతే సీటీ స్కాన్ చేయించాలి. మెదడులో చీము, మెదడు సిరల్లో రక్తం గడ్డలుంటే తక్షణం చికిత్స చేయించాలి.

తలనొప్పి ఎక్కువగా ఉన్నప్పుడు.. మగత, ఆయాసం, అలసట ఉన్నప్పుడు రక్తం చిక్కదనాన్ని తెలిపే పీసీవీ పరీక్ష చేయించాలి. చిక్కదనం మరీ ఎక్కువైతే కొన్నిసార్లు కొంత రక్తాన్ని బయటకు తీయాల్సి రావొచ్చు.

రక్తంలో ఆక్సిజన్ శాతం తగ్గటం వల్ల కొందరు పిల్లలు నీలంగా మారుతుంటారు (బ్లూ బేబీస్). బిగ్గరగా ఏడ్చినా కూడా పెదవులు, గోళ్లు, ముఖం వంటివి నీలంగా మారుతుంటాయి. ఇలాంటి పిల్లలకు చిన్నప్పుడు షంట్ ఆపరేషన్ చేసి, కొద్ది సంవత్సరాల తర్వాత పెద్ద ఆపరేషన్ చేస్తుంటారు. వీరి విషయంలో వేసవిలో ఇంకాస్త ఎక్కువ జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే రక్తం చిక్కబడి, షంట్ మూసుకుపోయే ప్రమాదముంది. వీరికి అవసరాన్ని బట్టి డాక్టర్లు ఆస్ప్రిన్ మాత్రలు సూచిస్తుంటారు. వీటిని క్రమం తప్పకుండా వేసుకునేలా చూడాలి.

పుట్టిన తర్వాత– గుండె వైఫల్యం (కార్డియో మయోపతీ) తలెత్తిన పిల్లలకు దీర్ఘకాలం వైద్యం అవసరం. వీరికి డాక్టర్లు ఒంట్లోంచి నీరు ఎక్కువగా బయటకు పోవటానికి మందులు సూచిస్తుంటారు. ఈ మందులు వేసుకునేవారికి ఎండాకాలంలో మరింత ఎక్కువగా ఒంట్లోంచి నీరు బయటకు పోయి, ఖనిజ లవణాలు తగ్గిపోవచ్చు. దీంతో బాగా నీరసిస్తారు. కొన్నిసార్లు గుండె లయ తప్పొచ్చు. ఇది చాలా ఇబ్బందులకు దారితీయొచ్చు. కాబట్టి వీరి విషయంలో ముందే డాక్టర్‌ను సంప్రదించి, మందుల మోతాదులో అవసరమైన మార్పులు చేసుకోవాలి. పల్మనరీ హైపర్‌టెన్షన్‌తో బాధపడే పిల్లల విషయంలోనూ జాగ్రత్తగా ఉండాలి. ఎండలో ఎక్కువగా తిరిగితే వీరికి వేసోవేగల్ సింకోప్ సమస్య తలెత్తొచ్చు. ఇందులో ఉన్నట్టుండి రక్తపోటు తగ్గిపోయి, పిల్లలు కింద పడిపోవచ్చు. కొన్నిసార్లు మరణించే ప్రమాదమూ ఉంటుంది. కాబట్టి పల్మనరీ హైపర్‌టెన్షన్ గల పిల్లలను ఎండలో ఎక్కువగా తిరగనీయకూడదు.

# సురక్షిత క్యాన్సర్ మందుల దిశగా..

సురక్షిత క్యాన్సర్ మందుల ఆవిష్కరణ దిశగా మరో ముందడుగు పడింది. కొన్ని క్యాన్సర్ చికిత్సలు గుండెను దెబ్బతీయటానికి గల కారణాన్ని యూసీఎల్ పరిశోధకులు గుర్తించారు మరి. క్యాన్సర్ చికిత్సలో అధునాతన ఔషధాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. మరణాల నుంచి కాపాడుతున్నాయి. జీవనకాలాన్ని పెంచుతున్నాయి. అయితే కొన్ని క్యాన్సర్ చికిత్సలు గుండెను దెబ్బతీస్తుంటాయి. ఇది రకరకాల రూపాల్లో ఉండొచ్చు. కొందరిలో గుండె పంపింగ్ సామర్థ్యం తగ్గితే.. కొందరిలో గుండె వైఫల్యం సంభవించొచ్చు. కానీ ఈ మందులు గుండెను ఎలా దెబ్బతీస్తున్నాయనేది తెలియకుండానే ఉండిపోయింది. దీని విషయంలో యూసీఎల్ పరిశోధకులు ఓ కొత్త విషయాన్ని గుర్తించారు. గుండెజబ్బు ముప్పు పెరగటానికి దోహదం చేసే రక్తంలోని ప్రొటీన్లు క్యాన్సర్ చికిత్సలో వాడే మందులతోనూ ప్రభావితమవుతున్నాయని కనుగొన్నారు. ఈ మందులు గుండెను ఎలా దెబ్బతీస్తున్నాయో విశ్లేషించటానికి, గుండెజబ్బు ముప్పు గలవారిని గుర్తించటానికి తమ అధ్యయన ఫలితాలు తోడ్పడగలవని పరిశోధకులు చెబుతున్నారు. మున్ముందు సురక్షిత క్యాన్సర్ మందుల ఆవిష్కరణకూ దారితీయగలవని ఆశిస్తున్నారు. గుండె వైఫల్యం వంటి గుండె జబ్బుల చికిత్సకు కొత్త మందుల రూపకల్పనకూ



ఈ అధ్యయనం దారులు తెరచింది. గుండెజబ్బు ముప్పుతో ముడిపడిన ప్రొటీన్లను అడ్డుకోవటం లేదా ముప్పును తగ్గించే ప్రొటీన్లను ప్రేరేపితం చేయగలిగే మందులతో మంచి ఫలితం కనిపించొచ్చని భావిస్తున్నారు.

# ఇదేం కడుపునొప్పి?

మీరు ఎండోస్కోపీ, కొలనోస్కోపీ చేయించుకున్నారు. పెద్దగా సమస్యలేమీ బయటపడలేదు. కాబట్టి ప్రమాదకరమైన జబ్బేదీ లేకపోవచ్చు. మీరు వాడుతున్న మందులతో అన్నవాహికలోకి జీర్ణరసాలు ఎగదన్నుకొని రావటం (రిఫ్లక్స్), డ్యుయోడినమ్ అల్సర్ సమస్యలు ఇప్పటికే తగ్గిపోయి ఉండాలి. అయినా నొప్పి, మంట తగ్గలేదంటే ఇతరత్రా సమస్యలేవైనా ఉన్నాయేమో చూడాల్సి ఉంటుంది. మీరు తెలిపిన లక్షణాలను బట్టి ఇరిటబుల్ బవల్ సిండ్రోమ్ (ఐబీఎస్) లేదా నాన్ అల్సర్ డిస్‌పెప్సియాలో ఏదో ఒకటి ఉండొచ్చని అనిపిస్తోంది. ఐబీఎస్‌లో రకరకాల లక్షణాలుంటాయి. వీటిల్లో ఒకటి తరచూ నొప్పి రావటం. విరేచనాలు, మలబద్ధకం కూడా ఉండొచ్చు. కొందరిలో ఇవి రెండూ కలిసి ఉండొచ్చు. నాన్ అల్సర్ డిస్‌పెప్సియాలో పుండు లేకపోయినా అజీర్ణం, మంట వంటివి వేధిస్తుంటాయి. కాబట్టి ఆయా లక్షణాలను బట్టి చికిత్స చేయాల్సి ఉంటుంది. నొప్పి, మంట తగ్గటానికి ఒమిప్రాజోల్ ఒక్కటే కాదు.. ఇతరత్రా మందులూ ఉన్నాయి. ముఖ్యంగా ప్రొకైనటిక్స్ రకం మందులు మేలు చేస్తాయి. ఇరిటబుల్ బవల్ సిండ్రోమ్ అయితే పేగుల కదలికలను నియంత్రించే మందులు ఉపయోగపడతాయి. వీటిని వైద్యుల పర్యవేక్షణలో ఆరంభించాల్సి ఉంటుంది. ముందుగా ఏ మందు పనిచేస్తుందో గుర్తించి, వాటిని వాడుకోవాల్సి ఉంటుంది. కొన్నిసార్లు మానసిక ఒత్తిడితోనూ నొప్పి, మంట వంటివి తలెత్తొచ్చు. కాబట్టి యోగా, ధ్యానం వంటి వాటితో మానసిక ప్రశాంతత సాధించేందుకు ప్రయత్నించాలి. ఏవైనా పదార్థాలు తిన్నప్పుడు ప్రత్యేకించి నొప్పి, మంట వస్తున్నట్టు గుర్తిస్తే ఆపెయ్యాలి. ఐబీఎస్ గలవారికి త్వరగా జీర్ణం కాని పిండి పదార్థాలు



తక్కువగా ఉండే లో ఫాడ్‌మ్యాప్ ఆహార పద్ధతి ఉపయోగపడుతుంది. దీని గురించి డాక్టర్‌ను అడిగి తెలుసుకోవాలి. కొన్ని జబ్బులు పరీక్ష చేసినప్పుడు చిన్నగా ఉండటం వల్ల కనిపించకపోవచ్చు. కొంతకాలం తర్వాత బయటపడొచ్చు. కాబట్టి మీరు క్రమం తప్పకుండా వైద్యుడిని సంప్రదిస్తూ ఉండటం మంచిది.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy